


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

బంగారు 'బట్టమేక' గుట్టు చిక్కింది

క్రూర జంతువుల దృష్టిని మరల్చటంలో బట్టమేక పక్షులు బహుతెలివైనవి. గుడ్లను, పిల్లలను కాపాడుకోవటానికి ఆడ పక్షులు వంకర టింకరగా.. ఒక రకమైన నాట్యం చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా బట్టమేక పక్షుల్లో 22 రకాల జాతులు ఉండగా.. భారత్‌లోని బంగారు బట్టమేక పక్షులు అత్యంత అరుదైనవి. వీటిలోనూ నాలుగు జాతులు ఉండగా.. ఏపీలో సంచరించే బంగారు బట్టమేక పక్షులే అతి పెద్దవి.. బలిష్టమైనవి. ఈ పక్షులు అవకాశవాద భక్షులు. అంటే తాము నివసించే ప్రాంతంలో ఏవి దొరికితే వాటిని తిని బతికేస్తాయి. అయినా.. వీటి మనుగడకు అనువైన పరిస్థితులు లేక అతి త్వరగా అంతరించిపోతున్న పక్షుల జాబితాలో చేరాయి.



దేశంలో ఎగిరే పక్షుల్లో ఇవే అతి పెద్దవి.. ప్రపంచంలో రెండో భారీ పక్షులు ఇవే

- రాష్ట్రంలో 180 పక్షులు ఉన్నట్టు గుర్తింపు
- కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సంచరిస్తున్న అరుదైన పక్షులు
- వీటి కోసం రోళ్లపాడు, సుంకేసుల సమీపంలో సంరక్షణ కేంద్రాలు



అంతరించిపోతున్న జీవులుగా..

అంతరించిపోతున్న బంగారు బట్టమేక (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) పక్షుల పరిరక్షణ కోసం 1988లో నంద్యాల జిల్లా నందికొట్కూరు సమీపంలోని రోళ్లపాడు వద్ద బట్టమేక పక్షుల సంరక్షణ కోసం 600 హెక్టార్ల భూమిని అభయారణ్యంగా ప్రకటించారు. అదేవిధంగా కర్నూలు జిల్లా సుంకేసుల జలాశయం సమీపంలోనూ మరో 800 ఎకరాల భూమిని కేటాయించారు. ఇక్కడే బట్ట మేక పక్షులు సంచరిస్తుంటాయి. ఇవి తీవ్రంగా అంతరించిపోతున్న జాబితాలో ఉన్నాయి. మన రాష్ట్రంలో కేవలం 180 పక్షులు మాత్రమే ఉన్నట్టు గుర్తించారు.

సాక్షి, అమరావతి: పొడవాటి తెల్లటి మెడ, బంగారు లేదా గోధుమ వర్ణంలో వీపు, మెడలో తెలుపు-నలుపు ఈకల హారం, తలపై నల్లని టోపీతో బట్టమేక పక్షులు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ప్రపంచంలోనే అరుదైన బట్టమేక (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) పక్షులు మన రాష్ట్రంలో 180 వరకూ ఉన్నట్టు గుర్తించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఇవి సంచరిస్తుంటాయి. బట్టమేక పక్షులు ఏపీతోపాటు రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోనూ ఇవి సంచరిస్తుంటాయి. సుమారు మీటరు పొడవు, 14 నుంచి 15 కేజీల బరువు ఉంటాయి. ఏపీలో సంచరించే బట్టమేక జాతి పక్షులే వీటన్నింటిలోనూ పెద్దవి, బలిష్టమైనవి కూడా. ఎగిరే పక్షుల్లో దేశంలో మొదటి, ప్రపంచంలో రెండవ అతి భారీ పక్షులివి. గడ్డి భూముల్లో సంచరించే ఈ పక్షులు 1 లేదా 2 సంవత్సరాలకు ఒకసారి గుడ్లుపెట్టి.. 25-30 రోజులపాటు పొదుగుతాయి. తమకు సమీపంలో ఎలాంటి ఆహారం లభ్యమైనా తిని జీర్ణించుకోగలవు. సాధారణంగా ఇవి కీటకాలు, తొండలు, బల్లులు, చిన్నపాటి పాములు, పండ్లను తిని జీవిస్తాయి. మగ పక్షుల కంటే ఆడ పక్షులు చిన్నవిగా ఉంటాయి. ఇవి సుమారు 75 సెంటీమీటర్ల పొడవు, 4-6 కేజీల బరువు ఉంటాయి. ఆడ పక్షులు ఊదా రంగు తల, మెడతో ఉంటాయి. వీటి రొమ్ముపై పట్టీ ప్రస్ఫుటంగా కనిపించదు.

పర్యావరణ వ్యవస్థలో ఇవి కీలకం

అభయారణ్యానికి సమీపంలోని గడ్డి భూములు పంట పొలాలుగా మారడంతో ఈ పక్షుల ఆవాస ప్రాంతాలు తగ్గిపోయాయి. పురుగు మందుల వాడకంతో బట్టమేక పక్షుల ఆహారమైన కీటకాలు విషతుల్యమవడం, నక్కలు ఇతర జంతువులు వాటి గుడ్లు, పిల్లలను తినడం వంటి కారణాలు ఈ పక్షుల ఉనికికి తీవ్ర ప్రతిబంధకాలుగా మారాయి. పర్యావరణంలో ముఖ్య భూమిక పోషించే గడ్డి భూముల పరిస్థితిని బట్టమేక పక్షుల ఉనికి తెలుపుతోంది. ఈ పక్షుల సంచారం బాగుందంటే గడ్డి భూముల పర్యావరణం బాగున్నట్టు లెక్క. అందుకే పర్యావరణ వ్యవస్థలో కీలకమైన వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రకృతి ప్రసాదించిన ఈ అరుదైన పక్షులను అంతరించిపోకుండా కాపాడుకోవడం అందరి బాధ్యత. ప్రకృతిని కబళిస్తున్న పురుగు మందులు, ఎరువులను తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలి. తద్వారా మన పరిసరాలు, ప్రకృతిని కాపాడుకుని భావితరాలకి బంగారు బట్టమేకని బహుమతిగా అందిద్దాం.

– డాక్టర్ సీఎం సంతోష్‌కుమార్, స్కూల్ ఆఫ్ బయో సైన్సెస్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్, యూకే (నేటివ్ ఆఫ్ నంద్యాల)

సీఎస్ కార్యాలయంలో న్యూ ఇయర్ సందడి



రెవెన్యూ డైరీని ఆవిష్కరిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో సందడి నెలకొంది. అన్ని శాఖల ముఖ్య అధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్.జవహర్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీఎస్‌కు టీటీడీ, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానాల వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ల డైరీలు, క్యాలెండర్లను సీఎస్ ఆవిష్కరించారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. సున్న మానసిక వికలాంగుల కేంద్రానికి చెందిన చిన్నారులకు సీఎస్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంపిణీ చేశారు.

రాజ్‌భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు



రాజ్‌భవన్‌లో జరిగిన వేడుకలలో గవర్నర్, అధికారులు

సాక్షి, అమరావతి: రాజ్‌భవన్‌లో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం నిరాడంబరంగా నిర్వహించారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులను టీటీడీ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వేద పండితులు మంత్రోచ్చారణలతో ఆశీర్వదించి ప్రసాదాలు అందించారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ తలశిల రఘురాంతో పాటు పలువురు ఉన్నతాధికారులు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


ఉన్నత విద్యలో 'సామాజిక బాధ్యత'

- తాజాగా యూజీసీ మార్గదర్శకాలు విడుదల
- సీఎం జగన్ సూచనలతో రెండేళ్ల క్రితమే రాష్ట్రంలో అమలులోకి
- ప్రత్యేకంగా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు
- సామాజికాభివృద్ధి కార్యక్రమాల్లో 15 లక్షల మంది విద్యార్థులు
- ప్రాజెక్టులకు నాలుగు చొప్పున క్రెడిట్ పాయింట్లు

సాక్షి, అమరావతి: విద్యారంగ సంస్కరణలతో కీలక మార్పులకు శ్రీకారం చుట్టిన ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విధానాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఫౌండేషన్ విద్యా విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని నిర్ణయించగా అనంతరం నూతన విద్యా విధానంలో ఇదే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పొందుపరిచిన విషయం తెలిసిందే. దేశంలోని అన్ని యూనివర్సిటీల్లో పీజీ కోర్సులకు యూజీసీ 2022లో కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశపెట్టగా ఆంధ్రప్రదేశ్‌లో అంతకంటే ఏడాది ముందుగానే అదే విధానంలో ఎంట్రన్స్ టెస్ట్ 2021 నిర్వహించి అడ్మిషన్లను పూర్తి చేయడం గమనార్హం. తాజాగా దేశవ్యాప్తంగా అన్ని ఉన్నత విద్యాసంస్థలలో సామాజిక బాధ్యత, సామాజిక భాగస్వామ్యంపై ప్రాజెక్టులు, కోర్సుల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని యూజీసీ మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ఉన్నత విద్యామండలి రెండేళ్ల క్రితమే ఈమేరకు చర్యలు చేపట్టడమే కాకుండా ప్రత్యేకంగా 'బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్'ను తెచ్చింది. బోర్డు ద్వారా సామాజిక అభివృద్ధి కార్యక్రమాలలో విద్యార్థులను భాగస్వాములను చేస్తోంది. సామాజిక బాధ్యత, సామాజిక సమస్యల పట్ల అవగాహన కల్పించడం, పరిష్కారాలను అన్వేషించడమే లక్ష్యంగా ఉన్నత విద్యాకోర్సుల్లో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులను తప్పనిసరి చేసింది. ప్రతి ప్రాజెక్టుకు నాలుగు చొప్పున క్రెడిట్లను కూడా కేటాయించింది. అన్ని కళాశాలల విద్యార్థులను సమాజ సేవలో నిమగ్నం చేసేలా ఈ కార్యక్రమాన్ని రెండేళ్ల క్రితమే దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించింది.

సామాజిక సేవలో విద్యార్థులు..

ఇంజనీరింగ్, ఫార్మసీ లాంటి వృత్తిపరమైన కాలేజీలతో పాటు నాన్-ప్రొఫెషనల్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో చదువుతున్న దాదాపు 15 లక్షల మంది విద్యార్థులు సమాజ సేవలో పాలుపంచుకునేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సామాజిక అవసరాలను తీర్చడానికి వీలుగా ఆయా ప్రాజెక్టులను విద్యార్థులు తమ కోర్సుల్లో భాగంగా చేపట్టేలా ఉన్నత విద్యామండలి ద్వారా చర్యలు తీసుకుంది. ప్రతి విద్యార్థి వేసవి సెలవుల్లో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుల్లో భాగస్వాములు అవుతున్నారు. తమకు కేటాయించిన ప్రాంతాల్లో పర్యటించి సచివాలయాల సహకారంతో గ్రామ పెద్దలు, విద్యావంతులతో చర్చించి స్థానిక అవసరాలు, సమస్యలను గుర్తిస్తున్నారు. అందుబాటులో ఉన్న వనరులతో పరిష్కారాలను చూపుతున్నారు. మెరుగైన సదుపాయాల కోసం ప్రాజెక్టు రిపోర్టును కాలేజీలకు సమర్పిస్తారు. అవసరమైతే సంబంధిత శాఖల అధికారులతో చర్చించి పరిష్కారాలను అన్వేషించేలా ప్రభుత్వం దీన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం ఆయా మండలాలకు ఒక కాలేజీని నోడల్ ఏజెన్సీగా నియమించారు. ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్)తో అనుసంధానించడం వల్ల విద్యార్థులకు మేలు కలుగుతోంది. ఇలా 2021లోనే రాష్ట్రంలో ఈ కార్యక్రమాలు అమలు చేస్తుండగా యూజీసీ తాజాగా దేశంలోని అన్ని విద్యాసంస్థలను సామాజిక బాధ్యత, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు అమలు చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది.


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తున్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 282

సోమవారం 2-1-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సర్వసన్నద్ధం కోసం..

ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా క్రికెటర్ల ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యమివ్వాలని బీసీసీఐ నిర్ణయించింది. ఆటగాళ్లకు కఠిన పరీక్ష పెట్టే యో–యో ఫిట్‌నెస్ టెస్టును మళ్లీ ప్రవేశపెడుతోంది.

- వివరాలు 12లో ▸



ప్యాసింజర్ వాహన విక్రయాల్లో 23% వృద్ధి

దేశవ్యాప్తంగా గతేడాది మొత్తం 37.93 లక్షల ప్యాసింజర్ వాహన విక్రయాలు జరిగాయి. 2021తో పోలిస్తే 23% వృద్ధి నమోదైంది. కార్లకు, ముఖ్యంగా ఎస్‌యూవీలకు గిరాకీ పెరిగింది.

- వివరాలు 13లో ▸



హరియాణ మంత్రిపై కేసు

హరియాణ మంత్రి సందీప్ సింగ్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. దీంతో సందీప్ తన పదవికి రాజీనామా చేశారు.

వివరాలు 6లో ▸



దేశంలో పెరిగిన నిరుద్యోగం

భారత్‌లో నిరుద్యోగం రేటు డిసెంబర్‌లో 8.3 శాతానికి ఎగబాకింది. గత 16 నెలల్లో అదే అత్యధికమని సీఎంఐఈ తెలిపింది.

వివరాలు 6లో ▸



అణు సమాచారం మార్పిడి

భవిష్యత్‌లో ఉద్రిక్తతలు పెరిగితే దాడులు చేయకూడదని.. అణు కేంద్రాల సమాచారాన్ని భారత్, పాక్ ఇచ్చిపుచ్చుకున్నాయి.

వివరాలు 6లో ▸



క్షిపణి ప్రయోగంతో స్వాగతం

ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

వివరాలు 6లో ▸


వాహనంలో నుంచి కిట్లను మహిళల మీదకు విసిరేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


సభాస్థలి వద్ద విగత జీవిగా రమాదేవి


ప్రాణాలు కోల్పోయిన సయ్యద్ ఆసియా


మృతి చెందిన ఎస్‌కే బీబీ

కాటేసిన కానుక!

చంద్రబాబు ప్రచార యావకు మరో ముగ్గురు బలి

- చంద్రన్న కానుకల కోసం ఐదున్నర గంటల పాటు మహిళల పడిగాపులు.. గుంటూరులో మధ్యాహ్నం 1 గంటకే వేదిక వద్దకు తరలింపు
- 30 కౌంటర్లంటూ 12తో సరి.. లారీల నుంచే పంపిణీ
- చివరకు డివిజన్లలో ఇస్తామంటూ చేతులెత్తేసిన నిర్వాహకులు.. ఆక్రోశించిన అక్క చెల్లెమ్మలు
- తొక్కిసలాటలో ముగ్గురు మహిళల మృతి
- రూ.300 కూడా విలువ చేయని నాసిరకం కిట్లు
- చీరలు కొన్నది పది వేల మందికే.. టోకెన్లు మాత్రం 30 వేల మందికి.. పోలీసుల హెచ్చరికలూ బేఖాతర్
- ఫలితమే తాజా విషాదం.. టీడీపీ అధినేతలో కానరాని పశ్చాత్తాపం.. రూ.5 లక్షలతో సరి
- రూ.20 లక్షల పరిహారం ప్రకటించిన ఫౌండేషన్

3లో

డ్రోన్ ఫొటోల కోసం..

చంద్రన్న కానుకలున్న లారీల వైపు అక్క చెల్లెమ్మలు ఆశగా పరుగులు తీస్తుంటే డ్రోన్ ఫొటోలు బాగా వస్తాయని టీడీపీ నేతలు, నిర్వాహకులు మౌనంగా చూస్తూ ఉండిపోయారు. ఈ క్రమంలో మహిళలు ఒకరిపై ఒకరు పడిపోయారు. ఊపిరి ఆడక వారు చేసిన ఆర్తనాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి పంపిణీని నిలిపివేసి బాధితులను ఆస్పత్రికి తరలించారు.

- గోదావరి పుష్కరాల్లో 29 మంది.. కందుకూరులో 8 మంది.. తాజాగా మరో ముగ్గురు బలి

సీఎం జగన్ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండ

రూ.2లక్షల చొప్పన పరిహారం..

క్షతగాత్రులకు రూ.50వేలు

- వివరాలు 3లో ▸

ఊరూ వాడా సంబరం

పండుగలా పింఛన్ల పంపిణీ.. తెల్లవారుజాము నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్ద సందడి

పెరిగిన పింఛన్ రూ.2,750 పంపిణీ చేసిన వలంటీర్లు

- సీఎం జగన్ చిత్రపటాలకు లబ్ధిదారుల పాలాభిషేకం
- పలు చోట్ల పంపిణీలో స్వయంగా పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- ఇంకొన్ని చోట్ల పింఛన్ డబ్బులతో పాటు స్వీట్ బాక్సులు
- పింఛన్ల పెంపుపై వివిధ రూపాల్లో లబ్ధిదారుల హర్షం
- కొత్తగా ఎంపికైన వారికి మంజూరు పత్రాల పంపిణీ
- మొదటి రోజే లబ్ధిదారులకు రూ.1,257.25 కోట్లు అందజేత


ఒంగోలులో రూ.2,750 పింఛన్ నగదు అందుకున్న ఆనందంలో లబ్ధిదారులు

సాక్షి, అమరావతి: అవ్వాతాతలు సహా సామాజిక పింఛన్ రూ.2,750కి పెంపుపై లబ్ధిదారులు ఆనందభరితులయ్యారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే వారి ఇళ్ల వద్ద సందడి నెలకొంది. పెరిగిన పింఛన్‌పై వివిధ రూపాల్లో తమ సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. పలు చోట్ల వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకాలు చేస్తూ తమ దీవెనలను వ్యక్తపరిచారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ ప్రభుత్వం వచ్చాక చిన్న కష్టం కూడా తెలియకుండా, ప్రతి నెలా వలంటీర్లు తమ ఇంటి వద్దకే వచ్చి.. పింఛన్లు పంపిణీ చేస్తున్న తీరు పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని లబ్ధిదారులు కొనియాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొత్త పింఛన్ మంజూరుకు పడే పాట్లు, ప్రతినెలా పింఛన్ డబ్బుల కోసం పడిగాపులు, చాంతాడంత క్యూలో నిలుచోలేక పడిన ఇబ్బందులను గుర్తు చేసుకున్నారు. సీఎం జగన్ చెప్పిన మాటను చెప్పినట్లు ఆచరిస్తున్నారని కొనియాడారు. పింఛన్ పెంపును పురస్కరించుకుని ఆయా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా సీఎం రాసిన లేఖను లబ్ధిదారులకు పింఛన్ సొమ్ముతో పాటు అందజేశారు.

అవ్వాతాతల్లో ఆనందం

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలో పలుచోట్ల లబ్ధిదారులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బ్రహ్మసముద్రం మండలంలో మంత్రి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని తెలియజేశారు. శ్రీసత్యసాయి జిల్లా

మిగతా 2వ పేజీలో ▶

తొలిరోజే 71.26% పంపిణీ

1వ తేదీ (ఆదివారం) రాత్రి ఏడు గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా 45,65,076 మందికి పెరిగిన పింఛను డబ్బుల పంపిణీ పూర్తయింది. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ.1,257.25 కోట్లు అందజేశారు. తొలిరోజునే 71.26 శాతం మంది లబ్ధిదారులకు పంపిణీ పూర్తయినట్టు సెర్ప్ అధికారులు వెల్లడించారు. 1వ తేదీ సెలవు రోజు అయినప్పటికీ 13 జిల్లాల్లో 75 శాతానికి పైగా పంపిణీ పూర్తయిందని తెలిపారు.

పీవీ చలపతిరావు కన్నుమూత



బీజేపీ సీనియర్ నేత, ఆ పార్టీ ఉమ్మడి ఏపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీ చలపతిరావు(87) కన్నుమూశారు. కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

- వివరాలు 5లో ▸

అనకాపల్లిలో ఎంఎస్‌ఎంఈ పార్కు

తొలిదశలో 59 ఎకరాల్లో అభివృద్ధి

- రూ.12.63 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- టెండర్లు ఆహ్వానించిన ఏపీఐఐసీ
- మూడున్నరేళ్లలో రెట్టింపైన ఎంఎస్‌ఎంఈలు



సాక్షి, అమరావతి: అత్యధికంగా ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలను ప్రోత్సహించడంలో భాగంగా అనకాపల్లి వద్ద భారీ ఎంఎస్‌ఎంఈ పార్కును రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అనకాపల్లి జిల్లా కోడూరు గ్రామంలో సుమారు 129 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కును అభివృద్ధి చేస్తోంది. తొలిదశలో 59 ఎకరాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ ఉన్నతాధికారులు తెలిపారు. సర్వే నెంబర్ 1(పీ), సర్వే నెంబర్ 21(పీ)లో కనీస మౌలిక వసతుల కల్పన కోసం ఏపీఐఐసీ బిడ్లను ఆహ్వానించింది. సుమారు రూ.12.63 కోట్లతో రహదారులు, డ్రైనేజ్, వర్షపు నీటి కాలువలను అభివృద్ధి చేయనున్నారు. టెండర్లు దక్కించుకున్న సంస్థ 12 నెలల్లో పనులు పూర్తి చేయాలి. ఆసక్తి గల సంస్థలు జనవరి 17లోగా బిడ్లను సమర్పించాలి. ఆటోమొబైల్, కెమికల్ రంగాలకు చెందిన కంపెనీల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఎంఎస్–సీడీపీ ప్రోగ్రాం కింద పార్కును అభివృద్ధి చేసేలా ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు వెల్లడించారు.

సత్ఫలితాలనిస్తున్న ప్రభుత్వ చర్యలు


ఎంఎస్‌ఎంఈలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు సత్ఫలితాలనిస్తోంది. గత సర్కారు ఎగ్గొట్టిన రూ.962.05 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను చెల్లించడమే కాకుండా రాయితీలను ఎప్పటికప్పుడు అదే ఏడాది చెల్లిస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,715.16 కోట్ల రాయితీలను, రూ.1144 కోట్ల విలువైన విద్యుత్ రాయితీ ప్రోత్సాహకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించింది. రాయితీలను ఫిబ్రవరిలో

మిగతా 14వ పేజీలో ▶

ఏకాభిప్రాయంపై చివరి ప్రయత్నం

- రేపు గోదావరి, 11న కృష్ణా బోర్డుల సమావేశాలు
- గడువు దాటినా అమలు కాని నోటిఫికేషన్లు

సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ల అమలుకు సంబంధించి తెలుగు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు చివరి ప్రయత్నంగా ఈనెల 3న గోదావరి బోర్డు, 11న కృష్ణా బోర్డు సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలలో రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకుంటే కేంద్ర జల్ శక్తి శాఖ దృష్టికి తెచ్చి తదుపరి చర్యలు తీసుకోవాలని బోర్డులు నిర్ణయించాయి. కృష్ణా, గోదావరి జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య వివాదాలకు చరమగీతం పాడేందుకు బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ నోటిఫికేషన్ జారీ



చేయాలని 2020 అక్టోబర్ 6న అపెక్స్ కౌన్సిల్ రెండో భేటీలో సీఎం జగన్ కోరారు. తెలంగాణ జెన్‌కో యథేచ్ఛగా విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని వదిలేయడం వల్ల ప్రకాశం బ్యారేజ్ నుంచి

మిగతా 14వ పేజీలో ▶

హైకోర్టు జడ్జిల్లో వారు 15 శాతమే



- గత ఐదేళ్లలో దేశంలోని హైకోర్టుల్లో నియమితులైన న్యాయమూర్తుల్లో వెనుకబడిన తరగతులకు చెందిన వారు 15 శాతం మందే ఉన్నారని పార్లమెంట్ స్థాయీ సంఘానికి న్యాయ శాఖ తెలిపింది. న్యాయ స్థానాల్లో సామాజిక వైవిధ్యాన్ని ఇంకా సాధించలేకపోయామని పేర్కొంది.

- వివరాలు 6లో ▸

ఇదండీ సంగతి


బయటి వాళ్లు ఓకే అంటున్నార్సార్!.. సీనియర్లే..

వైకుంఠ ఏకాదశికి తిరుమల ముస్తాబు



పది రోజులపాటు జరగనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులకు టీటీడీ సకల ఏర్పాట్లూ పూర్తి చేసింది. సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చేలా చర్యలు తీసుకున్నట్లు టీటీడీ ఈఓ. అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. సోమవారం నుంచి ఈనెల 11 వరకు ఈ దర్శనాలు కొనసాగుతాయని వివరించారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో దాదాపు 94 కౌంటర్లను ఏర్పాటు చేసి టికెట్లు జారీ చేస్తున్నట్లు చెప్పారు. మాస్క్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

- వివరాలు 5లో ▸

నూరు శాతం ఉత్తీర్ణతపైనే గురుకులాల గురి

- పబ్లిక్ పరీక్షలకు సర్వసన్నద్ధం
- బీసీ గురుకులాల్లో ముందస్తు ప్రణాళిక
- టెన్త్, ఇంటర్‌లో పబ్లిక్ తరహా పరీక్షలతో కసరత్తు
- టెన్త్‌లో 5,130 మంది విద్యార్థులు
- ఇంటర్ ఫస్టియర్‌లో 1,781 మంది, సెకండియర్‌లో 1,389 మంది..

10లో

గ'ఘన'యానం!



- మళ్లీ విమానయానానికి ప్రయాణికుల మొగ్గు
- గతేడాదితో పోలిస్తే 70 శాతం పైగా పెరిగిన దేశీయ ప్రయాణం
- కలిసి వస్తున్న పర్యాటకం, వాణిజ్య అవసరాలు
- కొత్త నగరాలకు కూడా విమానాల జోరు

- వివరాలు 14లో ▸


తిరుపతి జిల్లా మొలకలపోండ్ల గ్రామంలో ఆదెమ్మకు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ సుభాషిణి


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో వృద్ధురాలు వరలక్ష్మికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ పద్మావతి


నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం గుంజలపాడులో పతిమ చెన్నయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మనోహర్


ఒంగోలు 9వ డివిజన్ కొప్పోలులో పెంచిన పింఛన్ నగదును 99 ఏళ్ల లేళ్ల కోటమ్మకు అందజేస్తున్న వలంటీర్ రమేష్


గుంటూరు తూర్పు నియోజకవర్గం గాంధీ నగర్‌కు చెందిన లక్ష్మమ్మకు దివ్యాంగ ఫించన్‌ను అందజేస్తున్న వలంటీర్ జహిరూన్


ఏలూరు జిల్లా దెందులూరులో పెరిగిన పింఛను మొత్తం రూ.2,750 నగదును వెంకటేశ్వరరావుకు అందజేస్తున్న వలంటీర్ విజయ్


విశాఖలోని పాతనగరం స్వామి వివేకానంద సంస్థలో ఉన్న వృద్ధురాలు ఎల్లయ్యమ్మకు వికలాంగ పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లత


శ్రీకాకుళం నగరంలోని 41 వార్డులో గుడ్ల కామేశ్వరరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చిన్నదుర్గ


అనంతపురం 45వ డివిజన్‌లో వృద్ధురాలు వెంకటమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కిరణ్


వైఎస్సార్ జిల్లా కడప రామాలయం వీధిలో డయాలసిస్ బాధితుడు సూర్యనారాయణకు ఐరిస్ తీసుకుంటున్న వలంటీర్ నర్మద


విజయవాడ వన్‌టౌన్‌లో దుర్గాభవానికి ఒంటరి మహిళ పెన్షన్ అందిస్తున్న వలంటీర్ సంధ్య


నెల్లూరు 21వ డివిజన్ ఉమ్మారెడ్డిగుంటలోని తన నివాసంలో దివ్యాంగురాలు హేమలతకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాధిక

ఊరూ వాడా సంబరం

మొదటి పేజీ తరువాయి

పుట్టపర్తి నగర పంచాయతీలో ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

- వైఎస్సార్ జిల్లా కడప నగర కార్పొరేషన్ పరిధిలోని శంకరాపురంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా పింఛన్ లబ్ధిదారులతో ముచ్చటిస్తూ, డబ్బులు పంపిణీ చేశారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణ పింఛన్ల పెంపు పోస్టర్‌ను ఆవిష్కరించారు.
- నెల్లూరు జిల్లాలో జరిగిన పింఛన్ల పంపిణీలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. కొత్త లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు కార్డు, పెరిగిన పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు. కావలిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉదయగిరిలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. లబ్ధిదారులకు సీఎం రాసిన లేఖను చదివి వినిపించారు.
- పశ్చిమగోదావరి జిల్లా తణుకు సజ్జాపురంలో ఆదివారం తెల్లవారు జామున రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పెంచిన పింఛను సొమ్మును, స్వీటు ప్యాకెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు.
- శ్రీకాకుళంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లులో స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి లబ్ధిదారులతో ముచ్చటించారు. పింఛన్ల పెంపు సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు రాసిన లేఖలను అందజేసి, పెరిగిన పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు.
- పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని గాంధీనగర్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని వృద్ధులకు పెన్షన్లు అందజేశారు. సత్తెనపల్లి ఆరవ వార్డులో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, బాపట్ల జిల్లా వేమూరు మార్కెట్ యార్డు ఆవరణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పింఛన్లు పంపిణీ చేశారు.
- గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఆగతవరప్పాడులో ఎమ్మెల్యే కిలారి రోశయ్య, బాపట్లలో కలెక్టర్ విజయ్ కృష్ణన్.. అధికారులు, వలంటీర్లతో కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. కృష్ణా జిల్లా పెడనలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ లబ్ధిదారులతో మాట్లాడారు. సీఎం వారికి రాసిన లేఖలను అందజేయడంతో పాటు పింఛన్లు పంపిణీ చేశారు.


వైఎస్సార్ జిల్లా కడప నగరంలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా


అనంతపురం జిల్లా కుర్లగుండ గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీ చరణ్


పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని


పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో తెల్లవారుజామున 4.30 గంటలకు పింఛన్ అందిస్తున్న మంత్రి కారుమూరి


విజయనగరం జిల్లా చీపురుపల్లిలో లబ్ధిదారుకు పెరిగిన పింఛన్ అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ


పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో వైఎస్సార్ పెన్షన్ కానుకను అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు


కృష్ణా జిల్లా పెడనలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న మంత్రి జోగి రమేష్


నెల్లూరు జిల్లా సరస్వతినగర్‌లో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న మంత్రి కాకాణి


బాపట్ల జిల్లా వేమూరు మార్కెట్ యార్డులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న మంత్రి మేరుగ


శ్రీకాకుళంలోని తన క్యాంపు కార్యాలయంలో పింఛన్ కానుక అందజేస్తున్న మంత్రి ధర్మాన


నూతన సంవత్సరం సందర్భంగా తన నివాసంలో మంత్రులు, అధికారుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్రాభివృద్ధికి నిరంతర కృషి

- ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు సీఎం జగన్
- వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు
- తన నివాసంలో కేక్ కట్ చేసిన ముఖ్యమంత్రి
- టీటీడీ, ఇంద్రకీలాద్రి వేద పండితుల ఆశీర్వచనం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 'మీరు నాపై చూపిన ప్రేమ, విశ్వాసం, నమ్మకం, నాకు ఇచ్చిన మద్దతుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఇక ముందు కూడా ఇలాగే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తాను. వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతున్నాను' అంటూ ఆదివారం ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా నూతన సంవత్సరం సందర్భంగా సీఎం వైఎస్ జగన్ తన నివాసంలో ఆదివారం కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సీఎంతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు శాసనమండలి చైర్మన్ కె మోషేన్ రాజు, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎంపీ నందిగాం సురేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, డీజీపీ కే వీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ముఖ్యమంత్రికి తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వేద పండితులు వేద మంత్రోచ్చారణతో ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం ప్రసాదాలు అందజేశారు. ఉప ముఖ్యమంత్రి (దేవదాయ శాఖ మంత్రి) కొట్టు సత్యనారాయణ, దేవదాయశాఖ కమిషనర్ హరి జవహర్ లాల్, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో భ్రమరాంబ, ఇతర అధికారులు సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.


సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదిస్తున్న టీటీడీ, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు. చిత్రంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


అనంతపురం జిల్లా గార్లదిన్నెలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు


నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం అల్లూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు

క్లుప్తంగా...

రేపు సీఎం జగన్ రాజమహేంద్రవరం పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 3వ తేదీ మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పర్యటించనున్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుదల, లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని, బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం తిరిగి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ఎంపీటీసీ సభ్యుడిపై టీడీపీ నేతల దాడి

తెల్లనీళ్లపల్లెలో బ్యానర్ల చించివేత

చౌడేపల్లె (చిత్తూరు జిల్లా): మంత్రి పెద్దిరెడ్డి పల్లెబాట కార్యక్రమానికి బ్యానర్లు కడుతున్న దళిత ఎంపీటీసీ శ్రీరాములుపై టీడీపీ నేతలు కర్రలతో దాడిచేసి గాయపరిచి బ్యానర్లు చించివేసిన ఘటన ఆదివారం జరిగింది. పల్లెబాట కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి సోమవారం తెల్లనీళ్లపల్లెలో పర్యటనకు సంబంధించి స్వాగత బ్యానర్లు కడుతున్న ఎంపీటీసీ, అతని అనుచరులు మునీశ్వర, మధుసూదన, లోకేశ్ తదితరులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అలియాస్ చిట్టి గ్రామంలో బ్యానర్లు కట్టకూడదంటూ అడ్డు తగిలారు. ఎంపీటీసీ శ్రీరాములు బ్యానర్లు కడుతుండగా రెచ్చిపోయిన రమేష్ రెడ్డి, అతని అనుచరులు కర్రలతో ఎంపీటీసీ తదితరులపై దాడి చేశారు. బ్యానర్లు చించివేసి అక్కడే ఉన్న ఎంపీటీసీ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. ఎంపీటీసీ తలకు, శరీరంపై గాయాలయ్యాయి. ఆయనను చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి ఎంపీటీసీను పరామర్శించారు. సీఐ మధుసూదనరెడ్డి, ఎస్‌ఐ రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

నిండుగా మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులు

- ఖరీఫ్ పూర్తయినా వీటిల్లో గరిష్టంగా నీటినిల్వ
- నీటి లభ్యత ఆధారంగా రబీ పంటలకు నీరు విడుదల
- ఆయకట్టులో భారీఎత్తున పంటల సాగుకు రైతులు సన్నద్ధం
- యాజమాన్య పద్ధతుల ద్వారా ఆయకట్టు చివరి భూములకు నీళ్లు



సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఖరీఫ్ పంటల కోతలు పూర్తయినా మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల్లో నీటి నిల్వ గరిష్ట స్థాయిలో ఉంది. నీటి లభ్యత ఉన్న ప్రాజెక్టుల కింద ఆయకట్టులో రబీ పంటల సాగుకు ప్రభుత్వం నీరు విడుదల చేస్తుండటంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది తరహాలోనే ఈ ఏడాది కూడా రబీలో భారీఎత్తున పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. రాష్ట్రంలో 104.61 లక్షల ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం ఉంది. భారీ ప్రాజెక్టుల కింద 65.62 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఏపీఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ) పరిధిలోని ఎత్తిపోతల కింద 7.86 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు, చెరువుల కింద 31.13 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక రాష్ట్రంలో నైరుతి, ఈశాన్య రుతుపవనాలు, తుపానుల ప్రభావంవల్ల గతంలో ఎన్నడూ లేని రీతిలో విస్తారంగా వర్షాలు కురవడంతో గోదావరి, కృష్ణా, పెన్నా, నాగావళి, వంశధార, ఏలేరు తదితర నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. దాంతో భారీ ప్రాజెక్టులతోపాటు చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులు నిండాయి. వీటి కింద ఖరీఫ్‌లో రైతులు పంటలు సాగుచేసి, కోతలు కూడా పూర్తిచేశారు. వర్షాల ప్రభావంవల్ల వరద ప్రవాహం కొనసాగడంతో ఇప్పటికీ చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల్లో నీటినిల్వ గరిష్టస్థాయిలో ఉంది.

అప్పర్ పెన్నార్ నుంచి మడ్డువలస దాకా..

ఇక వర్షాభావ ప్రాంతం శ్రీసత్యసాయి జిల్లా పెన్నా బేసిన్‌లోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్టులోకి ఎన్నడూలేని రీతిలో ఈ ఏడాది వరద ప్రవాహం కొనసాగింది. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే వేదవతి (హగరి) పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురవడంతో ఇప్పటికీ భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ)లోకి వరద ప్రవాహం కొనసాగుతోంది. అలాగే, విజయనగరం జిల్లాలో సువర్ణముఖి నది ఉప్పొంగడంతో మడ్డువలస ప్రాజెక్టులోకి ఇప్పటికీ ప్రవాహం కొనసాగుతోంది. రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు అన్ని చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు గరిష్టస్థాయిలో ఉన్నాయి. ఆ ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఆధారంగా రబీ పంటల సాగుకు ఆయకట్టుకు అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు.

రికార్డు స్థాయిలో సాగు?

మరోవైపు..రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల కింద ఉన్న 31.13 లక్షల ఎకరాల్లో 2019 వరకూ ఎప్పుడూ పది లక్షల ఎకరాలకు కూడా నీళ్లందించిన దాఖలాల్లేవు. కానీ, గత నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటం, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత మెరుగ్గా ఉండటంతో ప్రభుత్వం యాజమాన్య పద్ధతుల ద్వారా నీటి వృథాకు అడ్డుకట్ట వేసి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తోంది. ఖరీఫ్‌లో ఇదే రీతిలో గరిష్ఠంగా ఆయకట్టుకు నీరు విడుదల చేసింది. రబీలోనూ లభ్యత ఉన్న ప్రాజెక్టుల్లో ఆయకట్టుకు నీరు విడుదల చేస్తుండటంతో గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ ఆయకట్టులో పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

రాష్ట్రంలో కొన్ని మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల్లో శుక్రవారానికి నీటి నిల్వలు ఇవీ.. (టీఎంసీల్లో)

ప్రాజెక్టు	పూర్తినిల్వ	ప్రస్తుత నిల్వ	జిల్లా
అప్పర్ పెన్నార్	1.81	1.81	శ్రీసత్యసాయి
చాగల్లు	1.8	1.13	అనంతపురం
వెలిగల్లు	4.64	4.57	అన్నమయ్య
గాజులదిన్నె	4.5	3.8	కర్నూలు
అవుకు	4.15	3.25	నంద్యాల
అరణియార్	1.85	1.62	చిత్తూరు
మల్లిమడుగు	0.18	0.17	తిరుపతి
సర్వేపల్లి	1.74	1.25	నెల్లూరు
మోపాడు	2.09	1.62	ప్రకాశం
ఎర్రకాల్వ	4.43	2.83	ఏలూరు
తాండవ	4.96	3.28	అనకాపల్లి
మద్దిగెడ్డ	0.49	0.47	అల్లూరి సీతారామరాజు
పెద్దేరు	0.36	0.35	విశాఖపట్నం
మడ్డువలస	3.37	2.73	విజయనగరం

త్వరలో పీపీఏలపై కొత్త నిబంధన

సాక్షి, అమరావతి : దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ)వల్ల విద్యుత్ పంపిణీ సంస్థలు అనవసర వ్యయాన్ని భరించాల్సి వస్తోందని, కాబట్టి వాటిని పునఃసమీక్షించాలని 2019లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆలోచన ఫలితంగా త్వరలోనే దేశమంతటా పీపీఏలపై కొత్త నిబంధన అమల్లోకి రానుంది. విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో స్వల్పకాల ఒప్పందాలే నయమని కేంద్రం తాజాగా వెల్లడించింది. దీర్ఘకాల ఒప్పంద కాలం 25 ఏళ్ల నుంచి 12 లేదా 15 ఏళ్లకు తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నట్లు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. డిస్కంలు, పవర్ మార్కెట్‌లకు సహాయం చేయడానికి త్వరలో కొత్త నిబంధన తీసుకురానున్నట్లు తెలిపింది. ప్రస్తుత మార్కెట్ ధరల కంటే చాలా ఎక్కువ టారిఫ్ ఉన్న పీపీఏలతో సతమతమవుతున్న డిస్కంలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. దీనికి కేంద్రం నిర్ణయం పరిష్కారం చూపనుంది.

టీడీపీ పీపీఏలన్నీ అలాంటివే..

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తమకు నచ్చిన కంపెనీలతో విచ్చలవిడిగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుంది. వీటికి ఫిక్స్‌డ్ చార్జీల రూపంలో యూనిట్‌కు రూ.1.1 చెల్లించాల్సి వచ్చింది. పవన విద్యుత్‌ను యూనిట్‌కు ఏకంగా రూ.4.84కు తీసుకున్నారు. ఫిక్స్‌డ్ చార్జీతో కలిపి రూ.5.94 అయింది. అప్పట్లో సౌర విద్యుత్ యూనిట్ రూ.3.54కు బదులు రూ.8.90 వెచ్చించారు. ఇలా 7 వేల మెగా వాట్ల ఖరీదైన విద్యుత్ కొనుగోలు ఒప్పందాలవల్ల మన విద్యుత్ సంస్థలపై ఏటా అదనంగా రూ.3,500 కోట్ల భారం పడుతోంది. 2017–19 మధ్య రూ 2.40కే లభించిన బొగ్గు ఆధారిత మిగులు విద్యుత్‌ను బ్యాక్‌డౌన్ చేసి పీపీఏల ద్వారా అధిక ధరలు చెల్లించి మరీ కొన్నారు.

క్లుప్తంగా...

విచారం వ్యక్తంచేసిన గవర్నర్



సాక్షి, అమరావతి: గుంటూరులో ఆదివారం చోటుచేసుకున్న తొక్కిసలాటపై రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ విచారం వ్యక్తంచేశారు. ఈ ఘటనలో పలువురు మరణించడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు రాజ్‌భవన్ నుంచి ఆదివారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు.

గుంటూరు ఘటనపై సీఎం జగన్ దిగ్భ్రాంతి



సాక్షి, అమరావతి: గుంటూరులో చోటుచేసుకున్న తొక్కిసలాట దుర్ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో పలువురు మరణించడం తనను కలచి వేసిందన్నారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

ఇది ప్రభుత్వ వైఫల్యమే

గుంటూరు ఘటనపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



సాక్షి, అమరావతి: గుంటూరు ఘటనకు వైఎస్ జగన్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉయ్యూరు ఫౌండేషన్ వారు పోలీసుల అనుమతితోనే సభ ఏర్పాటు చేశారని, వేలాది మంది జనం వచ్చే చోట వంద మంది పోలీసులు కూడా లేరన్నారు. మాజీ ముఖ్యమంత్రి సభలకు భద్రత ఏర్పాటు ప్రభుత్వ బాధ్యత కాదా.. అని ప్రశ్నించారు. తోపులాట సమయంలో అరకొర పోలీసు సిబ్బంది కూడా సరిగా స్పందించలేదన్నారు. ఘటన జరిగిన వెంటనే మంత్రులు క్యూ కట్టడం అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. బ్లేమ్ గేమ్‌కు వైఎస్సార్‌సీపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. చంద్రబాబు సభలకు, రోడ్ షోలకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

గాయపడిన వారు



మంగమ్మ



సీతామహలక్ష్మి



సరోజ



మస్తాన్‌బీ



ప్రియాంక



ఉమాదేవి



సౌందర్య



జహరున్నీసా



ఆస్మా



దుర్గ



విజయశ్రీని ఓదారుస్తున్న భర్త



శివ పార్వతి



విద్యశ్రీ

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండ

రూ.2 లక్షల చొప్పున పరిహారం

క్షతగాత్రులకు రూ.50 వేలు

సాక్షి, అమరావతి: గుంటూరులో తొక్కిసలాట ఘటనలో మృతుల కుటుంబాలు, గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కాటేసిన కానుక!

చంద్రబాబు ప్రచార యావకు మరో ముగ్గురు బలి



కానుక పంపిణీ కోసం సన్నగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు



మహిళకు ఉయ్యూరు ఫౌండేషన్ కిట్ పంపిణీ చేస్తున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి, సాక్షి ప్రతినిధి, గుంటూరు

పత్రికల్లో ఫొటోలు, టీవీల్లో వీడియోలు, డ్రోన్ కెమెరా షాట్లు లక్ష్యంగా టీడీపీ ఆదివారం గుంటూరులో నిర్వహించిన చంద్రన్న కానుకల పంపిణీ ముగ్గురు పేద మహిళల ప్రాణాలను బలి తీసుకుంది. అధికారంలో ఉండగా 2015లో గోదావరి పుష్కరాల సమయంలో 29 మందిని బలిగొన్న చంద్రబాబు ప్రచారార్భాటం... గతవారం కందుకూరు ఇరుకు సందుల్లో నిర్వహించిన కార్యక్రమం 8 మంది ప్రాణాలను పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ దారుణాన్ని మరచిపోకముందే నూతన సంవత్సరం తొలిరోజే మరో విషాదం చోటు చేసుకుంది. ఈసారి ముగ్గురు పేద మహిళలు బాబు వికృత రాజకీయ క్రీడకు బలయ్యారు. మరో 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. తన రాజకీయ ప్రచార పదఘట్టనల కింద సామాన్యులు నలిగిపోతూ ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోతున్నా చంద్రబాబు తీరు మారడం లేదు. ఏమాత్రం పశ్చాత్తాపం కానరావడం లేదు.

మంచినీళ్లూ ఇవ్వలేదు..

సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసిన టీడీపీ నేతలు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పేద మహిళలను వికాస్ కాలేజీ మైదానానికి తరలించారు. టీడీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగానికి చెందిన ఉయ్యూరు ఫౌండేషన్ ఎండీ ఉయ్యూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. చంద్రబాబు ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు వేదిక వద్దకు చేరుకుని స్వయంగా పేదలకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచే పేదలను తరలించగా చంద్రబాబు సాయంత్రం 5.30 గంటలకు వేదిక వద్దకు రావడం గమనార్హం. అప్పటికే దాదాపు ఐదు గంటలకుపైగా నిరీక్షించాల్సి రావడం, కనీసం తాగేందుకు నీళ్లు కూడా లేకపోవడంతో మహిళలు అల్లాడారు. అంత ఆలస్యంగా వచ్చినా చీరల పంపిణీని ప్రారంభించలేదు. చీరల పంపిణీ మొదలుపెడితే చంద్రబాబు ప్రసంగం వినేందుకు ఎవరూ ఉండరనే భయంతో టీడీపీ నేతలు వాటిని మహిళలకు అందించలేదు. సాయంత్రం 5.35 గంటలకు చంద్రబాబు ప్రసంగం ప్రారంభించి 6.15 గంటలకు ముగించారు. కొంత మందికి మాత్రం చంద్రబాబు సంక్రాంతి కానుకలు అందచేయగా మిగతావారికి టీడీపీ నేతలు ఇస్తారంటూ వెళ్లిపోయారు.

ఐదు నిమిషాల్లోనే...

అప్పటివరకు కానుకల పంపిణీ గురించి గొప్పగా చెప్పిన నిర్వాహకులు చంద్రబాబు నిష్క్రమించగానే మాట మార్చారు. నామమాత్రంగా కొందరికి అందించి చేతులు దులిపేసుకోవాలని భావించారు. మిగిలిన వారందరికీ డివిజన్లలోకి వచ్చి పంపిణీ చేస్తామని చెప్పడంతో మహిళలు నిర్ఘాంతపోయారు. టీడీపీ నేతలు, ఆ పార్టీ వలంటీర్లు కూడా బాబు ప్రసంగం ముగియగానే జారుకోవడంతో పేదల్లో ఆందోళన నెలకొంది. చీరలు పంపిణీ చేస్తామని మభ్యపుచ్చి బలవంతంగా తీసుకొచ్చి గంటల తరబడి పడిగాపులు కాశాక తీరా మొహం చాటేయడంతో వారిలో ఆక్రోశం నెలకొంది. కానుకల కోసం తోసుకుంటూ తూతూమంత్రంగా ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను నెట్టుకుంటూ ముందుకు కదిలారు. తోపులాటలో ఒకరిపై ఒకరు పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. ఘటనలో గుంటూరు కన్నావారితోటకు చెందిన సయ్యద్ ఆసియా (48), ఏటీ అగ్రహారానికి చెందిన గోపిదేశి రమాదేవి (50), మారుతీనగర్ నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన షేక్ బీబీ (55) తొక్కిసలాటలో ఊపిరి ఆడక మృతి చెందారు. వీరిలో ఒక మహిళ అక్కడికక్కడే మరణించగా మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

ఇదేం మానవత్వం!

గుంటూరు: చంద్రబాబు సభలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో మృతి చెందిన సయ్యద్ ఆసియా (48)ను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చిన తీరు ప్రతి ఒక్కరినీ కలచివేసింది. టీడీపీ నేతలు, ఉయ్యూరు ఫౌండేషన్ వారు ఆసియా మృతదేహాన్ని వాహనంలోని సీటులో కాకుండా, డిక్కీలో పడేసి తీసుకు రావడం బాధితులను, చూపరులను ఎంతో బాధకు గురి చేసింది. కొంచెమైనా కనికరం లేకుండా, కనీసం మానవత్వం చూపకుండా ఇలా వ్యవహరించడం దారుణం అని పలువురు విమర్శించారు.



ఆసియాను కారు డిక్కీలో హాస్పిటల్‌కు పంపిస్తున్న టీడీపీ నాయకులు

పోలీసులు ముందే హెచ్చరించినా..

ప్రమాదం జరిగిన వెంటనే కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, జేసీ రాజకుమారి తదితరులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సభాప్రాంగణం 8 వేల మందికి మాత్రమే సరిపోతుందని పోలీసులు ముందుగానే హెచ్చరించినా నిర్వాహకులు స్పందించకపోవడం వల్ల ఘటన చోటు చేసుకుంది. బ్యారికేడ్లు పటిష్టంగా లేవని కూడా ముందుగానే హెచ్చరించామని, వారి నిర్లక్ష్యమే ఘటనకు దారి తీసిందని ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ తెలిపారు.

30 కౌంటర్లంటూ.. 12 లారీల్లో

చంద్రన్న సంక్రాంతి కానుకలను 30 కౌంటర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామని టీడీపీ నేతలు పోలీసులకు సమాచారమిచ్చారు. కానీ కేవలం 12 మాత్రమే ఏర్పాటు చేశారు. అది కూడా కానుకలతో కూడిన లారీలను నేరుగా మైదానంలోకి తరలించి వాటి నుంచే పంపిణీ చేశారు. వాహనాలను దూరంగా కాకుండా దగ్గరగా ఇరుకుగా నిలబెట్టారు. చంద్రబాబు వెళ్లిపోయిన 5 నిముషాల్లోనే కానుకల పంపిణీని నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీంతో లారీలు కదలడానికి సిద్ధమవుతున్నాయని పసిగట్టిన పేదలు కానుకల కోసం ఒక్కసారిగా ఎగబడ్డారు. ఫలితంగా తొక్కిసలాటకు దారితీసి అమాయక మహిళలు మృత్యువాత పడ్డారు.

జీజీహెచ్ వద్ద ఆర్తనాదాలు..



షేక్ రజియా, ప్రసాదం సీతామహాలక్ష్మి, మస్తాన్‌బీ, తెల్లమేకల మంగమ్మ, పెందుర్తి ప్రియాంక, కమాదుల సరోజని, ఎస్.భూలక్ష్మి, హిమంది ఉమాదేవి, తెల్లమేకల రంగమ్మ, హుస్సేన్‌బీ, గుంటముక్కల సౌందర్య, జానా దుర్గ, పఠాన్ ఆస్మా, నిర్మల తదితరులు తీవ్రంగా గాయపడి అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, గుంటూరు నగరానికి చెందిన పల్లపుకుమారి, సాయికృష్ణనగర్‌కు చెందిన ఇరుగు కోటేశ్వరమ్మ, కె.ఇవలమ్మ, సీతమ్మకాలనీకి చెందిన సొప్పర కీర్తన, స్వర్ణాంధ్రనగర్‌కు చెందిన చిట్టాల శివపార్వతి, చైతన్యపురి సుగాలీకాలనీకి చెందిన ధనావత్ అలివేలు తోపులాటలో గాయపడి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబ సభ్యులు, వారి బంధువులు జీజీహెచ్‌కు చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా ఆర్తనాదాలు మిన్నంటాయి. కొత్త ఏడాది తొలిరోజే తమ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొందని విలపించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం తదితరులు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. చనిపోయిన వారికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు మంత్రి రజిని ప్రకటించారు.

నాసిరకం కిట్లతో హంగామా

- చీరలు కొన్నది పది వేల మందికే
- టోకెన్లు మాత్రం 30 వేల మందికి



ఉయ్యూరు ఫౌండేషన్ ఇచ్చిన టోకెన్

గుంటూరు రూరల్: చంద్రన్న కానుకలంటూ సభాప్రాంగణం వద్ద పంపిణీ చేసిన కిట్‌లో అరకిలో కందిపప్పు, ప్యాకెట్ పామాయిల్, అరకిలో చింతపండు, అరకిలో గోధుమపిండి, కిలో ఉల్లిపాయలు, అరకిలో బెల్లం, చీర ఉన్నాయి. కిట్‌లో మొత్తం సరుకుల విలువ రూ.300కి మించి ఉండదని వాటిని తీసుకున్న మహిళలు చెబుతున్నారు. పది వేల మందికి మాత్రమే చీరలు కొనుగోలు చేసి గుంటూరులోని నగరం, పరిసర ప్రాంతాల్లో 30 వేల మందికి టోకెన్లు పంపిణీ చేశారు. టోకెన్ల కోసం మహిళల ఆధార్ జిరాక్స్‌లను నిర్వాహకులు తీసుకున్నారు. వారి పేర్లతో టీడీపీ సభ్యత్వాలు నమోదు చేసేందుకే ఆధార్ సేకరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఘటనాస్థలంలో గాయపడినవారిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు



గాయపడిన హుస్సేన్‌బీని అంబులెన్స్ నుంచి దించుతున్న ఎస్‌ఐ


ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



అరకొర సరుకుల పేరుతో పేద కుటుంబాల మహిళలకు ఆశ చూపి మరణాలకు కారణమైన టీడీపీ నాయకులపై ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. మహిళలకు పెద్దగా ఇష్టం లేకపోయినా, కొద్ది రోజులుగా టీడీపీ వాళ్లు ఇళ్ల వద్దకు వచ్చి సభకు రావాలి.. రావాలి అని ఒత్తిడి చేసి తీసుకువెళ్లారు. ఇప్పుడు ఇలా జరిగినందుకు ఎవరు బాధ్యత వహిస్తారు?

– నయీముద్దీన్, గాయపడిన మస్తాన్‌బీ భర్త

పిల్లలు పెద్ద దిక్కును కోల్పోయారు



టీడీపీ నాయకులు చేసిన ఘన కార్యం కారణంగా పిల్లలు పెద్ద దిక్కును కోల్పోయారు. అన్నిట్లో తమకు అండగా ఉండే తల్లిని కోల్పోయారు. ఇప్పుడు వారికెవరు దిక్కు? వారిచ్చే అరకొర సరుకుల కోసం మహిళలు వెంపర్లాడే విధంగా చేస్తున్నారు. ఇవాళ సరుకులు కొనలేని స్థితిలో ఎవరూ లేరు. ఇలాంటి కార్యక్రమాలతో మహిళలను ఇబ్బందులకు గురిచేయడం దారుణం. వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

– షేక్ రసూల్, మృతురాలు సయ్యద్ ఆసియా తండ్రి

వద్దు.. వద్దన్నా వెళ్లింది



టీడీపీ నాయకులు ఇచ్చే అరకొర సరుకులు మనకు వద్దని, అవసరం లేదని ఎంత మొత్తుకున్నా వినకుండా మా అమ్మ వెళ్లింది. సరుకులు, వస్త్రాలు ఇస్తామని ఇంటికొచ్చి, స్లిప్‌లు ఇచ్చి టీడీపీ వారు మహిళలకు ఆశ చూపారు. నా తల్లి మరణానికి టీడీపీ నాయకులే కారణం. వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

– చంద్రశేఖర్, రమాదేవి కుమారుడు

పేదల కోసమే జీవిస్తా

జనతా వస్త్రాల పంపిణీలో చంద్రబాబునాయుడు
సీఎం జగన్‌కు పరిపాలన చేతకాదు
టీడీపీకి 2023 ఎంతో కీలకం

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమానికి నాంది పలికిన ఎన్టీఆర్ బాటలో తాను జీవితాంతం పేద ప్రజల కోసమే బతుకుతానని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారు. గుంటూరు సదాశివనగర్‌లోని వికాస్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఉయ్యూరు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జనతా వస్త్రాలు, సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. ఎన్టీఆర్ పేదల కోసం నెలకు రూ.30 పెన్షన్ ప్రవేశపెట్టగా, తాను సీఎం అయిన తరువాత రూ.75కు పెంచితే వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రూ.200కు పెంచారని తెలిపారు. 2014లో తాను అధికారంలోకి రాగానే పెన్షన్‌ను రూ.రెండు వేలకు పెంచానన్నారు. అధికారంలోకి రాగానే రూ.మూడు వేల పెన్షన్ ఇస్తామని చెప్పి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పారని విమర్శించారు. అదే తానైతే ఒకేసారి రూ.మూడు వేలు ఇచ్చేవాడినని చెప్పారు. అన్న క్యాంటీన్లను ఎందుకు మూసివేశారో సీఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు. తాను అధికారంలో ఉండగా ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా, హిందువులకు సంక్రాంతి కానుక, క్రైస్తవులకు క్రిస్మస్ కానుక ఇస్తే ప్రస్తుత ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో నంబర్ వన్ అవినీతి పరుడు వైఎస్ జగన్ అని ఆరోపించారు. విద్యుత్ వాడకం 300 యూనిట్లు దాటితే సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌కు పరిపాలన చేతకాదని, రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తోందని, ఆయన్ను నమ్ముకుంటే పేదలకు ఎలాంటి లాభం లేదన్నారు. గతేడాది అంతా విద్వేషాలు, వైషమ్యాలతో గడిచిపోయిందని, 2023 రాష్ట్ర ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కొత్త ఏడాది టీడీపీకి ఎంతో కీలక సంవత్సరమన్నారు.

నేను వెళ్లిపోయాకే తొక్కిసలాట

- టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటన
- వాళ్లను ప్రోత్సహించాలనే వచ్చాను
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు పరిహారం
- ఫౌండేషన్ తరఫున రూ.20 లక్షల సాయం

సాక్షి, అమరావతి: గుంటూరులో ఉయ్యూరు ఫౌండేషన్ చేపట్టిన పేదలకు కానుకల పంపిణీ కార్యక్రమం నుంచి తాను వెళ్లిపోయాకే తొక్కిసలాట చోటుచేసుకుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తెలిపారు. ఆ ఘటనలో ముగ్గురు చనిపోవడం, పలువురు గాయపడటం బాధాకరమని అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలకు కానుకలు ఇచ్చేందుకు ఉయ్యూరు ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో తాను పాల్గొన్నానని తెలిపారు. ఆ స్వచ్ఛంద సంస్థ చేసే కార్యక్రమాన్ని ప్రోత్సహించాలనే ఆలోచనతోనే తాను ఆ కార్యక్రమానికి వెళ్లానని పేర్కొన్నారు. అయితే ఈ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు పార్టీ తరఫున రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తామని చెప్పారు.

అనుమతి తీసుకున్నాం..

నిబంధనల ప్రకారం అన్ని రకాల అనుమతులు తీసుకున్నాకే కానుకలు, వస్త్రాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఉయ్యూరు ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ముందుగా టోకెన్లు జారీ చేసిన వారికంటే అదనంగా ప్రజానీకం ఒక్కసారిగా లోపలకు రావటంతో అపశ్రుతి చోటు చేసుకుందని పేర్కొంది. చంద్రబాబు వెళ్లిపోయిన తర్వాత పేదలకు జనతా వస్త్రాలు, నిత్యావసరాల పంపిణీ ప్రారంభించామని తెలిపింది. ఈ ఘటనలో మరణించిన వారికి ఫౌండేషన్ తరఫున ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని, గాయపడిన వారికి అన్ని విధాల అండగా ఉంటామని వెల్లడించింది.

బాబే బాధ్యత వహించాలి

- ఆయన ప్రచార యావకు ఇది పరాకాష్ట
- మంత్రి విడదల రజిని ఆగ్రహం
- బాధితులకు పరామర్శ



రమాదేవి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి రజని, ఎమ్మెల్సీలు మాణిక్యవరప్రసాద్, అప్పిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా

గుంటూరు ఈస్ట్/సాక్షి, అమరావతి: గుంటూరులో జరిగిన దుర్ఘటనలో ముగ్గురు మహిళల మృతికి టీడీపీ అధినేత చంద్రబాబు బాధ్యత వహించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో మరణించిన వారి బంధువులను, గాయపడిన వారిని ఆదివారం ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ... అర కేజీ నూనె, అరకేజీ కందిపప్పు, చీర ఆశ చూపుతూ పది రోజుల నుంచే ప్రచారం చేశారన్నారు. ఇందుకోసం ప్రజలను వాహనాల్లో తీసుకొచ్చారన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహిళలను లైన్‌లో నిలబెట్టారని, అధికారయావతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఇది ఒక ప్రైవేటు కార్యక్రమం అయినప్పటికీ ప్రభుత్వం పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసిందన్నారు. కానుకలు తక్కువగా ఉండి, మహిళలు ఎక్కువగా ఉండటంతో తొక్కిసలాట జరిగి బారికేడ్లు కూలిపోయాయన్నారు.

టీడీపీ సభలకు ప్రజలు రాకపోవడంతో..

నిజానికి.. టీడీపీ సభలకు ప్రజలు రాకపోవడంతో కానుకల ఎత్తువేశారని మంత్రి రజిని ఎద్దేవాచేశారు. తమ సభకు పెద్దఎత్తున ప్రజలు వచ్చారని చూపించుకోవడం కోసం మాయచేసి ముగ్గురిని బలి తీసుకున్నారని ఆమె మండిపడ్డారు. పోలీసులు వెంటనే స్పందించి చాలామందిని కాపాడారని, లేదంటే ప్రాణనష్టం ఇంకా ఎక్కువ జరిగేదన్నారు. చంద్రబాబు ప్రచారయావకు ఇది పరాకాష్ట అని విమర్శించారు. కందుకూరు ఘటన నుంచి బుద్ధి తెచ్చుకుని ఉంటే ఈ ఘోరం జరిగేది కాదని ఆమె అన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు సభకు పోలీసుల నుంచి అనుమతి తీసుకోలేదన్నారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లు కూడా చేయలేదన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తుందని చెప్పారు.

బాబు అడుగుపెట్టిన ప్రతీచోట ప్రాణనష్టం: మంత్రి సురేశ్

చంద్రబాబుది ఐరన్ లెగ్ అని, ఆయన అడుగుపెట్టిన ప్రతిచోటా ప్రాణనష్టం చోటు చేసుకుంటోందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ఆరోపించారు. మొన్న కందుకూరులో 8 మంది మృతిచెందిన ఘటన మరువకముందే గుంటూరులో మరో ముగ్గురు మరణించడం కలిచి వేసిందన్నారు.



ఎక్కడైతే సరళత్వం, మంచితనం, సత్యం అనేవి లేవో... అక్కడ గొప్పతనం అనేది ఏమీ లేనట్టు!
– లియో టాల్‌స్టాయ్

సాక్షి
సోమవారం, జనవరి, 2

సాహితీ రంగవల్లికలు

ఇది ధనుర్మాసం. ముగ్గుల మాసం. మకర సంక్రాంతి వరకు ముంగిళ్లలో ముగ్గుల వ్రతాన్ని మహిళలు అప్రతిహతంగా కొనసాగిస్తారు. క్రీస్తుపూర్వం పదిహేనో శతాబ్ది ప్రాంతంలో ఆర్యులు అడుగు పెట్టే నాటికే, సింధులోయ నాగరికత పరిఢవిల్లిన చోట ముగ్గులు ఉండేవనేందుకు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆ లెక్కన ముగ్గులు పురాణాల కంటే ప్రాచీనమైనవి. కచ్చితంగా చెప్పుకోవాలంటే, వేదకాలం నాటివి. ముగ్గులు ఆదిమ చిత్రకళా రూపాలు. సింధులోయ ప్రాంతంలోనే కాదు... గ్రీకు, ఈజిప్షు శిల్పాల్లోనూ ముగ్గుల ఆనవాళ్లున్నాయి.

ముగ్గులను సంస్కృతంలో రంగవల్లిక అంటారు. సౌరసేని ప్రాకృతంలోని 'రంగొలి' అనే మాట నుంచి ఈ సంస్కృత పదం పుట్టింది. హిందీ, ఉర్దూల్లో 'రంగోలి' అంటారు. వాల్మీకి రామాయణంలోని యుద్ధకాండలో 'ఏకశృంగో వరాహస్త్వం' అనే వర్ణన ఉంది. సింధులోయ నాగరికత ప్రాంతంలో దొరికిన ముగ్గులలో ఒంటికొమ్ము వరాహరూపం ఈ వర్ణనకు సరిపోతుంది. అంతే కాదు, హరప్పా ప్రాంతంలో దొరికిన వాటిలో ఊర్ధ్వపుండ్రం, త్రిశూలం, అగ్నిగుండం, శివలింగం తదితర రూపాలలోని మెలికల ముగ్గులూ ఉన్నాయి.

సున్నపురాతి నుంచి తయారుచేసిన ముగ్గుపిండితోనూ, వరిపిండితోనూ ముగ్గులు వేయడం ఇప్పటికీ అన్ని చోట్లా వాడుకలో ఉన్న ప్రక్రియ. పురాణకాలంలో కర్పూరంతో రంగవల్లులను తీర్చిదిద్దేవారట! నన్నయ మహాభారతం ఆదిపర్వంలో 'అంగుళలనొప్పె కర్పూర రంగవల్లులు' అని వర్ణించాడు. వారణావతంలోని లక్క ఇంట్లో ఉండటానికి కుంతీసమేతంగా పాండవులు వస్తున్నప్పుడు వారికి స్వాగతం పలకడానికి వారణావతపుర వాసులు ఇంటింటా ముంగిళ్లలో కర్పూరంతో ముగ్గులు వేశారని నన్నయ వర్ణన. 'చిత్రవర్ణాతిశయ నూత్న రత్న చిత్రి/తాంగ రంగవల్లి సురగాంగణముల' అంటూ శివపురంలోని రంగురంగుల రంగవల్లులను నన్నెచోడుడు 'కుమారసంభవం'లో వర్ణించాడు. సీతాదేవి చేత జనక మహారాజు ముగ్గులు వేయించాడట! 'సంతానపరుడమ్మ జనక మహాముని/ తా ముద్దు కూతురిని తా జేరబిలిచి/ ఆవుపేడ తెచ్చి అయినిళ్లు అలికి/ గోవుపేడ తెచ్చి గోపురాలు అలికి/ ముత్యాలు చెడగొట్టి ముగ్గులేయించి' అని జానపద గీతం ఉంది.

'పలనాటి వీరచరిత్ర'లో శ్రీనాథుడు ముత్యాల ముగ్గులను వర్ణించాడు. 'కస్తూరి చేతను కలియ గనలికి/ ముత్యాల తోడ ముగ్గులను బెట్టి/ కర్పూర ముదకంబు కలిపి ముంగిటన్' అంటూ సంక్రాంతి సమయంలో ఆనాటి ముగ్గుల వేడుకను కళ్లకు కట్టాడు. క్రీడాభిరామంలో వినుకొండ వల్లభరాయడు 'చందనంబున గలయంపి చల్లినారు/ మ్రుగ్గులిడినారు కాశ్మీరమున ముదమున/ వ్రాసినా రిందు రజమున రంగవల్లి/ కంజముల దోరణంబులు గట్టినారు' అంటూ చందనంతో కళ్లాపి చల్లి ఆపైన ముగ్గులు వేసిన వైనాన్ని వివరించాడు. 'బోటి గట్టిన చెంగల్వపూవుటెత్తు/ దరు పరిణతోరు కదళి మంజరియు గొనుచు/ బోయి గుడినంబి విజనంబు జేయ జొచ్చి/ మ్రొక్కి వేదికబలు వన్నె మ్రుగ్గు బెట్టె' అంటూ శ్రీకృష్ణదేవరాయలు తన 'ఆముక్తమాల్యద'లో ఆలయాల్లో ముగ్గులు వేసే ఆనాటి ఆచారాన్ని వర్ణించాడు.


ఆధునికుల్లో తిరుమల రామచంద్ర ముగ్గువేస్తున్న ముదిత గురించి చక్కని సంస్కృత శ్లోకం రాశారు. 'రచయంతీ రంగలతాం/ మంగళగాత్రీ సలీలం అంగణకే/ విటజన హృదయాంగణకే/ అనంగజ బాధాం విశాలయతి కునూనమ్'. చక్కని అమ్మాయి ముంగిట్లో ముగ్గుపెడుతూ విటజనుల హృదయాలలో మన్మథబాధను విస్తరింపజేస్తున్నదని దీని తాత్పర్యం. ఈ శృంగార శ్లోకాన్ని ఆయన తన పదమూడేళ్ల ప్రాయంలోనే రాయడం విశేషం. 'ఉగ్గేల తాగుబోతుకు/ ముగ్గేల తాజమహలు మునివాకిటిలో' అంటూ శ్రీశ్రీ తన 'సిరిసిరిమువ్వ శతకం'లో ముగ్గు ప్రస్తావన తెచ్చారు. నేల మీద ముగ్గులు మనుషులు వేస్తారు గానీ, నీలాకాశం మీద చుక్కల ముగ్గులు వేసేది సాక్షాత్తు భగవంతుడేనని కరుణశ్రీ నమ్మకం. 'పనిమాలి ప్రతిరోజు ప్రాణికోటుల గుండె/ గడియారముల కీలు కదపలేక/ అందాలు చింద నీలాకాశ వేదిపై/ చుక్కల మ్రుగ్గులు చెక్కలేక/ ఎంతశ్రమ యొందు చుంటివో యేమొ స్వామి' అంటూ దేవుడి కష్టానికి కలత చెందడం ఆయనకే చెల్లింది!

ముగ్గుతో ముడిపడిన జాతీయాలు, సామెతలు కూడా ఉన్నాయంటే, ముగ్గులు మన సంస్కృతిలో ఎంతగా పెనవేసుకుపోయాయో అర్థం చేసుకోవచ్చు. బాగా నెరిసిన తలను 'ముగ్గుబుట్ట' అంటారు. 'ముగ్గులోకి దించడం' అంటే ప్రత్యేకంగా వివరించనక్కర్లేదు. 'వాయువేగమును మించి, లోకాలను గాలించి, చిటికెలోనే ఉన్న చోటికే వచ్చు. అదేమిటి?' అనే పొడుపు కథ ఉంది. దీనికి సమాధానం 'ముగ్గు'. మొదలు పెట్టిన చోటే ముగించడం ముగ్గు కళలో ప్రత్యేకత. 'మరిగే నూనెలో ముచ్చటైన ముగ్గు. తీసి తింటే కరకరమంటుంది' అనే పొడుపు కథకు సమాధానం 'జంతిక'. జంతికలు చూడటానికి మెలికల ముగ్గుల్లాగానే ఉంటాయి కదా!

భారతీయులకు ముగ్గులు ముదితల వ్యవహారమే గానీ, కొన్ని ఆఫ్రికన్ దేశాల్లో ముగ్గులు వేయడం పురుషుల బాధ్యత. ఆఫ్రికన్లు ముగ్గులు వేయడానికి సున్నపురాతి ముగ్గుపిండి, వరిపిండి వంటివేమీ వాడరు. నేరుగా ఇసుకలోనే వేలితో లేదా కర్రపుల్లతో చుక్కలు పెట్టి, చుక్కల చుట్టూ మెలికల ముగ్గులు తీర్చిదిద్దుతారు. ముగ్గుల కళ దేశదేశాల్లో వ్యాపించి ఉన్నా, మన భారతీయ సాహిత్యంలో మాత్రం ముగ్గుల ప్రస్తావన విస్తారంగా కనిపిస్తుంది. అదీ విశేషం!

నూతన సంవత్సర తీర్మానాలు

కామెంట్



కరణ్ థాపర్

జీవన చక్రం కొత్త మలుపు తిరిగినట్టు అనిపించే నూతన సంవత్సరం చాలా ప్రత్యేకమైనది. ఏవో కొత్త తీర్మానాలు చేసుకునే సందర్భం ఇది. కొత్త పట్టుదలలు ప్రదర్శించే అవకాశం కూడా! కానీ ఏం తీర్మానం చేసుకోవాలి? ధూమపాన రాయుళ్లకు సిగరెట్లను వదిలిపెట్టాలని అనుకోవడం సులభమైన తీర్మానం. చాకొలేట్లు, పుడ్డింగులు వదిలేసుకునే వాళ్లు నాకు తెలుసు. కొందరయితే మద్యపానం వదులుకోవడాన్ని ఎంచుకుంటారు. అతి కొద్ది మంది మాంసాన్ని కూడా వదిలేసుకుంటారు. మనం దేన్నయినా ప్రతిఘటిస్తున్నప్పుడు దృఢంగా ఉండాలని అనుకుంటాం. దానివల్ల మనది మనకు మెరుగైన భావన కలుగుతుంది. శుద్ధి అయినట్టు కూడా ఉంటుంది. అందుకే దేన్నయినా వదిలేసుకోవడం మంచి అనుభూతిని కలిగిస్తుంది. కానీ నిజమేమిటంటే, ఓటమిని అంగీకరించడం మరింత మంచి అనుభూతిని కలిగిస్తుంది. ఆస్కార్ వైల్డ్ చెప్పినట్లుగా, ఆశను లేదా ప్రలోభాన్ని అధిగమించడంలో ఉత్తమ మార్గం ఏమిటంటే, దానికి లొంగిపోవడమే!

పుట్టినరోజుల్లాగే నూతన సంవత్సరాది కూడా ప్రత్యేకమనిపిస్తుంది. ఈ రెండు సందర్భాల్లోనూ జీవనచక్రం కొత్త మలుపు తిరుగుతుంది. ఆశ, అంచనాలతో ముందుకు చూసే ఒక లిప్త పాటు అది. తాజా తీర్మానాలు చేసుకునే, కొత్త పట్టుదలలు ప్రదర్శించే అవకాశం అది. మనం మరింత ఉత్తమంగా ఉంటామనీ, లేదా కనీసం విభిన్నంగా ఉంటామనీ విశ్వాసం కలిగే సందర్భం ఇది.

నూతన సంవత్సర తీర్మానాలను ప్రజలు ఇందుకే చేసుకుంటారని నేను ఊహిస్తున్నాను. నేను కూడా తప్పనిసరిగా తీర్మానాలు చేసుకున్న కాలం ఒకప్పుడు ఉండేది. సదాచార కట్టుబాట్లు విధించుకుని ఒక వారం పాటు గట్టిగా కట్టుబడి ఉండేవాడిని. తర్వాత మరో వారం దాన్ని బలహీనంగా కొనసాగించి, అటుపై దానిగురించి సంతోషంగా మర్చిపోయేవాడిని. తొలివారం బాగా అనిపించేది. రెండోవారం మాత్రం అపరాధ భావనను మిగిల్చేది. కానీ నా తీర్మానానికి తిలోదకాలు ఇచ్చి నా పాత చెడు మార్గాలకు తిరిగి వెళ్లిపోయినప్పుడే ఉత్తమంగా ఉందనిపించేది.

ఇప్పుడు తీర్మానం లక్ష్యం స్వీయ నిరాకరణే. దీంట్లో తర్కం సరళం. మీరు దేన్నయినా ప్రతిఘటిస్తున్నప్పుడు దృఢంగా ఉండాలని సాధారణంగా భావిస్తుంటారు. కొన్నిసార్లు మీరు శుద్ధి చేయబడినట్లు భావిస్తుంటారు. సాధారణంగా మీరు మెరుగైనట్లు భావిస్తుంటారు. అందుకే దేన్నయినా వదిలేసుకోవడం మంచి అనుభూతిని కలిగిస్తుంది. కానీ నిజమేమిటంటే, ఓటమిని అంగీకరించడం మరింత మంచి అనుభూతిని కలిగిస్తుంది. ఆస్కార్ వైల్డ్ చెప్పినట్లుగా, ఆశను లేదా ప్రలోభాన్ని అధిగమించడంలో ఉత్తమ మార్గం ఏమిటంటే, దానికి లొంగిపోవడమే. అయితే ఆయన గుర్తించనిది ఏమిటంటే, కొంత కాలం ప్రతిఘటించిన తర్వాత దానికి లొంగిపోవడం మరింత ఉత్తమంగా ఉంటుందన్న సంగతి. తిరస్కరణకు సంబంధించిన ఒక మచ్చ ఆకలిని మరింత రెచ్చగొట్టి, ప్రలోభానికి పదునైన అంచును కల్పిస్తుంది. ఇక అతిక్రమణ ఎప్పుడైతే జరుగుతుందో అప్పుడు ఆ మొత్తం మరింత తియ్యగా ఉంటుంది.

సంక్లిష్టమైన ప్రశ్న ఏమిటంటే, అసలు ఒకరు వదులుకోవాల్సినది ఏమిటి? దీనికి ముందు షరతు ఏమిటంటే, అది అంత సులభమైనదిగా ఉండకూడదు. లేకుంటే తొలి వారంలో మీరు అమరత్వం పొందిన సన్యాసత్వ ప్రభను పొందలేరు. అలాగే ఆ వదులుకునేది మీకు ఏమంత మంచిది కాకుండా ఉండాలి. లేకపోతే మీరు చేసుకున్న



తీర్మానం విఫలమైనప్పుడు మిమ్మల్ని మీరు నిందించుకోలేరు. కానీ అంతిమంగా, అది అంత ప్రాధాన్యత లేని విషయంగా ఉండాలి. లేకుంటే మీరు చేతులు ఎత్తేసినప్పుడు మీకు ఉపశమనం కలగక పోగా, అపరాధ భావన కలుగుతుంది.

ఇది ఇక పరిధి లేదా పరిమితిని గణనీయంగా కుదించివేస్తుంది. ధూమపాన రాయుళ్లకు సులభమైన అవకాశం ఏమిటంటే, సిగరెట్లను వదిలిపెట్టడమేనని నేను అనుకుంటున్నాను. ఈ ప్రయత్నంలో వారు విజయవంతమైనప్పుడు వారు మంచి అనుభూతి చెందుతారు. తాము సద్గుణవంతులుగా కూడా భావిస్తారు. అయితే వారు తొట్రుపడి పొరపాట్లు చేసి, తొలి పఫ్ పీల్చే ఆనందానికి లొంగిపోయినప్పుడు అది మరింత బాగుంటుంది.

చాకొలేట్లు, పుడ్డింగులు (కేకుల్లాంటివి) వదిలేసుకునే వాళ్లు నాకు తెలుసు. కొందరయితే మద్యపానం వదులుకోవడాన్ని కూడా ఎంచుకుంటారు. అతి కొద్దిమంది మాంసాన్ని కూడా వదిలేసుకుంటారు. నిజాయితీగా చెప్పాలంటే, వీరిలో ఎవరూ నన్ను ప్రలోభ పెట్టలేదు. నా డిజర్టులు (తీపి పదార్థాలు), తాగుళ్లు నాకు ఎంత ఇష్టమంటే వీటిని వదులుకోవాలనే కనీస ఆలోచన కూడా నేను చేయలేను. నేను కచ్చితమైన మాంసాహారిని. అంతకంటే ముఖ్యంగా, నేనేమీ సాధుత్వం కోసం ప్రయత్నించటం లేదు. వారం, పదిరోజులకోసారి స్వయంకృతాపరాధమే అయినా స్వల్పకాలిక 'చిత్రహింస'ను భరిస్తాను.

నేను అబద్ధాలు చెప్పడం ఆపివేయాలనుకున్న సందర్భం కూడా ఒకటి ఉండేది. ఇప్పుడు నన్ను తప్పుగా అర్థం చేసుకోకండి. ఏదో సామెత చెప్పినట్టు, నేనేమీ అబద్ధాల కోరును కాదు. కానీ వింత అబద్ధాలను చెబుతుంటాను. కానీ చాలా తక్కువసార్లు మాత్రమే. దాన్ని గురించి మీరు ఆలోచించినట్లయితే, ఈ అబద్ధాలను వదులుకోవడం అనేది నూతన సంవత్సర తీర్మానాల్లోకి బ్రహ్మాండంగా సరిపోతుంది. మీరు దాన్ని అమలు చేస్తున్నప్పుడు అది బాగుందనిపిస్తుంది. కానీ మీరు పొరపాట్లు చేయడం మొదలైనప్పుడు మళ్లీ అపరాధ భావన కలుగుతుంది. ఇక మీరు తిరుగుబాటు చేసి, బొంకులు చెప్పడం తిరిగి మొదలుపెట్టినప్పుడు ఎంతో ఉపశమనం కలిగినట్లుగా ఉంటుంది.

నేను దాన్ని కనీసం రెండోరోజు వరకు కూడా పాటించలేకపోయాను. నిజానికి, మొదటిరోజుకే సరిపోయింది. ప్రతి చిన్న అతిశయోక్తినీ తనిఖీ చేసుకోవాల్సి వచ్చింది. అది కూడా ఒక రకం అబద్ధమే. పర్యవసానంగా, సంభాషణ జరపడం అత్యంత అసాధ్యంగా మారింది. నేను ఏం చెప్పాల్సి ఉంటుందనే విషయంపై ఆచితూచి, కచ్చితంగా వ్యవహరించాల్సి వచ్చింది. ఆఖరికి నేను ఏమరుపాటుగా ఏదో చెప్పినదాన్ని కూడా దిద్దుకోవడానికి నన్ను మళ్లీ మళ్లీ ఎంత సవరించుకోవాల్సి వచ్చిందంటే, దాదాపుగా నేనిక మాట్లాడలేక పోయాను. మీకు నన్ను ఒకటి చెప్పనివ్వండి. మీకు గప్పాలు కొట్టడం రాకపోతే గనక, మీరు ఒక కథ చెప్పలేరు. కాబట్టి నా దగ్గర నిజంగానే చెప్పడానికి ఏమీ లేకుండాపోయింది.

2023 సంవత్సరం లోకి అడుగుపెడుతున్న వేళ ఏ 'కొత్త సంవత్సరపు' తీర్మానం చేసుకోవాలో నాకు కచ్చితంగా తెలీదు. నాకు ఇష్టమైనదాన్ని ఉద్దేశపూర్వకంగా నాకు నేనుగా తిరస్కరిస్తున్నప్పుడు ఒక పరమపావన గుణాన్ని నేను అనుభూతి చెందుతాను. కానీ అదేమిటో నేను ఆలోచించలేదు. బహుశా నా మనసును సిద్ధపర్చుకోవడానికి ఈ రోజంతా ఉంది. కానీ అందులో విఫలమవుతానని నాకు ముందే అనిపిస్తోంది. అయితే ఒకటి, కనీసం వచ్చే సంవత్సరం కోసమైనా ఏదైనా ఎంపిక చేసుకోవడానికి నాకు 364 రోజులు ఉంటాయి. కాబట్టి ఏదైనా సరైనదాన్ని గురించి మీరు ఆలోచిస్తున్నట్లయితే, అదేమిటో నన్ను కూడా తెలుసుకోనిస్తారా?

నూతన సంవత్సర శుభాకాంక్షలు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

జరగకూడనివి



కొత్త సంవత్సరంలో కనీసం మూడు విషయాల్లో నేను గట్టిగా ఆశావహంగా ఉన్నాను: 1. మూడో ప్రపంచ యుద్ధం జరగదు. లేదా యూఎస్, చైనా, రష్యా మధ్య ప్రత్యక్ష సైనిక ఘర్షణ ఉండదు(కోల్డ్ వార్ 2.0). 2. తైవాన్ మీద చైనా సైనిక దాడి జరగదు. 3. ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యా అణ్వాయుధాలను వినియోగించదు.

– వెలీనా త్చకరోవా, విశ్లేషకురాలు

అన్నీ చూసుకోవాలి



చాలా కాలం కిందటే ఈ కొత్త సంవత్సర పార్టీలకు వెళ్లడం నేను మానుకున్నాను. ఎందుకంటే ఎప్పుడైతే మీరు మద్యం తాగరో మీరింక అతిథి కాదు, మీరే అడ్మిన్ అవుతారు.

– కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

ఇదేనా మంచి?



ముంబయి విమానాశ్రయంలో రెండు సమోసాలు, ఒక చాయ్, ఒక వాటర్ బాటిల్ కలిపి మొత్తం 490 రూపాయలు! చాలా 'అచ్ఛే దిన్' (మంచి రోజులు) వచ్చినట్టున్నాయి.

– ఫరాహ్ ఖాన్, ట్రావెలర్

కరుణ ముఖ్యం



ప్రతి ఒక్కరికీ మనశ్శాంతి మీద కొంత ఆసక్తి ఉంటుంది. అంతర్గత శాంతిని నిలుపుకోవాలంటే మనం గుర్తించవలసింది – కోపం, అనుమానం లాంటి నాశనకారి ఉద్వేగాలు మన మనసుకు అంతరాయం కలిగిస్తున్నాయని! మరోవైపు కరుణ శాంతినీ, ఆత్మ విశ్వాసాన్నీ తెస్తుంది.

– దలై లామా, బౌద్ధ గురువు

పోగొట్టుకోవద్దు



ప్రజాదరణ అనేది ఇతరుల్లో మన ప్రతిష్ఠకు సంబంధించినది. కానీ సమగ్రత (ఇంటిగ్రిటీ) అనేది మనతో మనకు సంబంధం ఉన్నది. ప్రజాదరణను తిరిగి పొందవచ్చు. కానీ సమగ్రతను పొందలేం.

– మార్క్ మాన్సన్, రచయిత

ఇలా చేయాలి



కొంత ఎండను తగలనిద్దాం! మంచి ఆరోగ్యం, కండరాల వయసు పెరుగుదలను ఆపడానికి ఉన్న ఏకైక మార్గం– శుభ్రంగా తినడం, ఎండ తగలడం, నిద్ర, తగినన్ని నీళ్లు.

– పల్లవీ ఆగా, వెల్‌నెస్ డాక్టర్

తెలుగు–ఒడియా అనువాద వారధి

ఫకీర్ మోహన్ సేనాపతితో మొదలైన ఆధునిక ఒడియా సాహిత్యం ఇప్పుడు కొత్త పుంతలు తొక్కుతోంది. కొత్త కొత్త ధోరణులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటోంది. సమాజం లోని విభిన్న వర్గాల గొంతులను ప్రతిధ్వనిస్తోంది. ఇదివర కటితో పోల్చుకుంటే, ఒడియా రచయితలు అనువాదాలపై మరింతగా దృష్టిపెడుతున్నారు. ముఖ్యంగా ఇరుగు పొరుగు భాషల్లో వెలువడిన సాహిత్యాన్ని ఒడియాలోకి అనువదించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆధునిక ఒడియా సాహిత్య రంగంలో ఇదొక మేలి మలుపు. బరంపురంలో డిసెంబర్ 24, 25 తేదీలలో కేంద్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో జరిగిన 'వికాసం' స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురు ఒడియా రచయితలు అనువాదాలు మరింత విస్తృతంగా జరగాల్సి ఉందని అన్నారు.

'రాజకీయాలు మనుషులను విడగొడితే, సాహిత్యం మనుషులను చేరువ చేస్తుంది. పరస్పర అనువాదాల వల్ల భాషా సంస్కృతుల మధ్య, మనుషుల మధ్య మరింతగా సఖ్యత ఏర్పడుతుంది' అని ప్రముఖ ఒడియా పాత్రికేయుడు, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు గౌరహరి దాస్ అభిప్రాయ పడటం విశేషం. ఆయన కథలను 'గౌరహరి దాస్ కథలు' పేరిట కెవీవీఎస్ మూర్తి తెలుగులోకి అనువదించారు. 'వికాసం' స్వర్ణోత్సవ కార్య క్రమాల్లోనే ఈ అనువాద సంపుటి ఆవిష్కరణ కూడా జరిగింది.



బంగాళీ నంద



గౌరహరి దాస్

డిజిటల్ మీడియా వ్యాప్తి ఎంతగా పెరిగినా, ఒడియాలో ముద్రిత పత్రికలకూ ఆదరణ తగ్గకపోవడం మరో విశేషం. గౌరహరి దాస్ సంపాదకత్వంలోని 'కథ' మాసపత్రిక ఒడిశాలోనూ, ఒడిశా వెలుపల కూడా మంచి పాఠకాదరణ పొందుతోంది. కేవలం కథానికలను ప్రచురించే ఇలాంటి సాహితీ పత్రికేదీ మన తెలుగులో లేకపోవడం విచారకరం. 'కథ' మాసపత్రికను అత్యధిక జనాదరణ గల దినపత్రిక ఒడియా 'సంబాద్' ప్రచురిస్తోంది. ఇదే కాకుండా, ఒడిశాలో 'కాదంబిని', 'ఆహ్వాన్', 'ఒడియా సాహిత్య', 'ప్రేరణ' వంటి పత్రికలు సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నాయి. ఇవి అనువాద సాహిత్యానికి కూడా పెద్దపీట వేస్తున్నాయి. ఇక 'కరోనా' కాలంలో తెలుగులో మనకు ఉన్న వారపత్రికలు కూడా మూతబడ్డాయి. ఒడియాలో అనువాద సాహిత్యానికి అక్కడి పత్రికలు బాసటగా నిలుస్తుంటే, మనకు అలాంటి పత్రికలే ఇక్కడ కరవయ్యాయి. తెలుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే, ఒడిశా వెనుకబడిన రాష్ట్రమే అయినా, సాహితీరంగంలో మాత్రం ముందంజలో ఉందనే చెప్పుకోవాలి.


ఇతర భాషల సంగతి పక్కనపెడితే, తెలుగు నుంచి ఒడియాలోకి అనువాదాలు ఇటీవలి కాలంలో చెప్పుకోదగ్గ స్థాయిలోనే వస్తున్నాయి. బరంపురానికి చెందిన కడి రామయ్య వేమన పద్యాలను దాదాపు మూడు దశాబ్దాల కిందటే ఒడియాలోకి అనువదించారు. ప్రముఖ రచయిత్రి మాలతీ చందూర్ నవల 'హృదయనేత్రి'ని రఘునాథ్ పాఢి శర్మ ఒడియాలోకి అదే పేరుతో అనువదించారు. ఇది ఒడియాలోనూ మంచి పాఠకాదరణ పొందింది. వేంపల్లి గంగాధర్ రాసిన 'ఆగ్రా టాంగా'ను 'ఆగ్రారొ టాంగావాలా' పేరిట అంజలీ దాస్ అనువదించారు. తెలుగు నుంచి ఒడియాలోకి విరివిగా అనువాదాలు సాగిస్తున్న వారిలో బంగాళీ నంద ప్రముఖుడు. ఉభయ భాషలూ ఎరిగిన ఒడియా రచయిత బంగాళీ నంద నేరుగా తెలుగు నుంచి ఒడియాలోకి అనువాదాలు సాగిస్తుండటం విశేషం. శివారెడ్డి, ఎన్.గోపి, ఓల్గా తదితరుల రచనలను ఆయన అనువదించారు. వీటిలో పలు పుస్తకాలను సాహిత్య అకాడమీ ప్రచురించింది.

బరంపురానికి చెందిన ఉపద్రష్ట అనూరాధ పలు తెలుగు రచనలను ఒడియాలోకి అనువదించడమే కాకుండా, సుప్రసిద్ధ ఒడియా రచయిత మనోజ్ దాస్ కథలను, పలు ఇతర ఒడియా రచనలను తెలుగులోకి తీసుకొచ్చారు. ఉభయ భాషల్లోనూ ఆమె అనువాదాలు పాఠకాదరణ పొందాయి. కళింగ సీమలో చాగంటి తులసి కూడా విరివిగా అనువాదాలు చేశారు. 'వికాసం' కార్యదర్శి రవిశర్మ ఇటీవల అరణ్యకృష్ణ కవితలను తెలుగు నుంచి ఒడియాలోకి అనువదించారు. ఉభయ భాషల్లోని కొత్తతరం రచయితలు, కవులు విరివిగా అనువాదాలు చేస్తున్నట్లయితే, ఒకరి సాహిత్యం మరొకరికి చేరువ కావడమే కాకుండా, ఉభయ భాషల ప్రజల మధ్య సాన్నిహిత్యం కూడా మరింత పెరుగుతుందని ఆశించవచ్చు.

– పన్యాల జగన్నాథదాసు, కవి, సీనియర్ జర్నలిస్టు

దేశంలో ఆకలి కేకలు ఆగాలంటే...

అభిప్రాయం



బొల్లిముంత సాంబశివరావు

దేశానికి 'స్వాతంత్య్రం' వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా ప్రజల మౌలిక అవసరాలను పరిష్కరించటంలో పాలక ప్రభుత్వాలన్నీ విఫలమైనాయి. కూడు, గూడు, గుడ్డ లేక పేదలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. కోట్లాది మంది పేదలు ఆహారం కోసం హాహా కారాలు చేస్తున్నారు.

ప్రపంచ ఆకలి సూచిలో (గ్లోబల్ హంగర్ ఇండెక్స్) భారత స్థానం దిగజారుతూ వస్తున్నది. 2021లో 101 స్థానంలో ఉండగా 2022లో 107వ స్థానానికి దిగజారింది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ నివేదికలో 121 దేశాలు ఉన్నాయి. వీటిల్లో చైనా, టర్కీ, కువైట్ సహా 17 దేశాలు ప్రథమ స్థానంలో ఉన్నాయి. ఐర్లాండ్‌కి చెందిన 'కన్సర్న్ వరల్డ్ వైడ్', జర్మనీకి చెందిన 'వెల్త్ హంగర్ హైఫ్' సంస్థలు ఈ నివేదికను రూపొందించాయి. ఈ 121 దేశాల్లో ఆసియా ఖండంలో భారతదేశం కంటే అఫ్గానిస్తాన్ మాత్రమే వెనకబడి ఉంది. పాకిస్తాన్ 99, బంగ్లాదేశ్ 84, నేపాల్ 81, శ్రీలంక 64 స్థానాల్లో మనకంటే మెరుగ్గా ఉన్నాయి. 2020లో గ్లోబల్ ఇండెక్స్ స్కోర్ 38.8గా ఉండి నేడు 29.1గా నమోదు అయ్యింది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జీహెచ్ఐ) ప్రపంచ స్థాయిలో, రీజనల్ స్థాయిలో ఆకలిస్థాయిని వెల్లడిస్తుంది. 29.17 స్కోర్‌తో భారతదేశం 'అత్యంత సీరియస్' అన్న లేబుల్ పొందింది. ఆసియా రీజియన్‌లోనూ, మొత్తం ప్రపంచంలో అత్యంత ఎక్కువ ఆకలి స్థాయిలో భారత్ ఉందని నివేదిక వెల్లడించింది.

జీహెచ్ఐ నివేదికను పోషకాహార లోపం, పిల్లల పెరుగుదల, పిల్లల మరణాలు వంటి అంశాలను ఆధారంగా చేసుకుని 100 పాయింట్ స్కేల్లో లెక్కిస్తారు. సున్నా వస్తే ఉత్తమ (ఆకలి లేదు) స్కోర్, 100 వస్తే చెత్త స్కోర్, అంటే ఆకలి బాగా ఎక్కువగా ఉండటంగా పరిగణిస్తారు.

దేశంలో పోషకాహార లోపం 2018–20లో 140 శాతం ఉంటే 2019–21 నాటికి 163 శాతానికి పెరిగింది. ప్రపంచంలో పోషకాహార లోపం ఉన్న జనాభా 828 మిలియన్లు ఉంటే, ఇండియాలోనే 224.3 మిలియన్ల మంది ఉన్నారు. 117 దేశాల నుంచి సేకరించిన సమాచారంతో రూపొందించిన నివేదికలో భారతదేశంలో 22.4 కోట్ల మంది పోషకాహారం లభించక బాధపడుతున్నారు. ఇందులో 15 నుంచి 49 ఏళ్ల లోపు వయస్సుగల మహిళలు 51 శాతం అని నివేదిక పేర్కొన్నది. 2019లో చిన్నారుల స్థితిపై యునిసెఫ్ నివేదిక ప్రకారం 5 ఏళ్ల లోపు 69 శాతం పిల్లలు సరైన పౌష్టికాహారం లేక ప్రాణాలు కోల్పోతున్నారు. 4.66 కోట్ల మంది వయస్సుకు తగ్గ ఎత్తు పెరగటం లేదు. 2.56 కోట్ల మంది చిన్నా రులు ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. 5 నుంచి 23 సంవత్సరాల లోపు పిల్లల్లో కేవలం 10 శాతం మందికే పోషక విలువలు గల



ఆహారం లభిస్తున్నదని కేంద్ర ప్రభుత్వ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా డేటా తెలుపుతున్నది.

భారతదేశంలో 20 కోట్లకు పైగా వలస కార్మికులు ఉన్నారు. వీరు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. మరో 20 కోట్ల మంది దేశంలో దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నారు. కనీస ఆదాయం లేక 23 కోట్ల మంది రోజు వారీ కూలీలు, చిరు వ్యాపారులు... పస్తులు, అర్ధాకలితో జీవిస్తున్నారు. భారత ఆహార సంస్థ గోదాముల్లో ఆహార ధాన్యాలు ముక్కి పోతున్నా పేదలకు, అన్నార్తులకు అందించక పోవటం ఏమిటని సుప్రీమ్ కోర్టు అనేక సార్లు ప్రశ్నించింది. గోదాముల్లో 7.10 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు నిల్వ ఉన్నాయి. గత ఆరేళ్ల కాలంలో 40 వేల టన్నుల ఆహార ధాన్యాలు పాడై పోయాయి. దీన్ని గమనిస్తే ఆహార ధాన్యాలు పాడైనా ఫరవాలేదు, పేదలకు మాత్రం పంపిణీ చేయం అన్నదే పాలకుల విధానంగా ఉంది.

దేశం అభివృద్ధి బాటలో పయనిస్తున్నదనీ, ఆహార ధాన్యాల్లో స్వయం సమృద్ధిని సాధించటమే కాకుండా ఎగుమతి చేసే స్థాయిలో ఉందనీ మోదీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. కేంద్రం చెబుతున్న దానికీ, గ్రామీణ ప్రాంతంలో జరుగుతున్న పరిణామాల కూ పొంతన లేకుండా ఉంది. గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా రైతాంగం అధిక సంఖ్యలో నిరసనలు చేస్తున్నారు. కోటి 40 లక్షల మంది రైతులు వ్యవసాయం నుంచి ఎందుకు వైదొలిగారు? ఆహార ధాన్యాల ఎగుమతిదారుగా భారత్ ఉంటే రైతాంగం ఎందుకు వ్యవసాయం నుంచి వైదొలుగుతున్నారు? నేటికీ దేశంలో 27 కోట్ల మంది ప్రజలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితుల ఎందుకు ఉన్నాయి? దేశంలో పండిన పంటలను దేశ అవసరాలకు ఉపయోగించి నప్పుడే ఏ దేశమైనా స్వావలంబన సాధించినట్టు చెప్పవచ్చు. ప్రజలకు ఆహారం అందుబాటులో లేక ఆకలి కేకలు పెడుతుంటే, వారి ఆకలి తీర్చకుండా ఎగుమతులు చేయటం స్వావలం బన సాధించటం కాదు.

దేశ ప్రజల పేదరికానికీ, వారి ఆకలి ఆర్తనాదాలకూ దేశ పాలకులు అమలు జరిపిన విధానాలే కారణం. సామ్రాజ్యవాదం, బడా బూర్జువా, భూస్వామ్య వర్గంతో లాలూచి పడిన పాలక ప్రభుత్వాలన్నీ దేశ సహజ వనరులన్నిటినీ వారికి కట్టబెడుతూనే ఉన్నారు. ఫలితంగా దేశాభి వృద్ధి కుంటుపడటమే కాకుండా ప్రజల జీవన ప్రమా ణాలు దిగజారుతూ వచ్చాయి.ఈ పరిస్థితి మారాలంటే... సహజ వనరులన్నీ దేశాభివృద్ధికి ఉపయోగపడేలా చేయాలి. సామ్రాజ్యవాద దోపిడీని అరికట్టాలి. పారి శ్రామిక అభివృద్ధిలో పాత్రధారులైన కార్మికులకూ పరిశ్రమల్లో హక్కు కల్పించాలి. అలాగే గ్రామీణ పేదలకు భూమి పంపిణీ జరగాలి. అప్పుడే దేశంలో ఆకలి కేకలు ఆగిపోతాయి.

వ్యాసకర్త రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రైతు కూలీ సంఘం (ఏపీ) । మొబైల్: 98859 83526

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: శు.ఏకాదశి రా.10.31 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: భరణి సా.5.04 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: తె.5.31 నుండి 7.10 వరకు(తెల్లవారితే మంగళవారం), దుర్ముహూర్తం: ప.12.24 నుండి 1.10 వరకు, తదుపరి ప.2.37 నుండి 3.22 వరకు, అమృతఘడియలు: ప.12.06 నుండి 2.22 వరకు, వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి: రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు: సూర్యోదయం 6.35: సూర్యాస్తమయం 5.33.

క్లుప్తంగా...

ఐటీ పాలసీ అభివృద్ధిపై సీఎంకు జీవీఎల్ లేఖ

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): రాష్ట్రంలో ఐటీ పాలసీని అభివృద్ధి చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీజేపీ రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు లేఖ రాసినట్లు జీవీఎల్ కార్యాలయ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. ఐటీ రంగం అభివృద్ధిని ఈ ఏడాది ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, బెంగళూరు, ముంబాయి, హైదరాబాద్ నగరాల మాదిరిగా ఐటీని విశాఖలో అభివృద్ధి చేసి సంపద సృష్టించాలని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఐటీ కంపెనీలకు ప్రోత్సాహకాల రూపంలో రూ.90 కోట్లు ఇవ్వాలని, ఐటీ అభివృద్ధి కోసం విశాఖలో శాటిలైట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

లక్ష్మీపార్వతికి మాతృవియోగం


దాసరి సామ్రాజ్యలక్ష్మి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ తెలుగు, సాంస్కృతిక అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి తల్లి దాసరి సామ్రాజ్యలక్ష్మి (85) మృతిచెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం తెల్లవారుజామున మరణించారు. నెలరోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతిచెందారు. సాయంత్రం ఫిలింనగర్ మహాప్రస్థానంలో ఆమె అంత్యక్రియలు పూర్తిచేశారు. దాసరి సామ్రాజ్యలక్ష్మి, కృష్ణమూర్తి దంపతులకు లక్ష్మీపార్వతి ఏకైక సంతానం.

'డిస్కం'ల ఆధునికీకరణకు ప్రణాళిక

- ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: విద్యుత్ రంగం సుస్థిరతను సాధించేందుకు విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లను ఆధునికీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మూడేళ్లలో డిస్కంలను ఆదుకునేందుకు ప్రభుత్వం దాదాపు రూ.48,882 కోట్లు ఆర్థిక సహాయం అందించిందని తెలిపారు. విద్యుత్ సంస్థలను బలోపేతం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి అన్నారు. రైతులకు 9 గంటలు పగటిపూట నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించడంతోపాటు వినియోగదారులకు ప్రపంచ ప్రమాణాలతో నిరంతర సరఫరాను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తన స్థాపిత ఇంధన సామర్థ్యంలో 42 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా సాధించిందని తెలిపారు. ఇటీవల 6,500 మెగావాట్ల సోలార్, 2,050 మెగావాట్ల పవన, 10,980 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను ప్రైవేట్ డెవలపర్‌లకు ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, జేఎండీ ఐ.పృథ్వీతేజ్, ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి, డిస్కంల సీఎండీలు జె పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలకు అడ్డుపడితే సహించేది లేదు

- బహుజన పరిరక్షణ సమితి నేతలు


రిలే దీక్షలలో పాల్గొన్న నాయకులు

తాడికొండ: కులవాదంతో కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజనాలకు అడ్డుపడితే సహించేది లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో 826వ రోజు కొనసాగుతోన్న రిలే నిరాహార దీక్షలకు ఆదివారం పలువురు హాజరయ్యారు. విశాఖ కేంద్రంగా ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ కార్యకలాపాలను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి బొత్స ప్రకటించడం హర్షణీయమన్నారు. ప్రజలను రెచ్చగొట్టేందుకు సమావేశాలు నిర్వహిస్తూ వారి ప్రాణాలతో చంద్రబాబు చెలగాటమాడుతున్నాడని నేతలు మండిపడ్డారు. కందుకూరు ఘటన జరిగిన తరువాత అయినా కనీస జాగ్రత్తలు పాటించకుండా గుంటూరులో సమావేశం నిర్వహించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోన్న చంద్రబాబును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, పులి ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి..
తిరుమల ముస్తాబు

సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం

- పది రోజుల దర్శనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం
- 2, 3 తేదీల్లో కూడా రాజ్యాంగ పదవుల్లో ఉన్న ప్రముఖులకే దర్శనం
- ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సిఫారసు లేఖలు రద్దు
- బఫర్ స్టాక్‌లో 3.50లక్షల లడ్డూలు
- ఉ.6 నుంచి రాత్రి 12 గంటల వరకు అన్నప్రసాద వితరణ
- 'సాక్షి'తో టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్



తిరుమల: భూలోక వైకుంఠం తిరుమల పుణ్యక్షేత్రంలో పది రోజులపాటు జరగనున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వైకుంఠ ద్వార దర్శనం నిమిత్తం భక్తులకు టీటీడీ సకల ఏర్పాట్లూ పూర్తిచేసింది. సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చేలా చర్యలు తీసుకున్నట్లు టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనం పురస్కరించుకుని తిరుమలలో 10 రోజుల ఉత్సవాల గురించి ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వైకుంఠ ఏకాదశి పర్వదినానికి సర్వం సిద్ధమయ్యాయి. సోమవారం వేకువ జామున ఒంటి గంట 45 నిమిషాల నుంచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభిస్తాం. అనంతరం ఉ.6 గంటల నుంచి సామాన్య భక్తులకు దర్శనాలు ప్రారంభమవుతాయి. ఈనెల 11వరకు 10 రోజుల పాటు జరిగే ఈ దర్శనాలు కొనసాగుతాయి.

సామాన్య భక్తులకే ప్రాధాన్యత..

భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో దాదాపు 94 కౌంటర్లను ఏర్పాటుచేసి టికెట్లు జారీచేస్తున్నాం. భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించడం కోసమే ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాం. టికెట్ కలిగిన భక్తులు నిర్దేశిత సమయం ప్రకారం తిరుమలలోని కృష్ణతేజ విశ్రాంతి గృహం వద్ద రిపోర్ట్ చేసుకోవాలి. రెండు లక్షలకు పైగా రూ.300ల ప్రత్యేక దర్శన టికెట్లను విడుదల చేశాం. మహాలఘు దర్శనం కోసం రోజూ 2,000 శ్రీవాణి టికెట్లను కూడా మంజూరు చేశాం. ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సిఫారసు లేఖలు రద్దుచేశాం. తర్వాత పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటాం. రెండు మూడు తేదీల్లో కూడా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న ప్రముఖులకు మాత్రమే దర్శనం కేటాయిస్తాం.

మాస్క్ తప్పనిసరి

కోవిడ్ మళ్లీ వ్యాప్తిచెందుతుందన్న భయాందోళన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలి. తిరుమలలో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సప్తగిరులను దాదా 12టన్నుల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించాం. ఆలయం వెలుపల వైకుంఠ ద్వారాలతో శ్రీవారి నమూనా ఆలయాన్ని కూడా ఏర్పాటుచేశాం.

ఇక తిరుమలలో వసతి గృహాలు పరిమితంగా ఉన్న కారణంగా భక్తులు కూడా తిరుపతిలో ఉండి దర్శనానికి కేటాయించిన సమయం ప్రకారమే తిరుమలకి రావాలి. మూడు లక్షల 50 వేల లడ్డూల బఫర్ స్టాక్ ఉంచాం. అలాగే, రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు చెందిన పేదలు, గిరిజనులకు రోజూ వెయ్యి మందికి దర్శనం చేయిస్తాం.

నిరంతరం అన్నప్రసాదం

ఇక భక్తుల సౌకర్యార్థం అన్నదాన భవనంలో 10 రోజులు పాటు ఉ.6 నుంచి రాత్రి 12 గంటల వరకు భక్తులకు నిరంతరం అన్నప్రసాద వితరణ చేస్తాం. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లలో ఇతర ప్రాంతాల్లో వేచి ఉన్న భక్తులకు కూడా టీ, కాఫీ, అన్న ప్రసాదాలను పంపిణీ చేస్తాం. ఏకాదశి సందర్భంగా రేపటి నుంచి పీఏసీ–4లో అన్నప్రసాద వితరణ ప్రారంభిస్తాం. ఇక వైకుంఠ ఏకాదశి రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా రెండువేల మందితో భద్రత కల్పిస్తున్నాం. శ్రీవారి సేవకులు 3,500 మంది కూడా సేవలందిస్తారు.

తిరుమలలో తొలిరోజు 2 లక్షల టోకెన్లు జారీ

ఉత్తర ద్వార దర్శనానికి..

- తొమ్మిది కేంద్రాల్లో భక్తులకు టోకెన్లు అందజేస్తున్న టీటీడీ
- 10రోజుల కోటా పూర్తయ్యే వరకూ ప్రక్రియ కొనసాగింపు


తిరుపతి ఇందిరా మైదానంలోని దర్శన టికెట్ కేంద్రాల వద్ద భక్తులు

తిరుపతి అలిపిరి/తిరుమల: తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా 2వ తేదీ నుంచి తిరుమలలో ఉత్తర ద్వార దర్శనం ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ముందస్తుగా ఆదివారం ఉ.3 గంటల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం టోకెన్లు జారీచేస్తోంది. అందుకు తిరుపతిలో తొమ్మిది కేంద్రాలను ఏర్పాటుచేసింది. తిరుపతి నగరంలోని భూదేవి కాంప్లెక్స్, ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, జీవకోన జెడ్పీ హైస్కూల్, విష్ణు నివాసం, శ్రీనివాసం, బైరాగిపట్టెడలోని రామానాయుడు పాఠశాల (మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్), ఎంఆర్ పల్లి పోలీస్‌స్టేషన్ వెనుక వైపునగల శేషాద్రి నగర్‌లోని జెడ్పీ హైస్కూల్, గోవిందరాజస్వామి సత్రాల వద్ద టోకెన్లు జారీచేస్తున్నారు. 92 కౌంటర్లలో ఈ టోకెన్లు జారీ చేస్తున్నారు. టోకెన్లు తీసుకోవడానికి భక్తులు పెద్దఎత్తున కౌంటర్ల వద్దకు చేరుకుంటున్నారు. తొలిరోజు ఆదివారం రాత్రి 9గంటల వరకు రెండు లక్షల టోకెన్లు ఇచ్చారు. 10రోజుల కోటా పూర్తయ్యే వరకు టోకెన్ల జారీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. టోకెన్లు పొందిన తేదీల్లో మాత్రమే భక్తులు తిరుమలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

శ్రీవారి సేవలో కర్ణాటక హైకోర్టు సీజే

తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లుచేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా టీటీడీ అధికారులు శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, శ్రీవారి చిత్రపటంతో సత్కరించారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలే, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవీంద్రబాబు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్, న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిలహరి, తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుగాలేంది, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సినీనటుడు రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

ఇక తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 15 నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,460 మంది స్వామివారిని దర్శించుకోగా 29,182 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. అదే విధంగా స్వామివారికి కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.4.03 కోట్లు సమర్పించారు. దర్శన టోకెన్లు లేని భక్తులకు 18 గంటల సమయం పడుతోంది. అదేవిధంగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

హరిరామజోగయ్య ఆస్పత్రికి తరలింపు

- అంతకుముందు హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

పాలకొల్లు సెంట్రల్: మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సంఘ నాయకుడు చేగొండి హరిరామజోగయ్య కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఆదివారం పోలీసులు జోగయ్యతో మాట్లాడుతూ.. వయస్సు రీత్యా ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని, దయచేసి తమ మాట వినాలని సుమారు రెండు గంటలకు పైగా జోగయ్యకు నచ్చజెప్పారు. అయినా ఆయన మాట వినకపోవడంతో పోలీసులు జోగయ్యను హౌస్ అరెస్టు చేశారు. దీక్ష ప్రారంభించకుండానే తనను హౌస్ అరెస్టు చేయడంతో జోగయ్య ఇప్పటి నుంచే దీక్షను ప్రారంభిస్తున్నానని ప్రకటించారు. దీంతో పోలీసులు వెంటనే ఆయన్ను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ముందు పట్టణంలోని న్యూలైఫ్ ఆసుపత్రి అని చెప్పడంతో మీడియా ప్రతినిధులు అందరూ అటువైపు వెళ్లారు. ఈలోగా మార్టేరు రూటులో ఏలూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

ఇద్దరి ప్రాణాలు తీసిన న్యూ ఇయర్ వేడుకలు

- సరదాగా గాల్లోకి కాల్పులు..తూటా తగిలి యువకుడి మృతి
- ఆ వార్త విని గుండెపోటుతో కుప్పకూలిన కాల్పులు జరిపిన వ్యక్తి
- కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నగరంలోన ఘటన

శివమొగ్గ: కర్ణాటకలో న్యూ ఇయర్ వేడుకలు ఇద్దరి ప్రాణాలు తీశాయి. ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపాయి. పోలీసుల కథనం ప్రకారం... కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నగరంలోని విద్యానగర్ 4వ క్రాస్‌లో శనివారం అర్ధరాత్రి నూతన సంవత్సర సంబరాలు కోలాహలంగా జరిగాయి. మంజునాథ్ ఒలెకార్ (45) అనే వ్యాపారవేత్త ఈ వేడుకను నిర్వహించాడు. సరిగ్గా శనివారం అర్ధరాత్రి 12 గంటలకు అందరూ చిందులేస్తూ ఉండగా, మంజునాథ్ సంతోషంతో తన లైసెన్స్‌డ్ రివాల్వర్ తీసి గాల్లోకి కాల్పులు జరిపాడు. ఇందులో ఒక తూటా వినయ్ (28) అనే యువకుని ఛాతిలోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన అతడిని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మరణించాడు. ఈ వార్త విని మంజునాథ్ భయంతో వణికిపోయి గుండెపోటుతో కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

బాలుడి ఉసురు పోసుకున్న మెంతోప్లస్ మూత


గొంతులో మెంతోప్లస్ మూత ఇరుక్కుని చనిపోయిన బాలుడు ప్రదీప్‌పాల్

సి.బెళగల్: మెంతోప్లస్ మూత గొంతులో ఇరుక్కుని తొమ్మిది నెలల బాలుడు మృతి చెందిన ఘటన కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం చింతమానుపల్లెలో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసముండే నల్లన్న, సువర్ణ దంపతులకు పెళ్లైన 24 సంవత్సరాల తర్వాత కుమారుడు ప్రదీప్‌పాల్ (9 నెలలు) జన్మించాడు. ఆదివారం ఇంట్లో ఆడుకుంటూ ఉన్నట్టుండి కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు బాలుడిని పరిశీలించి మెంతోప్లస్ తైలం డబ్బా మూత మింగినట్లు గుర్తించి తీసేందుకు ప్రయత్నించారు. వీలుకాకపోవడంతో సి.బెళగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గమనించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

'స్వధర్మ వాహిని' ద్వారా వీణావాయిద్యంలో ఉచిత శిక్షణ

- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర వెల్లడి


వీణాపంచకం కార్యక్రమాన్ని తిలకిస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

సింహాచలం: వీణా వాయిద్య కళను ప్రోత్సహించడానికి విశాఖలో పలుచోట్ల స్వధర్మ వాహిని సంస్థ ద్వారా సామూహికంగా ఉచిత శిక్షణ అందించాలని నిర్ణయించినట్లు విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర చెప్పారు. పీఠంలో స్వధర్మ వాహిని సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వీణా పంచకం కార్యక్రమం జరిగింది. ప్రముఖ కళాకారులు డాక్టర్ కృష్ణవేణి, శారదా సుబ్రమణియన్ నిర్వహణలో మృదంగ విద్వాంసుడు మెహర్‌సాగర్ తదితర కళాకారులు వీణావాయిద్యంతో అలరించారు. సరస్వతీదేవికి నాద నివేదనను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్వరూపానందేంద్ర, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర ప్రారంభించారు. స్వరూపానందేంద్ర మాట్లాడుతూ..వీణా వాయిద్యం ప్రాచీన కళ అని, సంగీతంలో ఉన్న మాధుర్యాన్ని దాని ద్వారా తెలుసుకోవచ్చని, కానీ ప్రస్తుతం ఆ కళ కనుమరుగవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలో స్వధర్మ వాహిని వీణా పంచకం కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. స్వధర్మ వాహిని కమిటీ ప్రతినిధులు లీలారాణి, జాస్తి బాలాజీ, సురేష్‌బాబు, విక్రమ్ ఆదిత్యవర్మ, కేవీఎస్‌పి వర్మ, సత్యేంద్ర, గ్రంధి రాజేష్, వెంకటేశ్వర బెనర్జీలను అభినందించారు.

పీవీ చలపతిరావు కన్నుమూత

- అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- రెండుసార్లు ఎమ్మెల్సీగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు
- నేడు విశాఖలో అంత్యక్రియలు


చలపతిరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సోము వీర్రాజు

సాక్షి, విశాఖపట్నం: బీజేపీ సీనియర్ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీ చలపతిరావు (87) కన్నుమూశారు. విశాఖ నగరంలోని పీఠాపురం కాలనీలో ఉంటున్న ఆయన కొంతకాలంగా వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురవడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య రాధమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు పి.వి.ఎన్.మాధవ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. 1935 జూన్ 26న జన్మించిన చలపతిరావు పదేళ్ల వయసులోనే ఆర్ఎస్ఎస్‌లో చేరి చురుకైన పాత్ర పోషించారు. 1956 నుంచి 1966 వరకు పారిశ్రామిక విస్తరణ అధికారిగా ఉన్న ఆయన ఎన్నికల్లో పోటీచేసేందుకు ఉద్యోగానికి రాజీనామా చేశారు. 1967 నుంచి విశాఖ ఉక్కు ఉద్యమంలో పాల్గొన్నారు. 1973లో ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహించి పలుమార్లు అరెస్టయ్యారు. ఎమర్జెన్సీ కాలంలో లోక సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆయన 19 నెలలు అజ్ఞాతంలో గడిపారు. ట్రేడ్ యూనియన్ల నేతగాను పనిచేసి కార్మికులు, పారిశ్రామిక సంబంధాలను సమన్వయం చేసినందుకు ప్రభుత్వం నుంచి శ్రమశక్తి అవార్డు పొందారు. 1980 నుంచి 1986 వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆయన ఉత్తర సర్కారు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి 1974లోను, 1980లోను శాసనమండలికి ఎన్నికయ్యారు. చలపతిరావు పార్థివదేహాన్ని ఆయన స్వగృహంలో ఉంచారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. చలపతిరావు మృతికి హరియాణ గవర్నర్ బి.దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీ జి.వి.ఎల్.నరసింహారావు సంతాపం ప్రకటించారు.

ప్రాణదాతలు.. 108 ఉద్యోగులు

- సముద్రంలో నీట మునిగిన వ్యక్తికి 108లో చికిత్స
- సకాలంలో స్పందించడంతో తప్పిన ప్రాణాపాయం
- వాడపాలెం బీచ్‌లో ఘటన


స్థానికుల సాయంతో స్ట్రెచర్‌పై లక్ష్మణను మోసుకొస్తున్న 108 సిబ్బంది

రాంబిల్లి: సముద్ర కెరటాల ధాటికి నీటిలో మునిగి ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓ వ్యక్తిని 108 అంబులెన్స్ సిబ్బంది రక్షించారు. వారు సకాలంలో స్పందించి ఆక్సిజన్ అందించడంతో బాధితుడి ప్రాణం నిలిచింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి శివారు వాడపాలెం బీచ్‌లో ఆదివారం ఉదయం ఈ ఘటన జరిగింది. యలమంచిలికి చెందిన సీహెచ్ లక్ష్మణ (35), అతని నలుగురు స్నేహితులు శనివారం రాత్రి వాడపాలెం వచ్చారు. అక్కడ రాత్రంతా పార్టీ చేసుకున్నారు. ఉదయం బీచ్‌లో స్నానానికి దిగారు. కెరటాల ధాటికి లక్ష్మణ కొట్టుకుపోతుండగా, పక్కనే ఉన్న స్నేహితులు అతికష్టం మీద ఒడ్డుకు చేర్చారు. అప్పటికే లక్ష్మణ స్పృహ కోల్పోగా... స్నేహితులు 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనం టెక్నీషియన్ యడ్ల అప్పలనాయుడు, పైలట్ ఎస్.చంద్రశేఖర్‌రాజు హుటాహుటిన బీచ్‌కు చేరుకున్నారు. బీచ్‌కు సుమారు కిలో మీటరు దూరంలో ఇసుక మాత్రమే ఉండటంతో వాహనం వెళ్లేందుకు సాధ్యం కాలేదు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న లక్ష్మణను స్ట్రెచర్‌పై ఉంచి స్థానికుల సాయంతో 108 సిబ్బంది అంబులెన్స్ వద్దకు మోసుకొచ్చారు. వెంటనే అతనికి 108లో ఆక్సిజన్ పెట్టారు. సెలైన్ పెట్టి ఎక్కించి మందులు ఇచ్చారు. తర్వాత యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ కోలుకోవడంతో సాయంత్రం డిశ్చార్జ్ చేశారు. సకాలంలో స్పందించి కిలోమీటరు మేర స్ట్రెచర్‌పై లక్ష్మణను మోసి ఆక్సిజన్, వైద్య సేవలందించి ప్రాణం కాపాడిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.

గ్రామ వలంటీర్‌పై టీడీపీ నేతల హత్యాయత్నం

- కత్తితో దాడి చేయడంతో వలంటీర్‌కు తీవ్రగాయాలు
- తిరుపతి జిల్లా ఇనగలూరులో ఘటన


ఆసుపత్రిలో గ్రామ వలంటీర్

శ్రీకాళహస్తి రూరల్(తిరుపతి జిల్లా): గ్రామ వలంటీర్‌పై టీడీపీ నాయకులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో వలంటీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాత్రి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరులో జరిగింది. వివరాలు.. ఇనగలూరుకు చెందిన అంతటి రామరాఘవేంద్ర గ్రామ వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. అతను చురుగ్గా వ్యవహరిస్తూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకందిస్తుండటం స్థానిక టీడీపీ నాయకులకు నచ్చేది కాదు. 'ఎందుకు అంతా నీదే అన్నట్లు చేస్తున్నావ్.. జాగ్రత్త' అంటూ పలుమార్లు అతన్ని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు చెలికం మోహన్‌రెడ్డి, జడపల్లి రాఘవ, నడవాలి చిరంజీవి శనివారం రాత్రి వలంటీర్ ఇంటి ముందుకు వచ్చి టపాసులు కాల్చారు. నిప్పు రవ్వలు ఎగిరి వలంటీర్ రాఘవేంద్ర పిల్లల మీద పడ్డాయి. దీంతో కొంచెం దూరం వెళ్లి టపాసులు కాల్చుకోవాలని వలంటీర్ చెప్పడంతో.. టీడీపీ నాయకులు ముగ్గురూ కలిసి విచక్షణారహితంగా దాడి చేశారు. రాఘవేంద్ర భయపడిపోయి పరిగెత్తగా.. వెంటపడి కత్తితో దాడి చేశారు. ఇంతలో స్థానికులు అక్కడికి రావడంతో.. టీడీపీ నాయకులు ముగ్గురూ పారిపోయారు. తీవ్రంగా గాయపడిన వలంటీర్‌ను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు.

ఆఫీసు అద్దె కట్టని ట్విట్టర్

కోర్టుకెక్కిన భవన యజమాని

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చేతికి వెళ్లినప్పటి నుంచీ ట్విట్టర్‌ను వరుస బెట్టి కష్టాలు చుట్టుముడుతున్నాయి. తాజాగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న కార్యాలయానికి 1,36,250 డాలర్ల అద్దె చెల్లించడంలో విఫలమవడంతో పరిస్థితి విషయం కోర్టు కేసు దాకా వెళ్లింది! హార్ట్‌ఫోర్డ్ బిల్డింగ్‌లో 30వ అంతస్తులో ఉన్న కార్యాలయానికి బకాయి ఉన్న అద్దెను ఐదు రోజుల్లోగా చెల్లించాలంటూ గత డిసెంబర్ 16న యాజమాన్య సంస్థ కొలంబియా రీట్ తాఖీదులిచ్చింది. గడువులోగా చెల్లించకపోవడంతో గురువారం ట్విట్టర్‌పై కోర్టులో ఫిర్యాదు దాఖలు చేసింది! ప్రధాన కార్యాలయంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏ కార్యాలయానికి ట్విట్టర్ కొద్ది కాలంగా అద్దె చెల్లించడం లేదంటూ న్యూయార్క్ టైమ్స్ డిసెంబర్ 13వ తేదీనే కథనం ప్రచురించింది. రెండు చార్టర్ విమానాల అద్దె చెల్లించేందుకు తిరస్కరించినందుకు డిసెంబర్లో కూడా ట్విట్టర్‌పై కేసు నమోదైంది.

క్లుప్తంగా...

కాబూల్ విమానాశ్రయంలో బాంబు పేలుడు

కాబూల్: అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో మిలటరీ విమానాశ్రయంలో ఆదివారం ఉదయం బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కొందరు మరణించారని, పలువురికి గాయాలయ్యాయని తాలిబన్ అధికారులు వెల్లడించారు. కానీ కచ్చితంగా ప్రాణనష్టం ఎంత జరిగిందో చెప్పలేదు. ఈ బాంబు దాడికి ఇప్పటివరకు ఎవరూ బాధ్యతను ప్రకటించలేదు. అయితే ఖొరాసన్ ప్రావిన్స్‌లో ఇస్లామిక్ స్టేట్ పని అయి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళలపై అరాచకాలు : 31 వేల ఫిర్యాదులు

న్యూఢిల్లీ: మహిళలపై జరిగిన నేరాలు ఘోరాలకు సంబంధించి 2022లో దాదాపుగా 31 వేల ఫిర్యాదులు అందాయని జాతీయ మహిళా కమిషన్ వెల్లడించింది. 2014 తర్వాత ఇవే అత్యధికమని తెలిపింది. 2021లో 30,864 ఫిర్యాదులు అందితే , తర్వాత ఏడాదికి స్వల్పంగా పెరిగి 30,957 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల్లో ఎక్కువగా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినవే ఉన్నాయని, 9,710 వరకు ఆ ఫిర్యాదులేనని గణాంకాలు వెల్లడించాయి. ఆ తర్వాత గృహ హింసకు సంబంధించి 6,970 కేసులు, వరకట్నం వేధింపులు 4,600 ఫిర్యాదులు అందాయి.

పాక్, భారత్ మధ్య అణు సమాచార మార్పిడి

ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్ మధ్య భవిష్యత్‌లో ఉద్రిక్తతలు పెరిగిపోతే దాడులు చేయకూడదని అణు కేంద్రాలు, స్థావరాలపై సమాచారాన్ని ఇరు దేశాలు ఇచ్చిపుచ్చుకున్నాయి. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించినప్పటికీ మూడు దశాబ్దాలుగా ప్రతీ ఏడాది జరిగే అణు సమాచారాన్ని ఇరుదేశాలు ఒకరికొకకు అందించుకున్నట్టుగా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 1991లో ఇరు దేశాల మధ్య అమల్లోకి వచ్చిన అణు కేంద్రాలు, స్థావరాలపై దాడులు నిషిద్ధమనే ఒప్పందం మేరకు ఈ స్థావరాల వివరాలు అందించుకున్నారు.

కశ్మీర్‌లో ఉగ్ర ఘాతుకం.. ముగ్గురు పౌరులు మృతి

రాజౌరి: జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు జిల్లా రాజౌరిలో ఆదివారం సాయంత్రం మైనారిటీ వర్గం లక్ష్యంగా ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా 10 మంది గాయపడ్డారు. రాజౌరికి 8 కిలోమీటర్ల దూరంలోని అప్పర్ డాంగ్రి గ్రామంలోని మూడు ఇళ్లలోకి చొరబడిన ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. క్షతగాత్రులైన 10 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. తప్పించుకుపోయిన ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టినట్లు అదనపు డీజీపీ ముకేశ్ సింగ్ చెప్పారు.

పెరిగిన పాక్ డ్రోన్ల ముప్పు

చండీగఢ్: పాకిస్తాన్ నుంచి డ్రోన్లు సరిహద్దును దాటి భారత్‌లోని పంజాబ్‌లోకి ప్రవేశిస్తున్నాయి. ఇలా వచ్చిన డ్రోన్ల సంఖ్య కేవలం ఏడాదిలోనే నాలుగు రెట్లు పెరగడం గమనార్హం . 2021లో 67 డ్రోన్లు, 2022లో 254 డ్రోన్లు పాక్ భూభాగం నుంచి పంజాబ్‌లోకి వచ్చినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022లో 254 డ్రోన్లు రాగా, వీటిలో 9 డ్రోన్లను బీఎస్‌ఎఫ్ సిబ్బంది కూల్చివేశారు. 13 డ్రోన్లు వివిధ కారణాలతో నేలకూలాయి. పాక్ ముష్కరులు మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రితో కూడిన డ్రోన్లను భారత్‌లోకి చేరవేస్తున్నట్లు సైనికాధికారులు చెబుతున్నారు. 2022లో గుజరాత్, రాజస్తాన్, పంజాబ్, జమ్మూకశ్మీర్‌లో ఉన్న తూర్పు సరిహద్దులో 311 డ్రోన్లను గుర్తించారు. 2020లో 77, 2021లో 104 డ్రోన్లు పట్టుబడ్డాయి. సరిహద్దుల్లో జామింగ్ టెక్నాలజీ లేదా రైఫిల్ ఫైరింగ్ ద్వారా డ్రోన్లను కూల్చివేస్తున్నట్లు బీఎస్‌ఎఫ్ అధికారి ఒకరు వెల్లడించారు. కూల్చివేతలో పాల్గొన్న బృందానికి రూ.లక్ష నగదు బహుమతి అందజేస్తున్నామని తెలిపారు.

'రాహుల్ ప్రభ కొనసాగితే రాజకీయ మార్పు తథ్యం'

ముంబై: కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ ఒక నాయకుడిగా గత ఏడాది బలోపేతం అయ్యారని, ఆయన ప్రాభవం పెరిగిందని ఉద్ధవ్ ఠాక్రే వర్గం శివసేన నేత సంజయ్ రౌత్ చెప్పారు. ఈ ఏడాది కూడా ఇదే ట్రెండ్ కొనసాగితే 2024లో సాధారణ ఎన్నికల్లో రాజకీయంగా భారీ మార్పు ఖాయమని శివసేన పత్రిక 'సామ్నా'లో రాసిన వ్యాసంలో స్పష్టం చేశారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...!



ఎప్పుడో 50 వేల ఏళ్ల క్రితం కన్పించిన ఓ తోకచుక్క త్వరలో మళ్లీ మనల్ని పలకరించనుంది. ఫిబ్రవరి 1న భూమికి అత్యంత సమీపంగా, అంటే 2.6 కోట్ల మైళ్ల దూరం నుంచి వెళ్లనుంది. జనవరి 26 నుంచి వారం పాటు మామూలు కంటికి కూడా కన్పిస్తుందని నాసా చెబుతోంది. అది ప్రస్తుతం మనకు 11.7 కోట్ల మైళ్ల దూరంలో ఉంది. సి2022 ఈ3గా పిలుస్తున్న ఈ తోకచుక్కను నాసా సైంటిస్టులు కెమెరాలో బంధించారు. అన్నట్టూ, భూమి మాదిరిగానే ఇది కూడా సూర్యుని చుట్టూ తిరుగుతుందట. 50 వేల ఏళ్లకు ఒక పరిభ్రమణం పూర్తి చేస్తుందట! 2020 జూలైలోనూ ఇలాగే ఒక తోకచుక్క మనకు కన్పించేంత సమీపంగా వచ్చింది.

నయా సాల్ జోష్.. 3.50 లక్షల బిర్యానీలు

2.5 లక్షలకు పైగా పిజ్జా ఆర్డర్లు

దేశవ్యాప్తంగా ఒక్కరోజులో డెలివరీ చేసిన స్విగ్గీ

హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకలను జనం బిర్యానీ, పిజ్జాలతో ఘనంగా జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా శనివారం ఒక్కరోజే 3.50 లక్షల బిర్యానీ, 2.5 లక్షలకు పైగా పిజ్జా ఆర్డర్లను కస్టమర్లకు చేరవేసినట్లు చేసినట్లు ఫుడ్ డెలివరీ యాప్ 'స్విగ్గీ' వెల్లడించింది. ట్విట్టర్‌లో తాము నిర్వహించిన ఓ సర్వేలో 75.4 శాతం మంది హైదరాబాద్ బిర్యానీ, 14.2 శాతం మంది లక్నో బిర్యానీ, 10.4 శాతం మంది కోల్‌కతా బిర్యానీని ఇష్టపడుతున్నట్లు తేలిందని వివరించింది. హైదరాబాద్‌లో బావార్చీ హోటల్ పసందైన బిర్యానీకి పేరొందిన హోటల్. కొత్త సంవత్సరం డిమాండ్‌ను తట్టుకోవడానికి శనివారం ఏకంగా 15 టన్నుల బిర్యానీని సిద్ధం చేసినట్లు బావార్చీ హోటల్ యాజమాన్యం తెలియజేసింది. ఇదిలా ఉండగా, శనివారం రాత్రి 7 గంటల కల్లా 1.76 లక్షల చిప్స్ ప్యాకెట్లను కస్టమర్లు ఆర్డర్ చేశారని స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ పేర్కొంది. అలాగే 2,757 డ్యూరెక్స్ కండోమ్ ప్యాకెట్లను కస్టమర్లకు చేరవేశామని తెలిపింది. కొత్త సంవత్సరం సందర్భంగా దేశవ్యాప్తంగా 12,344 మంది వినియోగదారులు కిచిడీ కోసం స్విగ్గీలో ఆర్డర్ చేయడం మరో విశేషం.



ప్రమాదకరంగా పైపైకి

శరవేగంగా పెరుగుతున్న సముద్ర మట్టాలు

- మధ్యధరా తీరంలో ఇది మరీ ఎక్కువ
- వాతావరణ మార్పులే ప్రధాన కారణం
- పెను హెచ్చరిక సంకేతాలే: నిపుణులు



మధ్యధరా సముద్ర ప్రాంత ద్వీపమైన కోర్సికా వద్ద ఇటీవల విరుచుకుపడ్డ రాకాసి అలలు

వాతావరణ మార్పులు, తద్వారా నానాటికీ పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రపంచాన్ని నానాటికీ ప్రమాదపుటంచులకు నెడుతున్నాయి. వీటి దుష్పరిణామాలను 2022 పొడవునా ప్రపంచమంతా చవిచూసింది. ఆస్ట్రేలియా మొదలుకుని అమెరికా దాకా పలు దేశాల్లో ఒకవైపు కార్చిచ్చులు, మరోవైపు కనీవినీ ఎరగని వరదలు, ఇంకోవైపు తీవ్ర కరువు పరిస్థితులు, భరించలేని వేడి గాలుల వంటివి జనానికి చుక్కలు చూపాయి. ఆర్కిటిక్ బ్లాస్ట్ దెబ్బకు ఇంగ్లండ్‌తో పాటు పలు యూరప్ దేశాలు గత 40 ఏళ్లలో ఎన్నడూ కనీవినీ ఎరగనంతటి చలి, మంచు వణికించాయి. ఆ వెంటనే అమెరికాపై విరుచుకుపడ్డ బాంబ్ సైక్లోన్ 'శతాబ్ది మంచు తుపాను'గా మారి దేశమంతటినీ అతలాకుతలం చేసి వదిలింది. 2023లో కూడా ఇలాంటి కల్లోలాలు, ఉత్పాతాలు తప్పవని పర్యావరణ నిపుణులు ఇప్పటినుంచే హెచ్చరిస్తుండటం మరింత కలవరపెడుతోంది. వీటికి తోడు మరో పెను సమస్య చడీచప్పుడూ లేకుండా ప్రపంచంపైకి వచ్చిపడుతోంది. అదే... సముద్ర మట్టాల్లో అనూహ్య పెరుగుదల! ప్రపంచవ్యాప్తంగా అన్ని తీర ప్రాంతాల్లోనూ ఈ ప్రమాదకర పరిణామం చోటు చేసుకుంటోంది. ముఖ్యంగా మధ్యధరా ప్రాంతంలో సముద్ర మట్టాలు మరీ ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్న వైనాన్ని తాజా అధ్యయనం ఒకటి వెలుగులోకి తెచ్చింది. ఇదిప్పుడు పర్యావరణ వేత్తలందరినీ కలవరపెడుతోంది!

20 ఏళ్లలో 8 సెంటీమీటర్లు!

సముద్ర మట్టాల్లో పెరుగుదల తాలూకు దుష్పరిణామాలు మధ్యధరా తీర ప్రాంతాల్లో కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. ముఖ్యంగా గత రెండు దశాబ్దాల్లో ఇటలీలోని అమ్లాఫీ తీరం వద్ద సముద్ర మట్టం స్పెయిన్‌లోని కోస్టా డెల్‌సోల్‌తో పోలిస్తే రెండింతలు పెరిగినట్టు పరిశోధకులు తేల్చారు. ''మధ్యదరా పరిధిలో కూడా ఇతర ప్రాంతాలతో పోలిస్తే అడ్రియాటిక్, ఎజియన్, లెవంటైన్ సముద్రాల తీర ప్రాంతాల్లో నీటి మట్టం 20 ఏళ్లలో ఏకంగా 8 సెంటీమీటర్లకు పైగా పెరిగింది. పైగా ఈ పెరుగుదల రేటు ఇటీవలి కాలంలో బాగా వేగం పుంజుకుంటుండటం మరింత ప్రమాదకర పరిణామం'' అని వారు వెల్లడించారు! తమ అధ్యయనంలో భాగంగా అలలు, ఆటుపోట్ల గణాంకాలతో పాటు మంచు కరిగే రేటుకు సంబంధించి ఉపగ్రహ ఛాయాచిత్రాలు తదితరాలను లోతుగా విశ్లేషించారు. 1989 తర్వాత నుంచీ మధ్యధరా సముద్ర మట్టం శరవేగంగా పెరుగుతోందని తేల్చారు. పరిశోధన ఫలితాలు అడ్వాన్సింగ్ అర్త్ స్పేస్ సైన్సెస్ జర్నల్ తాజాగా ప్రచురితమయ్యాయి.

అతి సున్నిత ప్రాంతం

నిజానికి మధ్యదరా ప్రాంతం వాతావరణ మార్పులపరంగా ప్రపంచంలోనే అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో ఒకటి. వరదలు, క్రమక్షయం వంటి వాటి దెబ్బకు ఇప్పటికే ఈ ప్రాంతంలోని ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఏకంగా 86 శాతం దాకా లుప్తమయ్యే ముప్పును ఎదుర్కొంటున్నాయి. 2022 మొదట్లో జరిగిన మరో అధ్యయనం కూడా ఇలాంటి ప్రమాదకరణ పరిణామాలనే కళ్లకు కట్టింది. మధ్యదరాతో పాటు ప్రపంచవ్యాప్తంగా కూడా సముద్రమట్టాలు గతంలో భావించిన దానికంటే చాలా వేగంగా పెరుగుతున్నాయన్న చేదు వాస్తవాన్ని వెల్లడించింది. గ్రీన్‌లాండ్ బేసిన్లో పరుచుకున్న అపారమైన మంచు నిల్వలు గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఊహాతీత వేగంతో కరిగిపోతుండటం ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. దానివల్ల అపారమైన పరిమాణంలో నీరు సముద్రాల్లోకి వచ్చి చేరుతోందని వివరించింది. అంతేకాదు, గ్రీన్‌లాండ్ మంచు ఇదే వేగంతో కరగడం కొనసాగితే 2100 కల్లా ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు ప్రస్తుతం ఊహిస్తున్న దానికంటే ఏకంగా ఆరు రెట్లు ఎక్కువగా పెరిగిపోతాయని కూడా హెచ్చరించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పెను ప్రమాదమే...!

సముద్ర మట్టాలు పెరిగితే సంభవించే దుష్పరిణామాలు అన్నీ ఇన్నీ కావు...

- తీర ప్రాంతాలు ముంపుకు గురవుతాయి
- చిన్న చిన్న ద్వీప దేశాలు ఆనవాళ్లు కూడా మిగలకుండా సముద్రంలో కలిసిపోతాయి
- షికాగో మొదలుకుని ముంబై దాకా ప్రపంచవ్యాప్తంగా సముద్ర తీరాల్లో అలరారుతున్న అతి పెద్ద నగరాలు నీట మునుగుతాయి
- వందలాది కోట్ల మంది నిర్వాసితులవుతారు.
- ఇది ప్రపంచవ్యాప్తంగా అతి పెద్ద ఆర్థిక, సామాజిక సమస్యగా పరిణమిస్తుంది
- సముద్రపు తాకిడి నుంచి ప్రధాన భూభాగాలకు రక్షణ కవచంగా ఉండే చిత్తడి నేలలతో కూడిన మడ అడవులు అంతరిస్తాయి
- వాటిలో నివసించే పలు జీవ జాతులు అంతరించిపోయే ప్రమాదముంది
- నేల క్రమక్షయానికి లోనవుతుంది. సాగు భూమి పరిమాణమూ తగ్గుతుంది
- భారీ వర్షాలు, అతి భారీ తుఫాన్ల వంటివి పరిపాటిగా మారతాయి

వెనకబడ్డ తరగతుల జడ్జిలు... హైకోర్టుల్లో 15 శాతమే

పార్లమెంటు సంఘానికి న్యాయ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: దేశంలో గత ఐదేళ్లలో హైకోర్టుల్లో నియమితులైన న్యాయమూర్తుల్లో వెనుకబడిన తరగతులకు చెందినవారు కేవలం 15 శాతం మందే ఉన్నారని డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్ వెల్లడించింది. బీజేపీ సీనియర్ నేత, బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీని నేతృత్వంలోని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి ఈ విషయాన్ని నివేదించింది. జడ్జిలను నియమించే అధికారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని కొలీజియంకు కట్టబెట్టి 3 దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ హైకోర్టుల్లో బీసీ జడ్జిల సంఖ్య పెరగడం లేదని స్పష్టంచేసింది. జడ్జిలుగా ఎవరిని నియమించాలన్నది కొలీజియమే తేలుస్తుందని గుర్తుచేసింది. కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను మాత్రమే ప్రభుత్వం ఆమోదించగలదని వెల్లడించింది. న్యాయస్థానాల్లో సామాజిక వైవిధ్యాన్ని ఇంకా సాధించలేకపోయామని డిపార్టుమెంట్ ఆఫ్ జస్టిస్‌అసంతృప్తి వ్యక్తం చేసింది. న్యాయమూర్తుల నియామకం విషయంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలతోపాటు మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం తరచుగా కొలీజియంను కోరుతూనే ఉందని వివరించింది. 2018 నుంచి 2022 డిసెంబర్ 19 వరకూ హైకోర్టుల్లో 537 మందిని జడ్జిలుగా నియమించగా, వీరిలో 1.3 శాతం మంది ఎస్టీలు, 2.8 శాతం మంది ఎస్సీలు, 11 శాతం మంది ఓబీసీలు, 2.6 శాతం మైనారిటీలు ఉన్నారని తెలియజేసింది.

నోట్ల రద్దుపై నేడు సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: పెద్ద నోట్లను రద్దు చేస్తూ 2016లో కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించనుంది. జస్టిస్ ఎస్ఏ నజీర్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. నోట్ల రద్దుకు దారి తీసిన పరిస్థితులపై సంబంధిత రికార్డులను సమర్పించాలని కేంద్రం, ఆర్‌బీఐలను ఆదేశించి డిసెంబర్ 7న తీర్పును రిజర్వు చేసింది. సోమవారం నాటి సుప్రీంకోర్టు షెడ్యూల్ ప్రకారం నోట్ల రద్దు అంశంపై రెండు వేర్వేరు తీర్పులుంటాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ బీవీ నాగరత్న ఇచ్చే ఈ తీర్పులు ఏకీభవిస్తాయా, భిన్నంగా ఉంటాయా అనేది స్పష్టంగా తెలియలేదు. ధర్మాసనంలో వీరితోపాటు జస్టిస్ ఏఎస్ బొపన్న, జస్టిస్ వి.రామసుబ్రమణియన్ ఉన్నారు.

సెల్ డ్రైవింగ్‌తో దేశవ్యాప్తంగా... ఏడాదిలో 1,040 మంది మృతి

న్యూఢిల్లీ: సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ వాహనాలను నడిపిన కారణంగా జరిగిన ప్రమాదాల్లో 2021లో 1,040 మంది మృతి చెందారు. అదేవిధంగా, రెడ్‌లైట్ పడినా పట్టించుకోకుండా వాహనాలను ముందుకు పోనివ్వడంతో 555 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని, 222 మంది ప్రాణాలు కోల్పోయారు. రోడ్లపై గుంతల కారణంగా 3,625 ప్రమాదాలు జరగ్గా, 1,481 మంది మృత్యువాతపడ్డారు. 2021కి సంబంధించి కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ ఇటీవల వెల్లడించిన నివేదిక ఈ అంశాలను పేర్కొంది. 2021లో దేశవ్యాప్తంగా మొత్తం 4,12,432 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 1,53,972 మంది చనిపోగా, 3,84,448 మంది గాయపడినట్లు ఆ నివేదిక తెలిపింది.





దేవుడా ఏమిటీ పరీక్ష?

పాకిస్తాన్‌లో నిరుద్యోగ సమస్యకు నిదర్శనమీ చిత్రం. 1,667 పోలీసు కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం రాజధాని ఇస్లామాబాద్‌లోని ఓ స్టేడియంలో రాత పరీక్ష జరిగింది. ఏకంగా 32,000 మంది అభ్యర్థులు తరలివచ్చారు. అప్పుల కారణంగా ఖర్చును భరించే పరిస్థితి లేక అధికారులు అందరినీ ఒకేచోటుకి పిలిపించి పరీక్ష నిర్వహించారు. పాకిస్తాన్ యువతలో 31 శాతం మంది నిరుద్యోగులే ఉన్నారు.

స్కూటీని ఢీకొట్టి, 4 కి.మీ. ఈడ్చుకెళ్లి...

మద్యం మత్తులో యువతిని బలిగొన్న ప్రబుద్ధులు.. ఢిల్లీలో దారుణం





న్యూఢిల్లీ: కొత్త సంవత్సరం వేళ ఢిల్లీలో మనసుని కలిచివేసే ఘటన జరిగింది. న్యూ ఇయర్ సంబరాల్లో తప్ప తాగిన కొందరు ఆదివారం తెల్లవారుజామున ఇష్టారాజ్యంగా కారుని నడుపుతూ ఒక స్కూటీని ఢీకొట్టారు. స్కూటీపై వెళుతున్న 20 ఏళ్ల యువతి కారు కింద పడిపోతే, కనీసం ఏం జరిగిందో కూడా చూడకుండా ఆమెను ఏకంగా 4 కి.మీ. ఈడ్చుకెళ్లారు. దీంతో తీవ్రమైన గాయాలతో ఆ యువతి మధ్యలోనే ప్రాణాలు కోల్పోయింది. ఢిల్లీ పోలీసుల కథనం ప్రకారం ఢిల్లీలోని సుల్తాన్‌పురి ప్రాంతంలో కారు కింద ఒక యువతి శరీరాన్ని ఈడ్చుకెళుతున్న దృశ్యాన్ని చూసిన ప్రత్యక్ష సాక్షులు కొందరు తెల్లవారుజామున 3.24 గంటలకి పోలీసు కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించారు. తిరిగి 4.11 గంటలకి కంఝావాల ప్రాంతంలో రోడ్డుపై ఒక మహిళ మృతదేహం పడి ఉందన్న సమాచారం వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం పికెట్స్ దగ్గరుండే పోలీసు కానిస్టేబుల్స్‌ని అప్రమత్తం చేసి కారు రిజిస్టర్డ్ నెంబర్ సాయంతో దానిని గుర్తించారు. అందులో ప్రయాణించిన అయిదుగురు పురుషుల్ని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో క్రెడిట్ కార్డు కలెక్షన్ ఏజెంట్, డ్రైవర్, రేషన్ షాపు యజమాని ఉన్నారు. కారు కింద పడి ప్రాణాలు కోల్పోయిన యువతిని అమన్ విహార్‌లో నివాసం ఉండే అంజలిగా గుర్తించారు. ఆమెకు తల్లి, నలుగురు చెల్లెల్లు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. పిల్లల్లో అంజలి పెద్దది. కొన్నేళ్ల క్రితమే తండ్రి మరణించారు. కారులో ఉన్న అయిదుగురు నిందితులు స్కూటీకి కారు ఢీకొన్న విషయం తెలుసే తప్ప, తమ కారు కిందే ఆ యువతి ఉందన్న విషయం తమకు తెలీదని చెప్పినట్టు ఢిల్లీ పోలీసు అధికారి హరేంద్ర కె. సింగ్ వెల్లడించారు. ఇది అత్యాచారం కేసు అని సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం నిజం కాదని సింగ్ స్పష్టం చేశారు. అలా ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కారులో ప్రయాణిస్తున్న వారంతా డిసెంబర్ 31 రాత్రంతా మద్యం బాగా తాగి కారుని నడిపారని తమకు సమాచారం ఉందని ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మలివాల్ చెప్పారు. ఇంతకంటే దారుణమైన ఘటన మరొకటి ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు.

క్షిపణి ప్రయోగంతో కొత్త ఏడాదిలోకి..



సియోల్: ప్రపంచ దేశాలన్నీ బాణసంచా వెలుగులతో నూతన సంవత్సరంలోకి అడుగుపెడితే ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ మాత్రం క్షిపణి ప్రయోగంతో స్వాగతం పలికారు. శనివారం ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం నిర్వహించింది. అది 400 కిలోమీటర్లు ప్రయాణించి, కొరియా ద్వీపకల్పం–జపాన్ మధ్య సముద్ర జలాల్లో పడిపోయినట్లు తెలుస్తోంది. ఈ ప్రయోగంపై దక్షిణ కొరియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అణ్వస్త్రాలను కలిగి ఉండాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. అగ్రరాజ్యం అమెరికాను కిమ్ శత్రుదేశంగా పరిగణిస్తున్నారు. ఆయుధ శక్తితో అమెరికాకు బుద్ధి చెప్పడమే తమ లక్ష్యమని తరచుగా చెబుతున్నారు. ఉత్తర కొరియా సైన్యం గత ఏడాది 70కి పైగా క్షిపణులను విజయవంతంగా పరీక్షించింది. ఇందులో 3 షార్ట్–రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్లను దక్షిణ కొరియా శనివారం గుర్తించింది. త్వరలో తొలి నిఘా ఉపగ్రహం(శాటిలైట్) ప్రయోగానికి కిమ్ సైన్యం సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం.

కోచ్‌పై లైంగిక వేధింపుల కేసు... హరియాణా మంత్రి రాజీనామా

- క్యాంప్ ఆఫీస్‌కు పిలిచి, సంతృప్తి పరచాలంటూ బలవంతం చేశారు
- పైన చెయ్యేశారు, టీ షర్టు చించేశారు
- ఫిర్యాదులో మహిళా కోచ్ తీవ్ర ఆరోపణలు, ఖండించిన మంత్రి

చండీగఢ్: భారత్ హాకీ జట్టు మాజీ కెప్టెన్, హరియాణా మంత్రి సందీప్ సింగ్ లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర క్రీడలు, ప్రింటింగ్, స్టేషనరీ శాఖల మంత్రి సందీప్ సింగ్ తనను నిర్బంధించి, లైంగికంగా వేధించారంటూ జూనియర్ అథ్లెటిక్స్ మహిళా కోచ్ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ క్రీడల శాఖకు రాజీనామా చేసినట్లు మంత్రి సందీప్ సింగ్ తెలిపారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు సదరు కోచ్ చేసిన ఆరోపణలన్నీ, నిరాధారాలని మంత్రి కొట్టి పారేశారు. వీటిపై నిష్పాక్షికంగా విచారణ జరిపించాలని మంత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంత్రి ఫిర్యాదుపై విచారణకు ఏడీజీపీ మమతా సింగ్ నేతృత్వంలో కమిటీని నియమించినట్లు హరియాణా డీజీపీ పీకే అగర్వాల్ తెలిపారు.

కలవాలనుంది..రమ్మని బలవంతపెట్టారు!

బాధిత కోచ్ ఘటనకు దారి తీసిన పరిస్థితులను గురువారం మీడియాకు వివరించారు. 'తనను జిమ్‌లో చూశానని, ఒకసారి కలవాలనుందని ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మంత్రి నాతో కాంటాక్టులోకి వచ్చారు. పెండింగ్‌లో ఉన్న జాతీయ క్రీడల సర్టిఫికెట్‌ను క్లియర్ చేసేందుకు రెసిడెన్స్ కమ్ క్యాంప్ కార్యాలయానికి రావాలని బలవంతం చేశారు. తనను సంతృప్తి పరిస్తే సంతోష పెడతానన్నారు. అక్కడికి వెళ్లాక నాపై చేయి వేశారు. టీ షర్ట్‌ను చించివేశారు. నేను రోదిస్తూ, కేకలు వేసినా అక్కడి సిబ్బంది చూస్తూ ఉండిపోయారే తప్ప, సాయం చేసేందుకు ముందుకు రాలేదు' అని ఆమె తెలిపారు. క్రీడల శాఖలో తనవంటి బాధిత మహిళా సిబ్బంది ఇంకా ఉన్నారని, భయంతోనే వారంతా బయటకు రావడం లేదని చెప్పారు. బాధితురాలు హోం శాఖ మంత్రి విజ్‌ను కలిశారు. తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు. సందీప్‌పై ఐపీసీ 354, 354ఏ, 354బీ, 342, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు డీజీపీ చెప్పారు.



ముద్దు పేరు ఫ్లికర్ సింగ్..

భారత ఒలింపిక్ హాకీ జట్టు మాజీ కెప్టెన్, ఫ్లికర్ సింగ్‌గా పేరున్న సందీప్ సింగ్(36) కురుక్షేత్రలోని పెహోవా నుంచి బీజేపీ టికెట్‌పై మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2006లో రైలులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు తుపాకీ బుల్లెట్ వెన్నెముకకు తగిలి పక్షవాతానికి గురయ్యారు. రెండున్నరేళ్ల విశ్రాంతి అనంతరం పూర్తి స్థాయిలో కోలుకున్నారు. మరింత నైపుణ్యం సాధించి హాకీ జట్టు విజయాలకు బాటలు వేశారు. ఈయన జీవిత కథ స్ఫూర్తితో సూర్మా పేరుతో సినిమా కూడా వచ్చింది. తన హాకీ స్టిక్‌తో బంతిని గంటకు 145 కిలోమీటర్ల వేగంతో అత్యంత నైపుణ్యంతో గోల్ పోస్ట్ వైపు తీసుకెళ్లే సందీప్ సింగ్‌ను ముద్దుగా ఫ్లికర్ సింగ్ అని పిలిచేవారు.

దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం

డిసెంబర్‌లో 8.3 శాతానికి చేరుకున్న నిరుద్యోగ రేటు



న్యూఢిల్లీ: భారత్‌లో నిరుద్యోగం రోజు రోజుకీ ఎక్కువైపోతోంది. డిసెంబర్‌లో అత్యధికంగా 8.3% శాతానికి నిరుద్యోగం రేటు ఎగబాకింది. గత 16 నెలల్లో అదే అత్యధికమని సెంటర్ ఫర్ మోనటిరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) ఒక నివేదికలో తెలిపింది. పట్టణాల్లో నిరుద్యోగ రేటు 2022 నవంబర్‌లో 8.96 ఉంటే, డిసెంబర్ వచ్చేసరికి 10.09 శాతానికి పెరిగింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం రేటు నవంబర్‌లో 7.55% ఉంటే స్వల్పంగా తగ్గి డిసెంబర్ నాటికి 7.44శాతానికి చేరుకుంది. నిరుద్యోగం రేటు అత్యధికంగా హర్యానాలో 37.4% ఉంది. ఆ తర్వాత స్థానాల్లో రాజస్థాన్ (28.5%), ఢిల్లీ (20.8%) ఉన్నాయి.

కేంద్రానికి అతి పెద్ద సవాల్

పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం అదుపు చెయ్యడం , లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించడం మోదీ సర్కార్ ముందున్న అతి పెద్ద సవాల్‌గా ఉంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన పాదయాత్రలో కూడా అధిక ధరలు, నిరుద్యోగం సమస్యలపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. ఇలాంటి సమయంలో నిరుద్యోగం రేటు మరోసారి పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశమే. అయితే కరోనా భయాలు తొలగిపోయిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల భాగస్వామ్యం బాగా పెరిగిందని, ఇది నిజంగానే మంచి విషయమని సీఎంఐఈ మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్ వ్యాస్ చెప్పారు. గత ఏడాది కాలంలో ఉపాధి కార్మికులు భాగస్వామ్యం రేటు పెరిగి డిసెంబర్‌లో అత్యధికంగా 40.48% నమోదైందని ఆయన వివరించారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 2 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.7433 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2,000 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 2,200 క్యూసెక్కులను వదులుతున్నారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ దంపతులు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. ఈఓ భ్రమరాంబ ప్రసాదాలను అందజేశారు.

నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్ కార్యాలయంలో పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోనూ కార్యక్రమం కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

కోనేరు హంపికి ఘనస్వాగతం



విమానాశ్రయం(గన్నవరం): కజకిస్తాన్ దేశంలోని అల్మాటీలో జరిగిన ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించిన భారత మహిళా చెస్ స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపికి గన్నవరం విమానాశ్రయంలో ఆదివారం ఘనస్వాగతం లభించింది. పోటీల అనంతరం ఆమె న్యూఢిల్లీ మీదుగా ఉదయం ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద హంపి తల్లిదండ్రులు కోనేరు అశోక్, లత, భర్త అన్వేష్, ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కేపీ. రావు, విలువిద్య సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, చెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ. అక్బర్‌పాషా, ఎం. రాజీవ్, రాష్ట్ర జుడో సంఘం సీఈవో నామిశెట్టి వెంకట్, శ్రీనివాస్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

రేషన్ పంపిణీ తనిఖీ




గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కార్డుదారులకు ఈ నెల నుంచి డిసెంబర్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. జిల్లాలో ప్రారంభమైన ఉచిత రేషన్‌ను పంపిణీని ఏఎఫ్‌సీఐ అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. సర్కిల్–2 పరిధిలో పటమట అశోక్ నగర్‌లో రేషన్ డిపో నంబర్ 264కు సంబంధించి ఎండీయూ వ్యాన్ వద్ద పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. మొబైల్ వ్యాన్ ఆపరేటర్ కార్డుదారులకు బియ్యాన్ని ఉచితంగా ఇస్తున్నారా లేదా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ ఏటీఎం ఎంకే సింగ్ మాట్లాడుతూ బియ్యం పంపిణీ పారదర్శకంగా జరుగుతోందని చెప్పారు. బియ్యం నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, సర్కిల్ ఏఎస్‌ఓ ధనుంజయ రెడ్డి, డిపో మేనేజర్ రుప్లా నాయక్, ఆర్‌ఐ కిశోర్ ఇతర సిబ్బంది ఉన్నారు.

5 నుంచి నటరాజస్వామి ఆర్ద్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ శివకామ సుందరీ సమేత నటరాజ స్వామి వారి ఆర్ద్రోత్సవ కల్యాణోత్సవాలు 5వ తేదీ నుంచి మూడు రోజులు జరగనున్నాయి. తొలి రోజున గురువారం ఉదయం ఉత్సవ మూర్తులకు మంగళ స్నానాలు చేయించి నూతన వధూవరులుగా అలంకరిస్తారు. సాయంత్రం అంకురార్పణ, మంటపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, బలిహరణ వంటి వైదిక కార్యక్రమాలు జరుగుతాయి. 6వ తేదీ శుక్రవారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి రాత్రి లింగోద్భవ కాలం వరకు స్వామి వారికి అభిషేకాలు, అర్చన జరుపుతారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి దివ్య లీలా కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు నటరాజ స్వామి వారికి అభిషేకాలు, అన్నాభిషేకం జరుగుతుంది. ఇక 7వ తేదీ ఉదయం 10 గంటలకు పూర్ణాహుతితో ఉత్సవాలు లాంఛనంగా ముగుస్తాయి. సాయంత్రం 4 గంటలకు ఉత్సవ మూర్తులకు నగరోత్సవ సేవ జరుగుతుంది.

రాష్ట్ర వాలీబాల్ జట్టులో విజయవాడ క్రీడాకారులు



విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ అండర్–19 వాలీబాల్ జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో విజయవాడ క్రీడాకారులు ముగ్గురు స్థానం దక్కించుకున్నారు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. అనంతరం జరిగిన రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో విజయవాడ కృష్ణలంకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు వి.తనుశ్రీ, బి.మేఘన, జి.గుణప్రియ అద్భుత క్రీడా నైపుణ్యంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ పి.రవి కుమార్, అండర్–19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి.రవికాంత అభినందించారు.

విజయవాడ బెంజ్‌సర్కిల్ వద్ద సెయింట్ పాల్స్ కథీడ్రల్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు(ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న ఫాదర్





దుర్గగుడి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు(ఇన్‌సెట్) ముఖమండపం వద్ద భక్తుల వేడుకోలు





కొత్త వత్సరం.. భక్తి భావం

జిల్లాలోని ఆలయాలకు కొత్త సంవత్సర కళ వచ్చింది. సంవత్సరం తొలిరోజు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాదిలో తొలిరోజు దైవ సన్నిధిలో గడిపితే సంవత్సరమంతా మంచి జరుగుతుందన్న నమ్మకంతో ప్రజలు ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. తమ ఇష్టదైవాన్ని మనసారా పూజించి, మొక్కుబడులు చెల్లించారు. చర్చిల్లో శనివారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనల సందడి నెలకొనగా.. ఆదివారం ఉదయం నుంచి విజయవాడలోని దుర్గగుడి భక్తులతో కిక్కిరిసింది. సాధారణ భక్తులతో పాటు పలువురు ప్రముఖులు కూడా దుర్గమ్మను దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కళ్లెదుట కలల సౌధం

ఎన్టీఆర్ జిల్లాలో చక చకా గృహ నిర్మాణాలు



పెనమలూరు మండలం వణుకూరులోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు



నున్న లే అవుట్‌లో లబ్ధిదారు గృహ ప్రవేశం చేసిన ఇంటి వద్ద జిల్లా అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వెంకట్రావు టాపీ మేస్త్రీ. ముప్పై ఏళ్లుగా అదే పనిచేస్తున్నాడు. ఎన్నో ఇళ్లు నిర్మించాడు. కానీ తనకంటూ సొంతిల్లు లేదు. కూలి డబ్బులు కుటుంబ పోషణ, పిల్లల చదువులకే సరిపోయేవి. ఇక అద్దె ఇళ్లలో పడరాని పాట్లు పడ్డాడు. తరచూ వివిధ కారణాలతో అద్దె ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చేది. దీంతో నగరంలో అనేక ఇళ్లలోకి మారాడు. తనకంటూ ఒక అడ్రస్ అంటూ లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే స్థలం, ఇల్లు మంజూరు అయ్యింది. ఇపుడతను సొంతింటిని నిర్మించుకున్నాడు. తనకంటూ ఓ అడ్రస్ లభించింది. నిజమే పేదల అడ్రస్ మారిపోతోంది. వారికంటూ స్థిరమైన నివాసం ఏర్పడుతోంది. ఇదే కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతోనే సాధ్యమవుతోంది.

ఒక్కొక్కరిదీ ఒక్కో గాథ..

పేద, మధ్య తరగతి వర్గాల వారిది ఒక్కో బాధ. నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో స్థలాలు రేట్లు అధికంగా ఉన్నాయి. నగరాల్లో అద్దెలు అధికంగానే ఉన్నాయి. రెండు సెంట్ల స్థలం కొనాలంటే జీవిత కాలం కష్టపడినా అయ్యే పరిస్థితి లేదు. ఇక ఇంటి నిర్మాణం అంటే అదొక కల. ఆ కల నేడు నెరవేరింది. జగనన్న కాలనీల్లో 'పేదల కలల సౌధాలు' రూపుదిద్దుకున్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే నవరత్న పథకాల్లో భాగంగా పేదలందరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించాలని సంకల్పించారు. అంతే వేగంగా లక్షల మందికి ఇళ్ల పట్టాలు జారీ చేశారు. ఇళ్లు కాదు ఏకంగా ఊళ్లే నిర్మితమవుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో 297 జగనన్న లే అవుట్లు ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 83, 580 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో మొదటి దశలో 6,075 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 19,128 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయి. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో కొందరు పేదలు ఇప్పటికే గృహ ప్రవేశాలు చేశారు.

సొంతింటి కల నెరవేరింది..



ఉప్పలూరు గ్రామంలో 13 ఏళ్లుగా ఉంటున్నాం. గతంలో ఎన్నో సార్లు ఇంటి స్థలం కోసం అర్జీ పెట్టినా ప్రయోజనం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్జీ పెట్టాను. స్థలం మంజూరైంది. జగనన్న లే అవుట్‌లో ఇల్లు కట్టుకుని, గృహ ప్రవేశం కూడా చేశాను. ప్రస్తుతం ఆ ఇంటిలోనే ఉంటున్నా.

– పోసిన శివనాగమల్లేశ్వరి, లబ్ధిదారు, ఉప్పలూరు, కంకిపాడు మండలం

గృహ ప్రవేశం చేశాను..



నాది శ్రీకాకుళం జిల్లా. కొన్నేళ్ల కిందట నగరానికి వలస వచ్చాను. భార్య పిల్లలతో అద్దె ఇళ్లలో ఉంటూ నిర్మాణ రంగ పనులకు వెళ్లేవాడిని. వచ్చే ఆదాయం కుటుంబ పోషణ, పిల్లల చదవులకు సరిపోయేది. స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకునే ఆర్థిక స్తోమత లేదు. జగనన్న కాలనీల రూపంలో నా సొంతింటి కల నెరవేరింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నా భార్య పేర నున్న లే అవుట్ లో స్థలం వచ్చింది. ఇంటి నిర్మాణం కూడా పూర్తి చేసుకుని గృహప్రవేశం చేశాను.

– జిడ అప్పలనాయుడు, లబ్ధదారుడు, విజయవాడ

నన్నెవరూ అద్దె అడగరు



నేను పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలో కుటుంబంతో పదిహేనేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాను. ఇంటికి నెలకు రూ.6,500 అద్దె చెల్లించేవాడిని. వచ్చే సంపాదన అంతా అద్దెకు, కుటుంబ పోషణకే సరిపోయేది. కరోనా సమయంలో అద్దె ఇంట్లో ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ప్రభుత్వం జగనన్న కాలనీలో స్థలం కేటాయించింది. ఇంటి నిర్మాణానికి రూ. 1.80లక్షలు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం పూర్తయింది. గృహప్రవేశం చేశాను. ఇది నా సొంతిల్లు.

– వేకొండ స్వామి, లబ్ధిదారుడు, అజిత్‌సింగ్‌నగర్

ప్రతి ఇంటి పెద్ద కొడుకు జగనన్న



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

- ఉమ్మడి ఆంధ్రాలో చంద్రబాబు ఇచ్చింది 39 లక్షల పింఛన్లు
- రాష్ట్రం విడిపోయాక జగనన్న సంకల్పంతో 64 లక్షల మందికి లబ్ధి
- ఎవరు గొప్పో మీరే ఆలోచించండి
- నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్

పెడన: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని, అందరినీ సమానంగా చూస్తూ ప్రేమను పంచుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆదివారం గూడూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు.

ఇచ్చిన హామీ మేరకు..

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో రూ.75 ఉన్న పింఛన్‌ను రూ.200 చేశారని గుర్తు చేశారు. రాజన్న తనయుడు మన జగనన్న ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పింఛన్ రూ.2వేలు చేస్తానని చెప్పారన్నారు. అధికారంలోకి వస్తే పింఛన్ పెంచుకుంటూ వెళ్తానని హామీనిచ్చారన్నారు. ఆ విధంగానే రూ.2వేలు నుంచి ఇప్పుడు రూ.2,750లకు పెంచుకుంటూ వచ్చారని వివరించారు. అదీ కాకుండా పింఛన్ పొందడానికి అర్హతగా ఉన్న 65 ఏళ్ల వయస్సును కూడా కుదించి 60 సంవత్సరాలు చేసి పింఛన్ అందిస్తున్నారని వివరించారు.

ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి..

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో ఆంధ్ర, తెలంగాణ కలిసి ఉన్నప్పుడు చంద్రబాబు 39లక్షల మందికి పింఛన్లు ఇచ్చారని, ఇప్పుడు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు విడిపోయిన తర్వాత మన రాష్ట్రంలో 64లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నారని, ఏది గొప్పో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. గడపగడపకు వెళ్తున్న సమయంలో పింఛన్ రాలేదన్న వారికి కూడా పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మనకు చంద్రబాబు ఏం చేశారు?

చంద్రబాబు తన పిల్లలు మాత్రమే ఇంగ్లిష్ చదువులు చదువుకుని విదేశాలకు వెళ్లాలనే ఆలోచనతో పరిపాలన చేశారని మంత్రి విమర్శించారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు మన పిల్లల కోసం ఏమీ చేయలేదని అన్నారు. కానీ మన జగనన్న అలా కాదని, తన పిల్లలతో పాటు రాష్ట్రంలోని మనందరి పిల్లలు కూడా ఇంగ్లిష్ మీడియంలో చదువుకొని విదేశాలకు వెళ్లాలనే సంకల్పంతో అడుగులు ముందుకు వేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లను అందజేస్తున్నారని తెలిపారు. ఇంత చేస్తున్నా కొందరు రోడ్లు వెంబడి తిరుగుతూ ఇదేం ఖర్మ అంటూ వస్తున్నారని, వారిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్నరాణి, ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ గరికిపాటి చారుమతి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మల్లికార్జునరావు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

తొలిపొద్దు.. 'కానుక'తో ముద్దు



కృష్ణలంకలో అప్పియమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ దివ్య

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో తొలిరోజు వైఎస్సార్ పెన్షన్ కానుక 82.41 శాతం పంపిణీ జరిగింది. మొత్తం 2,32,871 పెన్షన్లకు గాను 1,91,920 మందికి పెన్షన్ అందజేశారు. నూతన సంవత్సరం, ఆదివారం అయినప్పటికీ వలంటీర్లు అర్ధరాత్రి నుంచే పంపిణీ ప్రారంభించారు. అత్యధికంగా జి .కొండూరులో 92.68 శాతం, విసన్నపేటలో 86.42 శాతం, ఏ. కొండూరు మండలంలో 85.42 శాతం పెన్షన్ పంపిణీ పూర్తయ్యింది.

ఠంచన్‌గా పింఛన్..

ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగుల జీతభత్యాలు ఆలస్యమవుతాయేమో కానీ పింఛన్లు మాత్రం జాప్యం జరగడం లేదని మంత్రి అన్నారు. వేకువ జామునే వలంటీర్లు ఇంటికి వెళ్లి పింఛన్లను ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కొత్తగా 8,622 మందికి పింఛన్లు మంజూరయ్యాయని, వీటిల్లో పెడన నియోజకవర్గంలో 834 మందికి వచ్చాయని వివరించారు.

సాగరతీరంలో భారీ తాబేలు కళేబరం




తీరానికి కొట్టుకువచ్చిన తాబేలు కళేబరం



తాబేలు కళేబరాన్ని పూడ్చిపెడుతున్న పోలీసులు, పర్యాటకులు

కోడూరు(అవనిగడ్డ): అరుదైన ఆలివ్ రిడ్లే జాతి తాబేలు కళేబరం కృష్ణా జిల్లా కోడూరు మండలం, హంసలదీవి సాగరతీరానికి కొట్టుకొచ్చింది. ఆదివారం ఉదయం సాగరతీరానికి వెళ్లిన పర్యాటకులు పాలకాయతిప్ప బీచ్ ప్రాంతంలో భారీ తాబేలు కళేబరాన్ని గుర్తించారు. వెంటనే అటవీ అధికారులకు, పాలకాయ తిప్ప మెరైన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సముద్రంలో వేటకు వెళ్లే పడవకు కింద భాగంలో ఉండే ఫ్యాన్ రెక్కలు తగలడం వల్ల తాబేలుకు బలమైన గాయమై మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పర్యాటకుల సాయంతో తాబేలు కళేబరాన్ని సాగరతీరంలో పూడ్చిపెట్టారు. ఆలివ్ రిడ్లే తాబేళ్ల ఉనికిని కాపాడేందుకు అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో భజన, జాగరణ



పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న తిరుపతమ్మ ఆలయం వద్ద భజన బృందాలతో ప్రత్యేక కార్యక్రమం, జాగరణ నిర్వహించారు. ముందుగా ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు మర్రెబోయిన వెంకటరమణ, అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అందంగా అలంకరించిన అరటి మండపాలపై స్వామివార్లను ఉంచి దీక్షా స్వాములతో భజనా కార్యక్రమం నిర్వహించారు. స్వాములకు దాతలు, ఆలయం వారు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మాధవి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బద్దుల కృష్ణమోహన్, జంగం ప్రసాద్, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిన్న రసాలు సిద్ధం



నున్న (విజయవాడ రూరల్): ఈ ఏడాది మామిడి కాయల సీజన్ ప్రారంభమైంది. నున్న గ్రామానికి చెందిన పామర్తి శ్రీనివాసరావు అనే రైతు మామిడి తోటలో చిన్న రసం మామిడి కాయలు మూడు క్వింటాళ్లు కోశారు. ఈ ఏడాది ప్రారంభదశలో చిన్న రసం మామిడి కాయలను కోయడం ఇదే తొలిసారి. నున్న గ్రామంలో కొండ ప్రాంతానికి సమీపంలో రైతు మామిడితోట ఉండటం వలన విజయవాడ నుంచి వచ్చిన వ్యాపారులు కిలో రూ.130 చొప్పున కొనుగోలు చేసినట్టు రైతు పామర్తి శ్రీనివాసరావు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రారంభం, దశమి కావడంతో కాపు కొచ్చిన కొద్ది కాయలను కోశామన్నారు. ఇదే ఈ ఏడాది తొలి పంటగా పేర్కొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక సంరక్షణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. ఈ సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ సేవలో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు ఢిల్లీరావు, రంజిత్‌బాషా, ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా, డీసీపీ విశాల్‌గున్నీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎంను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

- గాంధీనగర్(విజయవాడసెంట్రల్)









అతి ఆహారంతో.. అనారోగ్యం

మితాహారంతోనే ఆరోగ్య జీవనం

- సమతుల ఆహారంపై దృష్టి సారించాలంటున్న నిపుణులు
- కార్బోహైడ్రేట్స్ అధికంగా తీసుకుంటే మధుమేహం, గుండె జబ్బులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): కడుపు నిండా తిని... కంటి నిండా నిద్రపోతే ఆరోగ్యవంతులుగా జీవించవచ్చనేది ఒకప్పటి మాట. ఇప్పుడు మితాహారమే ఆరోగ్యకరమని వైద్యులు సూచిస్తున్నారు. మనం తీసుకునే ఆహారంలో లభించే క్యాలరీలు అధికంగా ఉండటంతో శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగి మధుమేహం, గుండెజబ్బుల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు.

ప్రజల ఆహారపు అలవాట్లే వ్యాధుల బారిన పడేలా చేస్తున్నాయి. శరీరానికి లభించే క్యాలరీలు...ఖర్చయ్యే క్యాలరీలకు పొంతన ఉండటం లేదు. దీంతో శరీరంలో కొలెస్ట్రాల్ శాతం పెరిగి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడేలా చేస్తుంది. కార్బోహైడ్రేట్స్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం వలన ఊబకాయులుగా మారుతున్నారు. ఆ ఫలితంగా మధుమేహం, గుండెజబ్బులు, మానసిక ఒత్తిళ్లు, ఆయాసం, జీర్ణకోశ వ్యాధులు వంటి అనేక జబ్బుల బారిన పడేలా చేస్తున్నాయి. ముఖ్యంగా మధుమేహం బారిన పడుతున్న వారిలో 50 శాతం మందిలో ఆహారపు అలవాట్లే కారణంగా చెప్పవచ్చు. మధుమేహుల్లో కచ్చితమైన ఆహారం తీసుకునే వారు 30 శాతం మందే ఉంటున్నారు.

అధిక కార్బోహైడ్రేట్స్‌తో ముప్పు.....

ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో లభించే క్యాలరీలు, ఖర్చు ఒకేలా ఉండాలి. తీసుకునే క్యాలరీ ఖర్చుకాకుంటే బరువు పెరుగుతారు. కాబట్టి ఇంటి పనులతో పాటు, నిత్యం 45 నిమిషాలు వ్యాయామం చేయాలి. కానీ ఎంత మంది చేస్తున్నారనేది ప్రశ్నార్థకమే. నూనె అధికంగా వాడటం, పాలిష్ రైస్ ఎక్కువగా తీసుకోవడం కూడా వ్యాధులకు మూలంగా చెప్పవచ్చు. బియ్యం, దుంపకూరలు, మైదా, సేమియా, బొంబాయిరవ్వ, కాంగ్‌ఫ్లేక్స్ వంటి వాటిలో అధిక కార్బోహైడ్రేట్స్‌తో పాటు, షుగర్ లెవల్స్‌ను పెంచే తత్వం అధికంగా ఉంటుంది.

ఆహారంలో పోషకాలు ఉండాలి....

మనం నిత్యం తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్ తక్కువగా , ప్రొటీన్స్, మినరల్స్, ఫైబర్ ఎక్కువగా ఉన్నవి తీసుకుంటే మంచింది. అందులో భాగంగా ప్రతిరోజూ ఒక కోడిగుడ్డు, కందిపప్పు, పెసరపప్పు, అలసందలు, తెలగలు, బొబ్బర్లు తీసుకోవాలి. వంటనూనెలు సైతం మార్చి వాడాలి. ఒక్కరు నెలకు వంట నూనె 500 గ్రాములకు మించకూడదు. ఆకుకూరలు, కూరగాయలు అధికంగా తీసుకోవాలి. జామ, యాపిల్, కివీ, స్ట్రాబెర్రీ, బొప్పాయిలు ఆరోగ్యకరమైన పళ్లు. రోజూ ఒక జామకాయ తింటే విటమిన్ సీ, ఫైబర్ లభిస్తుంది. డ్రైఫ్రూట్స్ బాదం, జీడిపప్పు, పిస్తా, వాల్‌నట్స్ మితంగా తీసుకోవచ్చు. అధికంగా పిండి పదార్థాలు తీసుకోవడం మంచిది కాదు.

వ్యాయామం తప్పనిసరి....

మనం తీసుకునే ఆహారంలో లభించే క్యాలరీలు ఖర్చయ్యేందుకు వ్యాయామం తప్పనిసరి. ఒకప్పుడు మహిళలు ఇంట్లో పనులు చేస్తుండేవారు. ఇప్పుడు అంతా యాంత్రిక జీవనానికి అలవాటు పడటంతో సరైన వ్యాయామం లేక ఊబకాయులుగా మారుతూ మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. శరీరానికి సమతుల్యమైన ఆహారం ఎంతో అవసరం. ముఖ్యంగా మధుమేహులు ఆహార నియమాలు, వ్యాయామం చేస్తే చక్కెర స్థాయిలు అదుపులో ఉంచుకుని ఆరోగ్యంగా జీవించవచ్చు.

మితాహారం ఇలా...

ఆహారం...	ఎంత తీసుకోవాలి..	ఎంత తీసుకుంటున్నాం..	లభించే క్యాలరీలు
బియ్యం (పూటకు)	50 –70 గ్రా..	150–200గ్రా	30 గ్రా..100 కేలరీలు
చికెన్ (వారంలో రెండుసార్లు)	75 గ్రా	150 –200	100గ్రా...195 కేలరీలు
మటన్ (వారంలో రెండుసార్లు)	75 గ్రా	200–250	100గ్రా..230 కేలరీలు
వంటనూనె (నెలకు)	500 గ్రాములు	1250 గ్రా	నూనెను బట్టి ఉంటుంది

ఆరోగ్యకర ఆహారం తీసుకోవాలి



మనం ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటే ఎలాంటి వ్యాధులు దరి చేరవు. మధుమేహాన్ని సరైన ఆహారం తీసుకోవడం ద్వారా 50 శాతం నియంత్రించుకోవచ్చు. అధిక క్యాలరీలు ఉన్న ఆహారం తీసుకోవడం వలన ఊబకాయులుగా మారి మధుమేహం, గుండెజబ్బులు, ఆయాసం, వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. డ్రైఫ్రూట్స్‌తో పాటు, పప్పు దినుసులు ఎక్కువగా తీసుకోవాలి. పిండి పదార్థాలను నియంత్రిస్తే మంచిది. ఆరోగ్య కరమైన డైట్‌ప్లాన్‌ను అలవర్చుకోవాలి.

డాక్టర్ కొడాలి వెంకట ఉమాకాంత్, ఎండీ– జనరల్ మెడిసిన్ విజయవాడ

రైల్వే ట్రాక్‌పై యువకుడి ఆత్మహత్య

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పడమట ప్రభుకుమార్ (28) తన కుటుంబంతో కలిసి నివాసం గ్రామంలో ఉంటున్నాడు. వివాహం కాగా ఒక కుమారుడు ఉన్నాడు. వాటర్‌ప్లాంట్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడి తల్లి పడమట రమాదేవి మాజీ వార్డు సభ్యురాలు. రైవస్ కాలువ వంతెన సమీపంలోని రైల్వేట్రాక్‌పై తెల్లవారుజామున 6 గంటల సమయంలో ఓ వ్యక్తి శరీరం ఒక చోట తల భాగం మరో చోట పడి ఉండటాన్ని గ్రామస్తులు గుర్తించారు. మృతదేహం పరిశీలించగా ప్రభుకుమార్‌దిగా నిర్ధారించారు. వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేత్ర పర్వంగా శాస్త్రీయ నృత్యాలు



విజయవాడ కల్చరల్: జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బందరురోడ్డులోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో ఆదివారం ప్రజాకవులు రచించిన గీతాలకు నాట్యాచార్యుడు సప్పా శివకుమార్, పిళ్ళా ఉమామహేశ్వర పాత్రుడు, యల్లా జోస్యుల అనూరాధ, మాగలూరి త్రినాథాచారి, శైలశ్రీ, మంజూష, బృందాలు ప్రదర్శించిన సంప్రదాయ నృత్య రీతులు ఆకట్టుకున్నాయి. గురజాడ అప్పారావు, దేవేంద్ర, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, నాగభైరవ కోటేశ్వరరావు, కొండేపూడి లక్ష్మీనారాయణ, మల్లి పెన్నార్, వేంపాటి బ్రహ్మయ్య రచించిన గీతాలకు బాల బాలికలు నృత్యాలను అభినయించారు. విద్యావేత్త ఎంసీదాస్ మాట్లాడుతూ జానపదం జీవన వేదమని తెలిపారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ కూచిపూడి నాట్యాన్ని ఎందరో కళాకారులు దేశ విదేశాల్లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఎంబీవీకే ఇన్‌చార్జ్ బీఆర్ తులసిరావు ప్రసంగించారు. జాషువా కళావేదిక కార్యదర్శి గుండు నారాయణ నిర్వహించారు.

బైక్ అదుపుతప్పి హోంగార్డు మృతి

కోనేరుసెంటర్: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో హోంగార్డు మృతి చెందిన ఘటన హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... గూడూరు మండలం పోసినవారి పాలెం గ్రామానికి గంజాల నాంచారయ్య (42) కమ్యూనికేషన్ విభాగంలో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పరాసుపేటలో అద్దెకు ఉంటున్న నాంచారయ్య శనివారం రాత్రి 11 గంటల సమయంలో బైపాస్‌రోడ్డు వైపు నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు బండి అదుపు తప్పటంతో డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో నాంచారయ్య తలకు బలమైన గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నాంచారయ్యను చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే నాంచారయ్య మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాగోలులో వృద్ధుడు మృతి

పాగోలు(చల్లపల్లి): అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని పాగోలు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. మేకా రంగారావు (90) ఆదివారం తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రంగారావు భార్య 2015లో మృతి చెందగా, ఆయన ఇద్దరు పిల్లలు ఒకరు విశాఖ, మరొకరు మచిలీపట్నంలో నివసిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఏడేళ్లగా ఇంట్లో ఒంటరిగా జీవిస్తున్న రంగారావు ఇంట్లో ఉరి వేసుకున్న స్థితిలో మృతి చెందిన ఘటనపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు. గతంలో రంగారావు ఇంట్లో బంగారం చోరీ కూడా జరిగిందని పోలీసులకు తెలిపారు. ఘటనపై సమాచారం సేకరించిన చల్లపల్లి ఎస్‌ఐ డి.సందీప్ అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భక్తులతో పోటెత్తిన ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కొత్త సంవత్సరం తొలిరోజు ఇంద్రకీలాద్రికి రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చి దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. అమ్మవారికి నిర్వహించే ఆర్జిత సేవల్లో పాల్గొనేందుకు ఉభయదాతలు, భక్తులతో పాటు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఉదయం 6 గంటల నుంచే ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. భక్తుల రద్దీతో నేపథ్యంలో కొండపైకి కార్లు, ఇతర వాహనాలను అనుమతించలేదు. రద్దీతో ఘాట్‌రోడ్డుపై పలు మార్లు ట్రాఫిక్ జామ్ కావడంతో టోల్‌గేట్లను మూసివేశారు. భక్తులు తమ ద్విచక్ర వాహనాలను కనకదుర్గనగర్‌లో నిలుపుకుని మహా మండపం మీదుగా కొండపైకి చేరుకున్నారు. కుటుంబ సమేతంగా, కళాశాలలు, హాస్టల్ నుంచి విద్యార్థులు బృందాలుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



దుర్గమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

సర్వదర్శనానికి మూడు గంటలు...

అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో మహా మండపం క్యూలైన్లు, ఘాట్‌రోడ్డు క్యూలైన్లు కిటకిటలాడాయి. దీంతో సర్వ దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. రూ. 100, రూ. 300, రూ. 500 టికెట్లు క్యూలైన్లలోనూ భక్తుల రద్దీ కనిపించింది. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అరగంటసేపు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగింది.

కిటకిటలాడిన వెంకటేశ్వరస్వామి ఆలయం

విజయవాడ కల్చరల్: నూతన సంవత్సరం సందర్భంగా పున్నమ్మతోటలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆదివారం భక్తులతో నిండిపోయింది. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ భక్తులు వందలాదిగా స్వామిని దర్శించుకున్నారు. హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ, ల్యాండ్ అక్విజేషన్ న్యాయమూర్తి టి.వేణుగోపాల్‌తోపాటు నగరానికి చెందిన పలువురు పోలీస్ అధికారులు శ్రీ వారి సేవలో పాల్గొన్నారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు, వివిధ సేవా విభాగం సేవకులు భక్తులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. టీటీడీ ఉపకార్య నిర్వహణ అధికారి వెంకటయ్య, సూపరింటెండెంట్ రామచంద్రరావు పర్యవేక్షించారు. కంచికామకోటి పీఠ పాలిత వెంకటేశ్వర స్వామి దేవాలయం లబ్బీపేటలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆచార్యులు గోదాదేవి రంగనాథులు తిరుప్పావై పఠించారు.



టీటీడీ కల్యాణమండపంలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి క్యూలైన్లో ఉన్న భక్తులు



దుర్గగుడి అంతరాలయంలో భక్తుల రద్దీ

పీక కోసి వృద్ధురాలి హత్య



ఘటనా స్థలంలో వృద్ధురాలు సామ్రాజ్యం మృతదేహం

రామవరప్పాడు : కుటుంబ కలహాల నేపథ్యంలో తన భార్యను కాపురానికి పంపించడం లేదన్న కక్షతో ఆమె అమ్మమ్మ పీక కోసి హత్య చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి రామవరప్పాడు రైల్వే గేటు సమీపంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన మెండె సాయి, భవానీ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరు సుమారు 9 సంవత్సరాల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి కృష్ణ మనోహర్, పండు సంతానం ఉన్నారు. సాయి చికెన్ షాపులో పని చేస్తున్నాడు. నిత్యం మద్యం తాగి భార్య భవానీని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పలుమార్లు గొడవ జరిగింది. సాయి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో భవానీ తన పిల్లలను తీసుకుని తన అమ్మ కట్టా మరియమ్మ వద్దకు వెళ్లిపోయింది. దీంతో సాయి మరింతగా రెచ్చిపోయి తన అత్త ఇంటికెళ్లి గొడవ చేస్తుండేవాడు. భవానీని తనతో పంపించకపోతే చంపేస్తానని తరుచూ బెదిరించేవాడు. దీంతో భయపడిన భవానీ తన ప్రాణాలకు భర్త నుంచి ముప్పు ఉందని రక్షణ కల్పించాలని పటమట పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేసింది. సాయితో కలిసి బతకలేనని విడాకులకు కూడా దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. రానురానూ సాయి గొడవ మరింత పెరగడంతో పటమట పోలీస్‌స్టేషన్ సమీపంలో మరియమ్మ ఇల్లు అద్దెకు తీసుకుని తన కుమార్తె భవానీతో పాటు కలిసి ఉంటుంది. కాగా రామవరప్పాడు రైల్వేగేట్ సమీపంలో నివాసం ఉంటున్న భవానీ అమ్మమ్మ కట్టా సామ్రాజ్యం వద్దకు రెండు రోజుల క్రితం భవానీ, మరియమ్మ వచ్చారు. వీరు గ్రామంలో ఉన్నారన్న విషయం తెలుసుకున్న సాయి శనివారం రాత్రి పూటుగా మద్యం తాగి గొడవకు వెళ్లాడు. తన భర్త సాయి చంపుతాడన్న భయంతో భవానీ ఇంటి నుంచి పారిపోయింది. కొద్ది సేపు గొడవ చేసిన సాయి బయటకు వెళ్లి మద్యం తాగి మరలా వచ్చాడు. తన భార్యను పంపించాలని లేకుంటే అడ్డు వచ్చిన వారిని చంపేస్తానంటూ వీరంగం సృష్టించాడు. భవానీ ఇక్కడ లేదని వచ్చిన తర్వాత పంపుతామని ఎంత చెప్పినా వినకుండా అడ్డు వచ్చిన భవానీ అమ్మమ్మ సామ్రాజ్యంను తన వెంట తెచ్చుకున్న కత్తితో పీక కోసి పరారయ్యాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్యకు పాల్పడిన సాయిను అదుపులోకి తీసుకున్నారు. రక్షణ కల్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లే ఈ విధంగా జరిగిందని బాధితులు ఆరోపించారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హారికకు శుభాకాంక్షల వెల్లువ



ఉద్యోగ సంఘ నాయకుల క్యాలెండర్లను ఆవిష్కరించిన జడ్పీచైర్‌ఫర్సన్ హారిక, రాము దంపతులు

పెడన: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మండలంలోని కూడూరు పంచాయతీ కొత్తూరు గ్రామంలో ఉన్న ఆమె నివాసానికి ఆదివారం ఉదయం వెళ్లిన పలువురు జిల్లా ఉన్నతాధికారులు జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, రాము దంపతులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ సీఈవో జి.శ్రీనివాసరావుతో పాటు సంఘ నాయకులున్నారు. అనంతరం పెడనలోని కార్యాలయంలో డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు ఉప్పాల రాంప్రసాద్‌తో కలిసి హారిక దంపతులు కేక్ కట్ చేశారు. వీరిని జిల్లా, మండల అధికారులు, ఉద్యోగులు, సంఘ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కో ఆపరేటివ్ సంఘ నాయకులు అశోక్, శ్రీనివాసరావుతో పాటు యూనిట్‌ల అధ్యక్షులు శుభాకాంక్షలు తెలిపి క్యాలెండర్లను ఆవిష్కరింపజేశారు.

క్లుప్తంగా

గవర్నర్‌కు ఎమ్మెల్సీ తలశిల రఘురాం శుభాకాంక్షలు



గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గవర్నర్ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ-2023 క్యాలెండర్‌ను ఆదివారం జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అసోసియేషన్ సభ్యులతో కలిసి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో మరింత సంవర్ధవంతంగా సేవలు అందించాలని వారితో కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఆ క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని, జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, ఉపాధ్యక్షుడు పి.శ్రీనయ్య, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు టి.సాంబయ్య, కార్యదర్శి పి.సౌభాగ్యం, కోశాధికారి సీహెచ్ ఫణికుమార్, సంయుక్త కార్యదర్శి ఎన్.సతీష్, సభ్యులు ఆర్.స్వామి, కృష్ణాజిల్లా కార్యదర్శి విజయకుమార్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): అర్హులైన వృద్ధులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ టంఛన్‌గా ఇస్తున్నారని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ పేర్కొన్నారు. ఆదివారం పెంచిన పింఛన్ 2,750ను ఆమె 15 వడివిజన్ 68, 69, 70, 71 సచివాలయం పరిధిలోని వృద్ధులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 వ డివిజన్‌లో కొత్తగా 45 మందికి మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల చెల్లారావు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): నిర్మాణ రంగ నిపుణుల సంఘం నేరెడ్కో విజయవాడ శాఖ 2023 డైరీని ఆదివారం భారతీయ స్టేట్ బ్యాంక్ డీజీఎం కే రంగరాజన్ ఆవిష్కరించారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన డైరీని ఆవిష్కరించి నిర్మాణ రంగ నిపుణులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నేరెడ్కో రాష్ట్రశాఖ కార్యదర్శి ఎం.సీతారామయ్య, సెంట్రల్ సలహాదారులు ముక్తేశ్వరరావు, విజయవాడశాఖ అధ్యక్షుడు అమర్నాథ్, కార్యదర్శి హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కృష్ణలంక(విజయవాడ తూర్పు): కృష్ణానదిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు ప్రకాశం బ్యారేజ్ 70వ పిల్లర్ వద్ద నీటిలో ఒక వ్యక్తి మృతదేహం తేలుతున్నట్లు ఆదివారం సాయంత్రం ఓ ప్రయాణికుడు పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీశారు. మృతుని వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహం వద్ద ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి హామీ అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



పింఛన్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఎన్నికల్లో చెప్పిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ 23వ సచివాలయం పరిధిలోని లూర్దు నగర్‌లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను స్థానిక కార్పొరేటర్ ప్రవల్లికతో కలిసి దేవినేని అవినాష్ ఆదివారం పింఛను సొమ్మును అందజేశారు. పెంచిన పింఛను మొత్తంతో ముద్రించిన పాస్ పుస్తకాలు, గులాబీలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజునే పింఛను సొమ్మును సంవత్సరానికి రూ.250 పెంచుతానని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆ హామీలో భాగంగానే రూ.2500 పింఛను ఈ నెల నుంచి రూ.2,750 చేశారని చెప్పారు. పెంచిన సొమ్మును అవ్వతాతలకు అందించిన అనంతరం వారి కళ్లల్లో ఆనందంగా చూస్తుంటే తమకు చాలా సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలా తక్కువ సొమ్మును అది కూడా అరకొరగా ఇచ్చే వారని, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగితే కాని ఈ పింఛను సొమ్ము చేతికి వచ్చేదని చెప్పారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత వార్డు వలంటీర్లు ఒకటో తారీఖు తెల్లవారుజామునే ఇంటికి వచ్చి పింఛను సొమ్ము ఇస్తున్నారని అవినాష్ చెప్పారు. అర్హతే ప్రామాణికంగా పింఛన్లను ఇంటికి తీసుకొచ్చి అందిస్తుంటే పింఛన్లను తొలగిస్తున్నారంటూ టీడీపీ అబద్ధపు ప్రచారాలు చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు డేవిడ్ రాజు, కోటి నాగులు, భీమిశెట్టి నాని, కిస్సీ, జాకోబ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నూతన ఆంగ్ల సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆకాంక్షించారు. గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూరగాయలను పంపిణీ చేశారు.



కూరగాయలను పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్

దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఉత్తర్వులు మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్-1 విజయవాడ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. వన్‌టౌన్ కొత్తపేట కేంద్రంలో-6 (బీసీ-డీ/48వ డివిజన్), కెఎల్‌రావునగర్-1(ఎస్సీ/47వ డివిజన్), వాంబే కాలనీలో-2 (బీసీ-డీ/60వ డివిజన్), వాంబే కాలనీ-16(ఓసీ/60వ డివిజన్), వాంబే కాలనీ-24(ఓసీ/61వ డివిజన్), కండ్రిక-7(బీసీ-డీ/64వ డివిజన్), మిల్క్ ప్రాజెక్ట్-3(ఓసీ/46వ డివిజన్) అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు ఆ ప్రాంతానికి చెందిన వివాహితురాలైన అభ్యర్థినుల మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుపై ఏ ఏరియా అంగన్‌వాడీ కేంద్రానికి దరఖాస్తు చేస్తున్నారో స్పష్టంగా రాయాలని సూచించారు.

అర్హతలు ఇలా..

సహాయకురాలి పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణురాలై, స్థానిక వివాహిత మహిళా అభ్యర్థినులు 1-07-2022 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థినులు కుల ధ్రువీకరణ పత్రాలు జతపరచాలి. నివాస ధ్రువ పత్రం, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ జతపరచాలి. దరఖాస్తు ఫారాలు కార్యాలయంలో మాత్రమే ఇస్తారు. ఆయా పోస్టులకు విద్యార్హత, తగిన కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డ్స్ జిరాక్స్ కాపీలతోపాటు ప్రస్తుత పాస్‌పోర్ట్ సైజు ఫొటో (గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్ట్ చేయించి) జతపరిచి, ఈ నెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు (పూర్తి పనిదినాలలో) ఉమాశంకర్‌నగర్, 1వ లైన్, ఎస్ఎన్ఆర్ అకాడమీ, కానూరు, గ్రౌండ్‌ఫ్లోర్‌లోగల సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్-1 విజయవాడ కార్యాలయంలో దరఖాస్తులను వ్యక్తిగతంగా అందచేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94408 14595లో సంప్రదించాలని కోరారు.

5న సీజ్డ్ వాహనాల వేలం

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) భవానీపురం స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలను ఈ నెల 5వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు స్టేషన్ వద్ద వేలం నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ పీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో వాహనాల సంఖ్య 17 కాగా వాటిల్లో మూడు కార్లు, 14 ద్విచక్రవాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా ఫోర్ వీలర్స్‌కు రూ.10వేలు, ద్విచక్రవాహనాలకు రూ.5వేలు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (రీఫండబుల్) కింద చెల్లించాలని తెలిపారు. వేలంలో పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలంపాటకు సంబంధించిన పూర్తి వివరాల కోసం హెడ్ కానిస్టేబుల్ వీవీ వేణుగోపాలరావు ఫోన్ నంబర్ 99493 69538, కానిస్టేబుల్ సీహెచ్ సుబ్రహ్మణ్యం ఫోన్ 80742 69210లో సంప్రదించాలని కోరారు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటో బోల్తా కొట్టడంతో నలుగురికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ప్రమాదంలో గాయపడిన నలుగురిని 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సేకరించిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం వైఎస్సార్ కాలనీ నుంచి కాళేశ్వరరావు మార్కెట్‌కు వెళుతున్న ఆటో పాలప్రాజెక్టు క్వార్టర్స్ వద్ద బోల్తా కొట్టింది. దీంతో స్థానికులు ఆటోను ఎత్తి, అందులో పరిశీలించగా నలుగురు ప్రయాణికులు ఉన్నట్లు గుర్తించారు. ఆటోను నడుపుతున్న వ్యక్తి మద్యం సేవించి ఉండటంతో ప్రమాదం జరిగినట్లు గుర్తించి, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు మహిళలకు గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మేయర్ భాగ్యలక్ష్మికి శుభాకాంక్షలు



మేయర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కేకును కట్‌చేస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): 2023 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మికి నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులతో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఆమెను డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, పలువురు కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ వివిధ విభాగాల శాఖాధిపతులు, సిబ్బందితో కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మెరుగైన సేవలకు సమష్టి కృషి

విజయవాడ నగరపాలక సంస్థ ఉద్యోగులందరికీ నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్ది స్వచ్ఛ సర్వేక్షణ్ నందు జాతీయ స్థాయిలో ఐదో ర్యాంక్‌తో పాటు పలు అవార్డులను రాష్ట్రపతి నుంచి అందుకోవడంలో సిబ్బంది కృషేనని అభినందించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించుటకు ప్రతిఒక్కరు సమష్టి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను శాఖాధిపతులు వారి విభాగాలలో విధులు నిర్వహించు అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెపారు. అనంతరం ఆయన మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గ ప్రెసిడెంట్ గుంజా అజయ్‌కుమార్ కమిషనర్‌తో కేక్ కటింగ్ చేయించారు. అనంతరం ఆయన్ను జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీమతి బెల్లం దుర్గ, కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

ఆర్టీసీ ఎండీ ద్వారకతిరుమలరావు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఆర్టీసీ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు పేర్కొన్నారు. ఆర్టీసీ హౌస్‌లోని ఆయన కార్యాలయంలో ఎండీని ఆదివారం ప్రజా రవాణాసంస్థ బీసీ వెల్ఫేర్ నాయకులు కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారికి సంస్థ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సంస్థను ప్రగతి పథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు, కమిటీ సభ్యులు డి.వెంకటపతి, కొటేశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఎండీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ వెల్ఫేర్ నాయకులు

వెయిట్ లిఫ్టర్‌కు సత్కారం



తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన స్థానిక నాగార్జున స్కూలుకు చెందిన విద్యార్థి వీ సువర్ణను నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి ఆదివారం అభినందించారు. నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్సీపీ నాయకులు సువర్ణను శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. నాగార్జున స్కూల్లో కూడా సువర్ణను ఉపాధ్యాయులు అభినందించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ఆగిరిపల్లి: మండలంలోని మామడి తోటల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందేలపై ఆదివారం ఎస్ఐ ఎన్.చంటిబాబు సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో 5 మందిని అదుపులోకి తీసుకుని, 4 కోడి పుంజులు, రూ.2,400 నగదును స్వాధీనం చేసుకున్నారు.

పీడీ యాక్ట్ నమోదు చేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్): హిందూ దేవుళ్లను, అయ్యప్ప స్వామిని దూషించిన నాస్తిక సంఘం అధ్యక్షుడు భైరి నరేష్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని వీహెచ్‌పీ నగర కార్యదర్శి పి.రాఘవరాజు డిమాండ్ చేశారు. భైరి నరేష్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు దీపాలతో పాయకాపురంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రకాష్‌నగర్ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద నుంచి నున్న రూరల్ పోలీసు స్టేషన్ వరకు ప్రదర్శనగా వెళ్లి, ఎస్సై గోవిందుకు ఫిర్యాదు కాపీని అందజేశారు.

డీజీపీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు



డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీ రాణా

విజయవాడ స్పోర్ట్స్: డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డికి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీ కార్యాలయంలో రాజేంద్రనాథ్‌రెడ్డిని ఆదివారం కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. సీపీ రాణా వెంట డీసీపీ విశాల్ గున్ని ఉన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న కార్పొరేటర్ పుప్పాల కుమారి



కేక్ కట్ చేస్తున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, 21వ డివిజన్‌లోని ఆర్చ్ సమీపంలో ఫీడర్‌రోడ్డులో పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ పుప్పాల కుమారి పాల్గొని నూతన సంసవత్సర కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ మూలంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మపూడి రమేష్, జక్కిరెడ్డి వీరాంజనేయరెడ్డి, గోగు గౌరి, కె.నాగరాజు, కోన రమేష్, కనకదుర్గ, సుంకర సురేంద్రబాబు, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో..

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ సజ్జా రత్నకుమార్ ఆధ్వర్యంలో కొత్త సంవత్సరం ప్రత్యేక ఆరాధన కార్యక్రమం జరిగింది. పాస్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అనంతరం విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారికి ఆయన విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు సజ్జా ఎలియాజర్, సజ్జా జ్యోతి పాల్గొన్నారు.

కృష్ణలంకలో..

కృష్ణలంక(విజయవాతూర్పు): కృష్ణలంక, నల్లగేటు డౌన్‌లోని 20వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు కేక్ కట్ చేశారు. అందరికీ స్వీట్లు పంపిణీ చేసి, నూతన సంవత్సర శుభాకాకంక్షలు తెలిపారు. అనంతరం బందరురోడ్డులోని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్‌తో కలిసి కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథికి బొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రవాణాశాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీటీసీ పురేంద్ర

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అధికారులు, ఉద్యోగులు శాఖాపరంగా తమకు అప్పగించిన బాధ్యతలను ఇష్టంగా చేసినపుడే మంచి పేరు వస్తుందని డీటీసీ ఎం.పురేంద్ర అన్నారు. స్థానిక బందర్ రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోన్- 2 అధ్యక్షుడు ఎం.రాజుబాబు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురేంద్ర మాట్లాడుతూ రవాణాశాఖ అధికారులు ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు. శాఖాపరంగా జిల్లాలోని ప్రజలు కోరుకున్న సేవలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో ముందుంటున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని అధికారులను ఉద్యోగులను డీటీసీ అభినందించారు. శాఖాపరంగా అందరూ కష్టించి పని చేసి 2023 సంవత్సరంలో కూడా జిల్లా రవాణాశాఖను ఉత్తమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓలు ఆర్.జగదీశ్వరరాజు, ఎం.పద్మావతి, టెక్నికల్ అధికారుల సంఘం నాయకులు ఆర్.ప్రవీణ్, నారాయణ రాజు, వెంకటేశ్వరరావు, రాంబాబు, సంఘం జోనల్ కార్యదర్శి కేవీవీ నాగ మురళి, సహాధ్యక్షులు జి.ఉషసుందరి, కార్యాలయ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, మాణిక్యాలరావు, పి.కవిత, ప్రభాకర లింగం, ఉద్యోగ సంఘ నాయకులు బి చంద్రశేఖర్, రామచంద్రరాజు, జోగారావు పాల్గొన్నారు.

ముక్కోటికి ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు

ముస్తాబవుతున్న వైష్ణవాలయాలు



శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏర్పాట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సోమవారం ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని వివిధ వైష్ణవాలయాల్లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వన్‌టౌన్‌లోని దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన పురాతన ఆలయమైన వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. బ్రాహ్మణవీధిలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేసి క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. తెల్లవారుజామును నాలుగు గంటలకు కృష్ణానది నుంచి తీర్థబిందె తీసుకొచ్చి 4.15 గంటలకు ప్రాతఃకాల అర్చన, ఐదు గంటలకు సహస్రనామార్చన, వైకుంఠ గద్య పారాయణ, తిరుప్పావై ఉత్తరద్వార అర్చన తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు తెలిపారు. అనంతరం తిరుప్పావై పాశుర హారతి, అనంతరం గరుడాహనరూఢుడై వైకుంఠ ద్వారం ద్వారా స్వామి విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం రెండున్నర నుంచి నాలుగు గంటల వరకూ స్వామికి గరుడవాహనంపై నగరోత్సవాన్ని నిర్వహించనున్నారు.

శ్రీ కోదండరామస్వామి వారి దేవస్థానం (కొత్తగుళ్లు)లో..

వన్‌టౌన్ శేషయ్యవీధిలోని కోదండరామస్వామి వారి దేవస్థానం (కొత్తగుళ్లు)లోనూ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్వామికి సోమవారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు పులిపాక రాఘవాచార్యులు తెలిపారు. ఉదయం నాలుగున్నర గంటలకే స్వామిగరుడ వాహనాన్ని అధిష్టించి ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

రామాలయంలో..

కొత్తపేట శ్రీ నగరాల సీతారామస్వామి దేవస్థానంలో స్వామికి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించి, భక్తులను దర్శనానికి అనుమతిస్తామని పాలకవర్గం తెలిపింది. ఈ సందర్భంగా ఉత్తర ద్వారంలో స్వామి దర్శనమిస్తారని, అలాగే వాహన సేవ ఉంటుందని పేర్కొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తమ ఇష్ట దైవాలను దర్శించుకునేందుకు విచ్చేసిన భక్తులతో చిట్టినగర్‌లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిట్టినగర్‌లోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం, పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షాపీఠం, శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆయా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

డాక్టర్ అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శం



సభలో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు, వేదికమీద కొప్పుల ఆనంద్, మల్లాది స్వాతి

విజయవాడ కల్చరల్: భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం యువతకు ఆదర్శమని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు అన్నారు. బీర్ అంబేడ్కర్ సాంస్కృతిక సేవా సంస్థ, ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొతా పూర్ణానందం కళావేదికమీద అంబేడ్కర్ స్ఫూర్తిసభ, నూతన సంవత్సవ వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న మహనీయుడు అంబేడ్కర్ అభివర్ణించారు. సినీ నటుడు కొప్పుల ఆనంద్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సంస్థ కృషి చేస్తునట్లు తెలిపారు. స్వరాజ్యమైదానంలో అంబేడ్కర్ స్మృతి వనం నిర్మిస్తున్న ప్రభుత్వం కృషిని అభినందించారు. బీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు ప్రసంగించారు. మల్లాది స్వాతి, ఆదిరాల జయప్రభ, అమలారాణి పలు చిత్ర గీతాలను ఆలపించారు.

నేటి నుంచి సమ్మేటివ్-1 పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు సోమవారం నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణపై రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు 4 నుంచి 7వ తేదీ వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తారు.


పరీక్షల షెడ్యూల్ ఇలా...

1 నుంచి 5 తరగతుల విద్యార్థులు : ఎలిమెంటరీ తరగతులకు (1-5) చెందిన విద్యార్థు లకు 4 నుంచి 7వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఒకటి నుంచి ఐదు వరకు అన్ని తరగతులకు 4వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్, 5న ఇంగ్లిష్, 6న మేథమెటిక్స్ పరీక్షలు ఉంటాయి. ఇక 7వ తేదీన 3, 4, 5 తరగతుల వారికి ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలు నిర్వహిస్తారు.

6 నుంచి 10 తరగతుల విద్యార్థులు: ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తారు. 6, 8, 10 తరగతులకు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు, 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి 4.45 వరకు పరీక్షలు ఉంటాయి.

నూరుశాతం ఉత్తీర్ణతపైనే గురుకులాల గురి

పబ్లిక్ పరీక్షలకు సర్వసన్నద్ధం
- బీసీ గురుకులాల్లో ముందస్తు ప్రణాళిక
- టెన్త్, ఇంటర్‌లో పబ్లిక్ తరహా పరీక్షలతో కసరత్తు
- టెన్త్‌లో 5,130 మంది విద్యార్థులు
- ఇంటర్ ఫస్టియర్‌లో 1,781 మంది, సెకండియర్‌లో 1,389 మంది..


విశాఖపట్నం జిల్లా పరవాడ మండలం తానాం బాలికల గురుకుల విద్యాలయంలో పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని విద్యార్థులు పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు సర్వసన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం గురుకులాల్లో ముందస్తు ప్రణాళికతో కార్యాచరణ చేపట్టారు. ఈ ఏడాది మార్చి 15 నుంచి జరిగే ఇంటర్, ఏప్రిల్ 3న ప్రారంభమయ్యే పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధనే లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. బీసీ సంక్షేమ గురుకులాల్లో 5,130 మంది పదోతరగతి, 1,781 మంది జూనియర్ ఇంటర్, 1,389 మంది సీనియర్ ఇంటర్ చదువుతున్నారు. వారిని ముందస్తుగానే సన్నద్ధం చేసేందుకు పబ్లిక్ పరీక్షల తరహాలోనే గురుకులాల క్యాంపస్‌ల్లో నమూనా ప్రశ్నపత్రాలతో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సన్నద్ధత ఇలా..
- గురుకులాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు క్లాసులు, 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. విద్యార్థుల అనుమానాలను అప్పటికప్పుడే నివృత్తిచేసేలా ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నారు.
- ఇంటర్, టెన్త్ విద్యార్థులకు గతేడాది నవంబర్ నాటికే సిలబస్ పూర్తిచేశారు. వారికి అక్టోబర్ నుంచే ఏ రోజు సిలబస్‌పై ఆ రోజే పరీక్ష(మైక్రోటెస్ట్) నిర్వహిస్తున్నారు.
- ఇంటర్, టెన్త్ విద్యార్థులకు జనవరి 23 నుంచి ఆరు సబ్జెక్టుల వారీగా నమూనా పబ్లిక్ పరీక్షల (గ్రాండ్‌టెస్ట్‌ల) నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేశారు.
- ఇంటెన్సివ్ టెస్టింగ్ ప్రోగ్రాం 2022-23 కార్యాచరణలో భాగంగా ప్రత్యేకంగా నమూనా ప్రశ్నపత్రాల తయారీకి ఆయా సబ్జెక్టుల వారీగా నిపుణులైన 17 మంది అధ్యాపకులతో లీడర్‌షిప్ కమిటీని ఏర్పాటు చేశారు.

నూరుశాతం ఫలితాలే లక్ష్యం



పేద విద్యార్థులు చదివే గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరీక్ష ఫలితాల్లోను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉండాలని ఆదేశాలిచ్చారు. అందుకనుగుణంగానే బీసీ సంక్షేమశాఖలోని అందరి సమన్వయంతో ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా గురుకులాల్లో విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. బీసీ సంక్షేమ గురుకులాల్లో గతేడాది పదోతరగతిలో 85 శాత, ఇంటర్‌లో 92 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఈసారి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే సిలబస్ పూర్తిచేసి రివిజన్‌తో విద్యార్థుల సందేహాలను నివృత్తిచేసేలా సబ్జెక్టుల వారీగా నిపుణులైన అధ్యాపకులను అందుబాటులో ఉంచుతున్నాం. పబ్లిక్ పరీక్షల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకుని, సమర్థంగా రాసి మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను నమూనా పరీక్షల ద్వారా సన్నద్ధం చేస్తున్నాం.

– కృష్ణమోహన్ ఆకేపాటి, కార్యదర్శి, బీసీ సంక్షేమ గురుకులాల విద్యాలయాల సంస్థ

• తెలంగాణ

మద్యం మత్తు.. ఆపై మితిమీరిన వేగం

- హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- ఏపీకి చెందిన ఇద్దరు దుర్మరణం

హైదరాబాద్: కొత్త సంవత్సరం తొలి రోజే ఇద్దరు పాదచారులకు చివరి రోజైంది. న్యూ ఇయర్ పార్టీలో పాల్గొన్న ఇద్దరు యువకులు తెల్లవారుజాము వరకు మత్తులో జోగారు. నిషాలో తమ కారులో ఇంటికి బయలుదేరారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్-2లో వీరి వాహనం అదుపు తప్పి పాదచారుల పైకి దూసుకుపోయింది. డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పాదచారులు అక్కడికక్కడే మరణించగా.. మరికొందరు క్షతగాత్రులయ్యారు. మొత్తం మూడు వాహనాలు ధ్వంసమయ్యాయి.

మృతులిద్దరూ గోదావరి వాసులే

ఏపీలోని కోనసీమ జిల్లా ర్యాలి గ్రామానికి చెందిన అవిడి శ్రీను (50) నగరానికి వలస వచ్చాడు. పెయింటర్‌గా పనిచేస్తూ కొండాపూర్‌లో భార్య సీత, ముగ్గురు కుమార్తెలతో ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో బంజారాహిల్స్ రోడ్ నం.2లోని రాయల్ టిఫిన్ సెంటర్ వద్ద టీ తాగాడు. కొండాపూర్ వెళ్లడానికి రోడ్డు దాటుతున్నాడు. కాగా, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన భీమవరపు ఈశ్వరి (55) కూడా అదే సమయంలో రోడ్డు దాటుతోంది. నగరానికి వలస వచ్చిన ఆమె బంజారాహిల్స్ ఇందిరానగర్‌లో ఉంటోంది. కొన్నాళ్ల క్రితం బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో హెల్పర్‌గా పని చేసి మానేసింది. ఆమె ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది. ఆమె కుమారుడు అరుణ్ కుమార్ బాచుపల్లిలో నివసిస్తున్నాడు.

తనిఖీలు ముగిసే వరకు ఆగి...

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి 10 నుంచి ఆదివారం తెల్లవారుజామున 5 గంటల వరకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. పార్టీలో పాల్గొన్న విద్యానగర్‌కు చెందిన కొడాలి ప్రణవ్ (21), నాచారంకు చెందిన పోలసాని శ్రీవర్ధన్‌రావు (21) ఈ విషయం గమనించి తనిఖీలు ముగిసిన తర్వాత కారులో ఇంటికి బయలుదేరారు. మితిమీరిన వేగంతో వస్తున్న కారు రాయల్ టిఫిన్ సెంటర్ వద్ద రెండు కార్లను ఢీకొని తర్వాత డివైడర్‌ను ఢీకొట్టి గాల్లోకి లేచి పల్టీలు కొట్టి రోడ్డు దాటుతున్న శ్రీను, ఈశ్వరిలను బలంగా ఢీకొట్టింది. దీంతో వీరిద్దరూ గాల్లోకి ఎగిరి పది అడుగుల దూరంలో ఉన్న ఓ ఫొటో స్టూడియో బోర్డుకు తగిలి కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ప్రమా దంలో ప్రణవ్, శ్రీవర్ధన్‌లకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నారు.

బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్!

- తెలంగాణ సీఎం కేసీఆర్ సమక్షంలో నేడు పలువురు ఏపీ నేతల చేరిక
- మాజీమంత్రి రావెల కిశోర్‌బాబుతో పాటు చేరిక జాబితాలో మాజీ ఐఆర్ఎస్ పార్థసారథి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కీలక నేత రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తోట చంద్రశేఖర్‌కు ఏపీలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పగ్గాలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో తోట చంద్రశేఖర్, మాజీమంత్రి రావెల కిశోర్‌బాబుతో పాటుగా పలువురు నేతలు కూడా పార్టీలో చేరేందుకు సోమవారం రంగం సిద్ధమైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో మధ్యాహ్నం 2 గంటలకు వీరి చేరిక కార్యక్రమం ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. చేరిక అనంతరం ఆంధ్రప్రదేశ్ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడిగా కేసీఆర్ ప్రకటిస్తారని, ఆయన సమక్షంలోనే తోట చంద్రశేఖర్ ఏపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తారని పార్టీ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. కాగా, రావెల కిశోర్ బాబు, తోట చంద్రశేఖర్, ఐఆర్ఎస్ మాజీ అధికారి చింతల పార్థసారథి, టీజే ప్రకాశ్‌తో పాటు ఏపీలోని వివిధ జిల్లాలకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరతారు. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన తోట చంద్రశేఖర్ 2008లో ఉద్యోగానికి రాజీనామా చేసి ఆదిత్య హౌజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉంటూ రాజకీయాల్లోకి వచ్చారు. గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఏలూరు ఎంపీగా, 2019లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు. ఇదిలాఉంటే 1987 ఐఆర్‌టీఎస్ కేడర్ అధికారి రావెల కిశోర్ బాబు 2014-18 మధ్యకాలంలో ఏపీ మంత్రిగా పనిచేసి ఆ తర్వాత బీజేపీలో చేరి పార్టీ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

5, 6 తేదీల్లో భోపాల్‌లో దక్షిణాది రాష్ట్రాల జలవనరుల మంత్రుల సదస్సు

- జలవనరులను మరింత సమర్థంగా వినియోగించుకోవడంపై చర్చ
- నదుల అనుసంధానంపై ఏకాభిప్రాయ సాధనకు సంప్రదింపులు
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన సమావేశం

సాక్షి, అమరావతి: జలవనరులను మరింత సమర్థంగా వినియోగించుకోవడం, నదుల అనుసంధానం అజెండాతో రూపొందించిన విజన్-2047పై కేంద్రం ఈనెల 5, 6 తేదీల్లో భోపాల్‌లో దక్షిణాది రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల సదస్సు నిర్వహిస్తోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, గోవా జలవనరుల శాఖ మంత్రులు, కార్యదర్శులు, ఈఎన్సీలు పాల్గొంటారు. దేశంలో జలవనరులను మరింత సమర్థంగా వినియోగించుకోవడంపై కేంద్రం దృష్టి సారించింది. రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించి నదుల అనుసంధానాన్ని చేపట్టే దిశగా అడుగులు వేస్తోంది. ఈ రెండు అంశాలతో కూడిన అజెండాతో రూపొందించిన విజన్-2047పై దక్షిణాది, ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులతో సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సదస్సులను దక్షిణాది రాష్ట్రాలతో ప్రారంభిస్తోంది. భోపాల్‌లో ఈనెల 5, 6 తేదీల్లో సదస్సు నిర్వహించనున్నట్లు ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల ప్రభుత్వాలకు కేంద్రం సమాచారం పంపింది. సదస్సు ప్రారంభంలోనే జలవనరులను సమర్థంగా వినియోగించుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి అంబటి రాంబాబు, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ సి.నారాయణరెడ్డి ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. రాష్ట్రంలో జలవన రులను సమర్థంగా వినియోగించుకుంటూ ఎక్కువ ఆయకట్టుకు నీళ్లందించడానికి అమలు చేస్తున్న విధానాలను వివరించనున్నారు. రెండోరోజున గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రం సంప్రదింపులు జరపనుంది. రాష్ట్రంలో దుర్భిక్ష ప్రాంతాల అవసరాలను తీర్చిన తర్వాతే ఇతర రాష్ట్రాలకు గోదావరి జలాలను తరలించాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయనుంది.

జేఈఈలో ప్రాంతీయ భాషలకు పెరుగుతున్న ఆదరణ

- ఇంగ్లిష్, హిందీతో పాటు 11 భాషల్లో ప్రశ్నపత్రాలు

సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ)లో ప్రాంతీయ భాషల్లో పరీక్షలకు ఆదరణ పెరుగుతోంది. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో జేఈఈని తొలుత ఇంగ్లిష్, హిందీ భాషల్లో మాత్రమే నిర్వహించేవారు. 2016లో గుజరాతీ, మరాఠీ, ఉర్దూ భాషల్లో కూడా ప్రారంభించారు. ఆ తరువాతి ఏడాది మరాఠీ, ఉర్దూను ఉపసంహరించారు. 2020లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కి జేఈఈ పరీక్ష బాధ్యతలను చేపట్టాక ఇంగ్లిష్, హిందీ, గుజరాతీ భాషల్లో నిర్వహించారు. ఇతర భాషలకు ప్రాధాన్యమివ్వకపోవడంపై విమర్శలు వచ్చాయి. దీంతో పాటు జాతీయ నూతన విద్యా విధానంలో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఆ తరువాత నుంచి ఇంగ్లిష్, హిందీతో పాటు 11 ప్రాంతీయ భాషల్లో పరీక్ష నిర్వహిస్తోంది. 2021లో నాలుగు దఫాలుగా నిర్వహించిన జేఈఈ మెయిన్‌కు 9.39 లక్షల మంది దరఖాస్తు చేయగా వారిలో 1,49,621 మంది ప్రాంతీయ భాషలను ఎంచుకున్నారు. బెంగాలీలో 24,841 మంది, గుజరాతీలో 44,094 మంది, హిందీలో 76,459 మంది దరఖాస్తు చేయగా తెలుగులో 371, తమిళం 1264, కన్నడ 234, మలయాళం 398, మరాఠీ 658, ఒడియా 471, పంజాబీ 107, ఉర్దూ 24, అస్సామీ 700 మంది ఉన్నారు. నాలుగు దఫాలకు దరఖాస్తు చేసిన వారి సంఖ్య ఇది. మొత్తం దరఖాస్తుదారుల సంఖ్య (యూనిక్ సంఖ్య)ప్రకారం చూస్తే 70 వేలు. వీరిలో ప్రాంతీయ భాషల్లో పరీక్ష రాసిన వారు 45 వేలు. 2022లో జేఈఈకి మొత్తం 10.26 లక్షల మంది దరఖాస్తు చేయగా వారిలో ప్రాంతీయ భాషల్లో రాసేందుకు దరఖాస్తు చేసిన వారి సంఖ్య 80 వేలకు పైగా ఉంది. వీరిలో 50 వేల మంది వరకు ప్రాంతీయ భాషల్లో పరీక్ష రాశారు. బెంగాలీ, గుజరాతీ, హిందీ భాషల్లోనే ఎక్కువ మంది పరీక్షకు హాజరయ్యారు. 2022లో తెలుగులో పరీక్ష రాసిన వారి సంఖ్య 1,200 వరకు పెరిగింది. 2023లో ప్రాంతీయ భాషల్లో పరీక్షలు రాసే వారి సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా. ఆయా భాషల్లో ప్రశ్నపత్రాల్లో సందేహాలు ఉంటే ఆంగ్ల ప్రశ్నపత్రాన్ని ప్రామాణికంగా తీసుకోవలసి ఉంటుంది.

త్వరలో బండి సంజయ్ మరో విడత పాదయాత్ర?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరిన్ని విడతల 'ప్రజాసంగ్రామయాత్ర'చేపట్టాలనే ఒత్తిడి బీజేపీ నాయకత్వంపై పెరుగుతోంది. పాదయాత్రలతో కార్యకర్తలతో కొత్త ఉత్సాహం నెలకొన్నందున ఆ యాత్రలు కొనసాగించాలనే డిమాండ్ పెరుగుతోంది. దీనికి సంబంధించి కార్యకర్తల నుంచి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కనీసం మరో విడత పాదయాత్ర నిర్వహించే అవకాశమున్నట్టు పార్టీవర్గాల సమాచారం. ఇప్పటిదాకా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ నేతృత్వంలో ఐదు విడతలుగా చేపట్టిన పాదయాత్రలకు వచ్చిన భారీ స్పందన ద్వారా బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ అనే అభిప్రాయం ఏర్పడిందని పార్టీనేతలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18 లేదా 20వ తేదీ నుంచి పాదయాత్రను మళ్లీ మొదలుపెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వార్తలు

గుంటూరు షూటర్స్‌కు 16 పతకాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాజమండ్రిలో గత నెల 30, 31 తేదీల్లో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ పోటీల్లో రైఫిల్ షూటింగ్ విభాగంలో తమ విద్యార్థులు ఐదు బంగారు, ఐదు రజతాలు, ఆరు కాంస్య పతకాలతో మొత్తం 16 పతకాలు సాధించారని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ చీఫ్ కోచ్ ఎన్.సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గెలుపొందిన షూటర్స్‌కు అభినందనలు తెలిపారు.

15 రోజుల తర్వాత స్వగ్రామానికి భౌతికకాయం

కెనడాలో బొర్రావారిపాలెం వాసి మరణం



బొర్రావారిపాలెం (ప్రత్తిపాడు): 'బాబూ మమ్మల్ని వదిలేసి అర్ధంతరంగా అనంత లోకాలకు వెళ్లిపోయావా' అంటూ ఆ తల్లిదండ్రులు భోరున విలపించారు. కెనడాలో చదువుకునేందుకు వెళ్లిన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం బొర్రావారిపాలెం గ్రామానికి చెందిన గొల్లపూడి రాజేష్ (33) ఈ నెల 17న అక్కడ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో మరణించిన సంగతి తెలిసిందే. రాజేష్‌కు తల్లిదండ్రులతోపాటు ఓ పాప ఉంది. ఈ నేపథ్యంలో రాజేష్ మృతదేహం 15 రోజుల తర్వాత ఆదివారం స్వగ్రామానికి చేరుకుంది. కుమారుడి మృతదేహాన్ని చూసిన ఆ తల్లిదండ్రుల దుఃఖం కట్టలు తెంచుకుంది. బిడ్డా.. మమ్మల్ని, పిల్లను ఒంటరిని చేసి వెళ్లిపోయావా.. అంటూ హృదయ విదారకంగా విలపించారు. గ్రామస్తులు, బంధువుల అశ్రునయనాల మధ్యన అంత్యక్రియలు నిర్వహించారు. వాస్తవానికి శనివారం రాత్రికే రాజేష్ మృతదేహం ఇండియాకు రావలసి ఉన్నప్పటికీ, సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. ఆదివారం ఉదయానికి తల్లిదండ్రుల చెంతకు చేరడంతో వెంటనే అంత్యక్రియల్ని ముగించారు.

యువ గుండెకు పోటు

- 30 ఏళ్ల యువతీయువకుల్లో గుండె సంబంధ వ్యాధులు
- విపరీతమైన ఒత్తిడే కారణమంటున్న వైద్యులు
- ధూమపానం, మద్యపానంతో గుండెజబ్బులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): యువత గుండె లయతప్పుతోంది. మూడు పదుల వయస్సులోనే గుండెపోటుకు గురవుతోంది. విజయవాడ ప్రభుత్వాస్పత్రి (జీజీహెచ్)కి వారంలో ఇద్దరు ముగ్గురు యువతీయువకులు వస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు సైతం పలువురు వెళ్తున్నారు. కోవిడ్ తర్వాత యువతలో గుండె సమస్యలు ఎక్కువయ్యాయి. వారిలో కొందరు మృత్యువాత పడుతున్నారు. చిన్న వయస్సులో గుండెపోటు రావడానికి కారణం విపరీతమైన ఒత్తిడి (స్ట్రెస్), ధూమపానం, మద్యపానం ప్రధాన కారణాలు. కలుషిత గాలి, ఆహారపు అలవాట్లు కూడా కారణాలుగా నిలుస్తున్నాయి. యువతలో గుండెపోటును నివారించాలంటే చిన్నప్పటి నుంచి ఆరోగ్యకరమైన అలవాట్లు అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.

ఇవే నిదర్శనం
- విజయవాడ లబ్బీపేటకు చెందిన 25 ఏళ్ల యువకుడు ఒక ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ విధుల్లోనే ఉంటాడు. ఇటీవల ఛాతీ నొప్పికి గురవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆ యువకుడిని పరీక్షించి గుండె పోటుగు గురయ్యాడని నిర్ధారించారు. సకాలంలో ఆస్పత్రికి వెళ్లడంతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.
- విద్యాధరపురానికి చెందిన 30 ఏళ్ల యువకుడు ప్రైవేటు సంస్థలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి సిగరెట్, మద్యం అలవాటు ఉంది. ఇటీవల డ్యూటీకి బయలుదేరుతూ ఛాతీలో నొప్పి అనడంతో కుటుంబ సభ్యులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లే సరికే ప్రాణం కోల్పోయాడు.

వీరిద్దరే కాదు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ఇటీవల 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు వారు గుండెపోటుతో వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఎక్కువగా 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు వారు గుండెపోటుకు గురవుతున్నారు. వారిలో కొందరు ఆస్పత్రికి చేరేటప్పటికే మృత్యువాడ పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఆరోగ్య రక్షణకు ఏంచేయాలంటే..

గుండె జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉంది.
- పనిలో ఒత్తిడి తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. యోగా, ధ్యానంపై దృష్టి సారించాలి.
- శారీరక శ్రమ కలిగేలా రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వాకింగ్, వ్యాయామం చేయాలి.
- తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉన్న వారు వయస్సు 30 ఏళ్లు దాటిన తర్వాత హార్ట్ చెకప్ తరచూ చేయించుకోవాలి.
- ఆరోగ్యకర ఆహారం తీసుకోవాలి. ఫాస్ట్‌ఫుడ్, నూనె ఎక్కువగా వాడిన ఆహారం తీసుకోరాదు.

అప్రమత్తంగా ఉండాలి



గుండెపోటుకు గురవుతున్న యువతను ఇటీవల తరచుగా చూస్తున్నాం. ప్రభుత్వాస్పత్రికి సైతం అలాంటి వారు వారంలో ఇద్దరు, ముగ్గురు వస్తున్నారు. గుండెపోటుకు గురవుతున్న యువతలో 80 శాతం మందికి స్మోకింగ్, ఆల్కహాల్, స్ట్రెస్ కారణాలు. రక్తనాళాల్లో బ్లాక్స్ ఏర్పడిన వారిని గుర్తించి స్టెంట్స్ వేస్తున్నాం. రక్తనాళాల్లో పూడికలకు స్టెంట్స్ వేయాలా లేక బైపాస్ సర్జరీ అవసరం అవుతుందా, మందులు సరిపోతాయా అనేది నిర్ణయించేందుకు ఎఫ్ఎఫ్ఆర్ పరీక్ష చేస్తాం. ఇటీవల యువతకు ఎక్కువగా యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్టీలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ బి.విజయచైతన్య, కార్డియాలజిస్ట్, విజయవాడ

కారణాలివే..
- చిన్న వయస్సులోనే గుండెపోటుకు గురవడానికి వైద్యులు అనేక కారణాలు చెబుతున్నారు.
- చదువులో, విధుల్లో తీవ్రమైన ఒత్తిడికి (స్ట్రెస్) గురవడం.
- స్మోకింగ్, ఆల్కహాల్ సేవనం ప్రధాన కారణం.
- ఫాస్ట్‌ఫుడ్, రక్తంలో చెడు కొలస్ట్రాల్ ఎక్కువగా ఉండటం కూడా కారణమే.
- రెండు పదుల వయస్సులోనే మధుమేహం వ్యాధి వచ్చినా గుర్తించక పోవడం.
- తల్లిదండ్రులు ఇద్దరికీ గుండె జబ్బులు ఉంటే, వారి పిల్లలు చిన్న వయస్సులోనే గుండె జబ్బుల బారిన పడే అవకాశం ఉంది.
- వాతావరణ కాలుష్యం కూడా గుండెజబ్బులకు దారితీస్తోంది.
- కోవిడ్ బారిన పడిన వారి సన్నని రక్తనాళాల్లో క్లాట్స్ ఏర్పడి ఇరవై ఏళ్ల వారికి కూడా గుండె పోటు వస్తోంది.

దుర్గమ్మ సేవలో మంత్రి రోజా


మంత్రి రోజాకు ఆది దంపతుల చిత్రపటాన్ని అందజేస్తున్న ఏఈఓ వెంకటరెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఏపీ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె. రోజా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి రోజాకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ ఏఈఓ వెంకటరెడ్డి దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. అనంతరం మంత్రి రోజా ఆలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు.

ఒంగోలు గిత్తలను వృద్ధి చేసేందుకే రైతు సంబరాలు

కొప్పురావూరు పీఏసీఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు


పోటీల్లో సత్తా చాటుతున్న కోడె గిత్తలు


ఎడ్ల జత యజమానులకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు తోట శ్రీనివాసరావు తదితరులు

పెదకాకాని: ఒంగోలు జాతి ఎడ్లను వృద్ధి చేసేందుకే రైతు సంబరాలు నిర్వహిస్తున్నామని కొప్పురావూరు వ్యవసాయ పరపతి సంఘం చైర్‌పర్సన్ తోట శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామ శివార్లలో ప్రారంభమైన ఐదురోజుల జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజాల బండ లాగుడు ప్రదర్శనలు ఉత్సాహభరితంగా సాగాయి. చివరి రోజు ఆదివారం పోటీల్ని తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎడ్ల ప్రదర్శన నిర్వాహకుడు, కొప్పురావూరు పీఏసీఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగిన ఎడ్ల పందాలు నాలుగు పళ్ల విభాగం, ఆరు పళ్ల విభాగం, వ్యవసాయ విభాగం, సబ్ జూనియర్స్ విభాగం, సీనియర్స్ విభాగాల్లో బండ లాగుడు పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల ద్వారా ఒంగోలు జాతి కోడెదూడలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. ఒంగోలు జాతి పశు సంపదను కాపాడుతున్న పశు పోషకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పోటీలకు పశువులతో వచ్చిన రైతులను సత్కరించారు. గెలుపొందిన ఎడ్ల జతల యజమానులకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. సర్పంచి ఆలా సాంబశివరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, మాజీ సర్పంచి విన్నకోట పూర్ణశంకరరావు, చిల్లా వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

సీనియర్స్ విభాగంలో విజేతలు

చివరిరోజు ఆదివారం సీనియర్స్ విభాగంలో జరిగాయి. ప్రదర్శనలో మొత్తం 11 జతలు పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన ఆర్‌కే బుల్స్ యజమానులు అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిలకు చెందిన ఎడ్ల జత 2550.8 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. డీవీఆర్ మెమోరియల్ కృష్ణా జిల్లా కానూరు గ్రామానికి చెందిన దేవభక్తుని సుబ్బారావు ఎడ్ల జత 2518.11 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ గ్రామానికి చెందిన వైపీఆర్ బుల్స్ యజమాని యేల్చూరి ప్రసన్నారెడ్డి , కృష్ణా జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన బొంతు రామిరెడ్డి, బసివిరెడ్డి మెమోరియల్ యజమాని ఆరుమళ్ల కృష్ణారెడ్డి కంబైన్డ్ జత 2500 అడుగుల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచాయని నిర్వాహకుడు తోట శ్రీనివాసరావు తెలిపారు.

జగన్మోహిని అలంకారంలో నృసింహస్వామి దర్శనం


క్యూలైనులో బారులుతీరిన భక్తులు


జగన్మోహిని అలంకారంలో శ్రీవారు

మంగళగిరి: నగరంలో కొలువైన శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆదివారం రాత్రి జగన్మోహిని అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళా వేదికపై ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డీఎస్పీ జె. రాంబాబు ఆధ్వర్యంలో సీఐలు అంకమ్మరావు, భూషణం పర్యవేక్షణలో 250 మందికి పైగా పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

భక్తుల కోలాహలం

స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఎగువ, దిగువ సన్నిధుల్లో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.


ఉత్తర ద్వార దర్శనానికి భారీ ఏర్పాట్లు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీలక్ష్మీ నృసింహస్వామి సోమవారం ఉత్తర ద్వారంలో దర్శనమివ్వనున్నారు. ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి ఒంటి గంట నుంచి సోమవారం తెల్లవారుజాము మూడు గంటల వరకు తిరుమంజనోత్సవం అనంతరం స్వామి వారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం ॥ 2-1-2023

మంచి మాట

మెలకువలోనే మేలిమి



మనిషి మెలకువలో ఉండాలి; మనిషి మేలుకుని మసలాలి. మెలకువలో ఉండేందుకు, మేలుకుని మసలేందుకు మనిషి బతకాలి; మనిషి మేలుగా బతకాలి. నిద్రపోకూడదనీ, నిద్రవద్దనీ కాదు నిద్రపోతున్నప్పుడు మాత్రమే మనిషికి నిద్ర ఉండాలి. నిద్ర అనేది మనిషికి కొంచెంసేపు వేసుకునే వస్త్రంగా మాత్రమే ఉండాలి. నిద్ర మనిషి పూర్తిగా కప్పుకునే దుప్పటి కాకూడదు; మనిషి తనను తాను నిద్రతో కప్పేసుకోకూడదు. మెలకువతో, మెలకువలో మనిషి తనను తాను చాటుకుంటూ ఉండాలి.

'మెలకువలో కల నిజం కాదు; కలలో మెలకువ లేదు' అని ఆదిశంకరాచార్య చెప్పారు. ఈ మాటల్ని మనసులోకీ, మెదడులోకీ ఎక్కించుకోవాలి. కలలు కనడానికి నిద్రపోతూ ఉండడంలోనూ, నిద్రలో కలలు కంటూ ఉండడంలోనూ కాలాన్ని వ్యర్థం చేసుకోకూడదు. కలలోనూ, నిద్రలోనూ మెలకువ ఉండదు. మనకు మెలకువ కావాలి ఎందుకంటే మెలకువలో కల నిజం కాదు. మనిషి కల కాకూడదు; మనిషి నిజం కావాలి.

భద్రంగా ఉండాలని మనం నిద్రలోనే ఉండిపోకూడదు. నిద్రలో అటూ, ఇటూ పొర్లుతూ ఉండడం జీవితవిధానం కాదు, ఎప్పటికీ కాకూడదు. నిద్రలో కలవరిస్తూ ఉండడంలోనూ, ఆ కలవరింతల్లో జరిగిపోయిన వాటిని వర్ణించుకుంటూ ఉండడంలోనూ మునిగిపోయిన మనిషి బతుకును పాడు చేసుకోవడం అనే నేరం చేస్తున్న నేరస్థుడు. ఎన్నో కలలు వస్తూ ఉంటాయి నిద్రలో. ఆ కలలు అన్నిటిలోనూ కల్లల్ని చూసుకుంటూ ఉండిపోవడం వయసును చిదుముకోవడమే అవుతుంది. కొందరు నిద్రపోతున్నప్పుడు మాత్రమే కాదు మేలుకుని ఉన్నప్పుడు కూడా కలలకంటూ ఉంటారు; కొందరు మెలకువను కూడా కలల్లో గడిపేస్తూ ఉంటారు, కలల్లో కలిపేస్తూ ఉంటారు. ఇది అవాంఛనీయమైన స్థితి; ఇది బాధాకరమైన స్థితి. మెలకువను కూడా కలల్లో గడిపేస్తూ, కలిపేస్తూ ఉండే వాళ్లు కల్లలు అయిపోతారు. మనిషి కల్ల అయిపోకూడదు.

అందుకే మనిషి వీలైనంత మెలకువలో ఉండాలి; అందుకే మనిషి వీలైనంత మేలుకుని ఉండాలి.

పుట్టిన వ్యక్తికి తప్పకుండా మరణం ఉంటుంది. పుట్టుక, మరణం మధ్యలో ఉండే నిడివి జీవితం అవుతుంది. జీవితంలో మెలకువతో ఉండడమే జీవనం అవుతుంది. జీవి జీవితానికి మెలకువ జవ. ఆ జవ ఉన్న జీవనంలోనే చవి ఉంటుంది. జవ, చవి లేని మనిషి జీవితం చెక్కకో, చెత్తకో సమానం అవడం కాదు చెక్కకన్నా, చెత్తకన్నా హీనం ఆపై హేయం అవుతుంది. మనిషి చెక్కో, చెత్తో అవడం దుస్థితి, దుర్గతి. 'యా మతిస్సా గతిర్భవేత్' అని అష్టావక్రగీతలో చెప్పడం జరిగింది. అంటే మతి ఎటువంటిదో గతి అటువంటిది అని అర్థం. మనిషి మతికి మెలకువ ఉంటే గతికి మెలకువ ఉంటుంది. మతికి, గతికి మెలకువ ఉంటే మనిషి చెక్కో, చెత్తో అయిపోయే దుస్థితి ఉండదు, రాదు.

ప్రకృతి మెలకువలోనే ఉంటుంది. ప్రకృతి నిద్రపోతే ఏం అవుతుందో మనం ఒకసారి ఆలోచిద్దాం. ప్రకృతి నిద్రపోతే మన ఆలోచనలకు కూడా అందని పరిణామాలు సంభవిస్తాయి. గాలి మెలకువలో ఉండడం వల్లే మనం ఊపిరి పీల్చుకుంటూ ఉన్నాం. రాత్రుల్లో మొక్కలు మెలకువతో ఉండబట్టే పువ్వులు పూస్తూ ఉన్నాయి. నదులు మెలకువతో పోతూ ఉన్నాయి కాబట్టే మన అవసరాలు తీరుతూ ఉన్నాయి. 'గచ్ఛ తీతి జగత్' అంటారు; పోతూనే ఉంది కాబట్టే జగత్ అయింది అని దానికి అర్థం. జగత్తు మొత్తం మెలకువతో ఉంది; మేలుకుని ఉంది. భూమి మెలకువతో ఉంది కాబట్టే సూర్యోదయం జరుగుతోంది; మనిషి మెలకువ తో ఉంటేనే జీవనోదయం జరుగుతుంది. 'కంపనాత్' అని అంటూ 'కదలడంవల్ల అది బ్రహ్మం' అని ఒక బ్రహ్మసూత్రం మనకు ఎరుకను ఇస్తోంది. ప్రకతి మాత్రమే కాదు బ్రహ్మం కూడా కదలిక ఉన్నదే. ప్రకృతి, బ్రహ్మం రెండూ మెలకువలో ఉండేవే; మేలుకుని ఉండేవే.

ఎంత మెలకువ ఉంటే అంత మేలును పొందుతాం. ఎంత మేలుకుని ఉంటే అంత మేలిమిని పొందుతాం. మెలకువలో బతుకుతూ మనం మేలును పొందుతూ ఉందాం; మేలుకుని బతుకుతూ మనం మేలిమికి మాలిమి అవుదాం.

– రోచిష్మాన్

సన్నిధి

ఇస్లాం వెలుగు

కాలంతో పోటీ పడదాం.!

మానవ జీవితం చాలా అమూల్యమైనది. అలాంటి జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం పైనే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయి. ఈ ప్రపంచంలో మనం ఏదైనా సాధించవచ్చు.. ఛేదించవచ్చు. డబ్బు.., గౌరవం.., ఉద్యోగం.., అధికారం.., హోదా.. ఏదైనా కావచ్చు, అదిసాధ్యమే.. కాని కాలాన్ని మాత్రం ఎంత ధనం ధారపోసినా, ఎంత పలుకుబడి ఉపయోగించినా సాధించలేము. ఇది కాలం చెప్పే సత్యం. మనం దాని విలువను గుర్తించకపోతే అది మనకోసం ఆగదు. అందుకని మనం ఏ విషయంలో అయినా సకాలంలో స్పందించ గలగాలి. సమయం మించి పోయిన తరువాత తీరిగ్గా విచారిస్తే ప్రయోజనం ఉండదు. అవకాశాలు ఎప్పుడూ మనకోసం నిరీక్షిస్తూ ఉండవు. అవకాశాలను మనమే సృష్టించుకోవాలి. మనమే వాటిని అందిపుచ్చుకోవాలి. అవి మనవద్దకు రావాలని ఆశించడం సరికాదు. ఎప్పుడు ఏది అవసరమో దానిపై దృష్టి కేంద్రీకరించాలి. బాధ్యతల నిర్వహణలో అలసత్వాన్ని దరి చేరనీయకూడదు. ఎందుకంటే, ఈరోజు చేయవలసిన కార్యాన్ని రేపటికి వాయిదా వేశామంటే కాలానికి మనం విలువ ఇవ్వనట్లే లెక్క. ఈనాటి కొద్దిపాటి అలక్ష్యం రేపటి బాధ్యతను రెట్టింపుచేస్తుంది. ఒకటికి రెండు తోడై, బాధ్యతలు పేరుకు పోతాయి. ఇక ఆ తరువాత బాధ్యతల నిర్వహణ తలకు మించిన భారంగా మారి, పలాయన వాదాన్ని ఆశ్రయించే దుస్థితి వస్తుంది. అద్భుతమైన విజయాలను సాధించినవారి జీవితాలను పరిశీలిస్తే, వారు కాలాన్ని (సమయాన్ని) ఎలా తమకు అనుకూలంగా మలచుకొని, సద్వినియోగం చేసుకొని, కొత్త అవకాశాలను సృష్టించుకున్నారో, కొంగ్రొత్త ఆవిష్కరణలకు ఎలా నాంది పలికారో మనకు అర్థమవుతుంది. అందుకని కాలం విలువను గుర్తించాలి. దాని ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. జీవిత కాలాన్ని సద్వినియోగం చేసుకొని విజయ తీరాలకు చేరినవారి గాథల్ని అధ్యయనం చెయ్యాలి. స్ఫూర్తిపొందాలి. అపజయాలు మూటగట్టుకొని కాలగతిలో కలిసిపోయిన వారి గాథల్ని గుణపాఠాలుగా తీసుకోవాలి. కాలం / సమయం మనకు అనేక నిజాలు చెబుతోంది. బుద్ధిజీవి అయిన మానవుడు వాటిని అవలోకన చేసుకుంటూ, నీతిగా, నిజాయితీగా, విలువలతో కూడిన జీవితం గడుపుతూ, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఎన్ని అవాంతరాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు. గమ్యాన్ని ముద్దాడవచ్చు. దేవుడు మనందరికీ ఈ కొత్త సంవత్సరంలో సకల శుభాలూ, సంతోషాలు కలుగ జేయాలని, గతం నుండి గుణ పాఠాలు నేర్చుకుంటూ వెలుగులవైపు నడిపించాలని కోరుకుందాం.!



– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

గురువాణి

యువత భగవద్గీత సారాన్ని తెలుసుకోవాలి

మైసూరు దత్తపీఠాధిపతి
శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ



మహాభారతం పంచమవేదంగా చెప్పబడుతోంది. మహాభారతంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన భగవద్గీతలోని సారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ముఖ్యంగా యువత భగవద్గీత చదివి సారాన్ని పూర్తిగా అర్థం చేసుకోవాలి. శ్రీకృష్ణుడు చెప్పినట్లు ఫలితాన్ని ఆశించకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించుకుంటూ ముందుకెళ్లాలి. గీతాసారాన్ని తెలుసుకుంటే మాట్లాడే ప్రతి మాట, ప్రతి అడుగు తిరుగులేని కచ్చితత్వంతో ఉంటాయి. అన్ని సమస్యలకు పరిష్కారం చూపించే సారం గీతలో ఉంది. దత్తాత్రేయుడిగా గురువు అవతారమెత్తిన మహావిష్ణువు కృతయుగంలో శ్రీరాముడిగా, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా అవతరించి మానవాళికి మార్గదర్శకులయ్యారు. వీరి అవతారాలకు భారతదేశం వేదిక కావడం అదృష్టం. దీంతో ప్రపంచ దేశాలకు భారతదేశం ఎనలేని విజ్ఞానాన్ని అందించినట్లైంది. భారతదేశం ఎప్పుడూ ప్రపంచంలోని అన్ని దేశాలు బాగుండాలని కోరుకుంటూ వస్తోంది. ఇతర దేశాలతో ప్రేమపూర్వకంగా ఉంటూ వస్తున్న భారతదేశ విధానాన్నే స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకెళ్లాలి. దీంతో యువతలో సానుకూల దృక్పథం కలుగుతుంది. అనేక దేశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న భారత యువత అక్కడ భారత సంస్కృతి, సాంప్రదాయాల గురించి గర్వంగా చెప్పుకోవాలి. అదేవిధంగా ప్రకృతి, పంచభూతాలను ఎవరు నడిపిస్తున్నారనే విషయాలను తెలుసుకోవాలి. దీంతో అందరికీ సద్బుద్ధి కలుగుతుంది. పరమాత్మను పరిపూర్ణంగా శరణు వేడడమే అన్నింటికీ పరిష్కార మార్గం. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత మానవాళికి దిశానిర్దేశం చేస్తోంది. భాగవతంలో శ్రీకృష్ణుడి అవతారం ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉంటుంది. త్రేతాయుగంలో శ్రీరాముడిగా కష్టాలు అనుభవిస్తూ ధర్మమార్గంలో ఎలా నడవాలో చూపించిన పరమాత్మ, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా ఎన్ని ఒడిదొడుకులు ఎదుర్కొన్నాడో భాగవతం చదివితే తెలుస్తుంది. చిన్నతనం నుంచే భగవద్గీత, రామాయణం, మహాభారతం, భాగవతం గురించి తెలుసుకుంటే యువత తిరుగులేని సానుకూల దృక్పథాన్ని సాధిస్తుంది.



– తూమాటి భద్రారెడ్డి
సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

ముగ్గు ముచ్చట



ఎల్.రమాదేవి
వైరా, ఖమ్మం జిల్లా



21 చుక్కలు
11 వరకు
మధ్య చుక్కలు

బడబాగ్ని సురేఖ
ప్రొద్దుటూరు



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com
★ అడ్రస్‌లో మీ ఊరి పేరుతోపాటు మీ కాలనీ పేరు కూడా రాయండి.



16 చుక్కలు
2 వచ్చేవరకు

సినిమా

కొత్త పోస్టర్

నూతన సంవత్సరం (2023) వచ్చింది.
కొత్త పోస్టర్లను తెచ్చింది..
సినీ లవర్స్‌కి ఆనందాన్ని ఇచ్చింది...
ఇక ఆ కొత్త అప్‌డేట్స్‌పై ఓ లుక్కేద్దాం....




• చిరంజీవి

చిరంజీవి హీరోగా బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో హీరో రవితేజ కీలక పాత్ర చేశారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 13న విడుదలకానుంది. న్యూ ఇయర్ సందర్భంగా ఈ చిత్రం నుంచి చిరంజీవి కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది యూనిట్. అదేవిధంగా బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వై.రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ మూవీ నుంచి బాలకృష్ణ, శ్రుతీహాసన్ లేటెస్ట్ పోస్టర్‌ని యూనిట్ రిలీజ్ చేసింది. ఈ మూవీలోని 'మాస్ మొగుడు..' అంటూ సాగే పాటని ఈ నెల 3న విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది.



• బాలకృష్ణ, శ్రుతీహాసన్



• నాగచైతన్య



• అఖిల్

కాగా నాగచైతన్య హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'కస్టడీ'. కృతీశెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాస చిట్టూరి తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్నారు. ఈ మూవీ నుంచి ఒక స్పెషల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు మేకర్స్. మే 12న ఈ సినిమా విడుదలకానుంది. అలాగే హీరో అఖిల్ నటించిన మూవీ 'ఏజెంట్'. డైరెక్టర్ సురేందర్ రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రంలో సాక్షీ వైద్య హీరోయిన్. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, సురేందర్ 2 బ్యానర్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా సంక్రాంతికి విడుదలకావాల్సి ఉంది.. అయితే వేసవిలో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ పేర్కొంటూ కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది. అదేవిధంగా 'బింబిసార' వంటి హిట్ చిత్రం తర్వాత కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అమిగోస్'. రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఫిబ్రవరి 10న రిలీజ్ చేయనున్నట్లు పేర్కొంటూ కల్యాణ్ రామ్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. కాగా 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న హిందీ చిత్రం 'యానిమల్'. రణ్‌బీర్ కపూర్, రష్మిక మందన్న జంటగా నటిస్తున్నారు. టీ సీరీస్, భద్రకాళీ పిక్చర్స్‌పై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతోన్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం.

వీటితో పాటు మరికొన్ని సినిమాల కొత్త పోస్టర్స్, కొత్త అప్‌డేట్స్‌ని ఇచ్చాయి చిత్రవర్గాలు.



• కల్యాణ్‌రామ్



• రణ్‌బీర్ కపూర్

బిజీ ఘోస్ట్

ప్రముఖ కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ హీరోగా నటిస్తున్న తాజా యాక్షన్ థ్రిల్లర్ 'ఘోస్ట్'. శ్రీని దర్శకత్వం వహిస్తున్నారు. సందేశ్ ప్రొడక్షన్స్ పతాకంపై సందేశ్ నాగరాజ్ నిర్మిస్తున్న ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఘోస్ట్' సెకండ్ షెడ్యూల్ ఇటీవల మైసూర్‌లో ముగిసింది. ఈ షెడ్యూల్‌లో శివరాజ్‌కుమార్, జయరాం, ప్రశాంత్ నారాయణన్‌వంటి ప్రధాన తారాగణంపై భారీ జైలు సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. బెంగళూరులో వేసిన మరో భారీ సెట్‌లో ఈ సినిమా మూడో షెడ్యూల్ ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభిస్తాం. ఈ షెడ్యూల్‌లో ఇంట్రవెల్, క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. అచ్యుత్ కుమార్, దత్తన్న, అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: అర్జున్ జన్య, కెమెరా: మహేంద్ర సింహా.



• శివరాజ్‌కుమార్



• నాని

తండ్రీకూతుళ్ల అనుబంధం

హీరో నాని కొత్త సంవత్సరం కొత్త సినిమా కబురు చెప్పారు. నాని హీరోగా శౌర్యువ్‌ను దర్శకునిగా పరిచయం చేస్తూ, వైర ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చెరుకూరి వెంకట మోహన్, డా.విజయేందర్‌రెడ్డి, మూర్తి కలగర ఓ సినిమా నిర్మించనున్నారు. ఈ చిత్రంలో 'సీతారామం' ఫేమ్ మృణాళ్ ఠాకూర్ హీరోయిన్. న్యూ ఇయర్ సందర్భంగా ఆదివారం ఈ సినిమా ప్రకటించి, నాని వాయిస్ ఓవర్‌తో ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఈ సినిమా తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని గ్లింప్స్‌ను బట్టి తెలుస్తోంది. నాని కెరీర్‌లో 30వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ మూవీకి మలయాళ మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరకర్త. ఈ సినిమాకు కెమెరా: సాను జాన్ వర్గీస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఈవీవీ సతీష్.

2024 వేసవిలో...



• ఎన్టీఆర్

ఎన్టీఆర్ కొత్త సినిమా లేటెస్ట్ అప్‌డేట్ న్యూఇయర్ సందర్భంగా ఆదివారం వెల్లడైంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ చిత్రం తర్వాత ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ ఈ మూవీ నిర్మిస్తున్నారు. కాగా న్యూ ఇయర్ సందర్భంగా ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఫిబ్రవరిలో స్టార్ట్ చేయనున్నట్లు వెల్లడించారు మేకర్స్. అలాగే 2024 వేసవిలో ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించనున్నారనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌లో జరుగుతోంది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఎన్టీఆర్ కెరీర్‌లో 30వ సినిమాగా రూపుదిద్దుకుంటున్న ఈ మూవీకి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.

అందరికీ నచ్చితేనే సమస్య!

ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్

"కొట్లాట అంటేనే కొందరు బోరింగ్‌గా ఫీలవుతారు. కానీ ఫైట్‌ను కూడా ఆడియన్స్ ఎంజాయ్ చేసేలా మేం కంపోజ్ చేయాలి. అందుకే ప్రతి ఫైట్‌కు ఓ కాన్సెప్ట్ ఉండేలా చూసుకుంటుంటాం'' అన్నారు ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్. చిరంజీవి హీరోగా కొల్లి బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన 'వీరసింహారెడ్డి' చిత్రాలు ఈ సంక్రాంతి సందర్భంగా జనవరి 13, జనవరి 12న రిలీజ్ కానున్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ రెండు చిత్రాలకు ఫైట్స్ కంపోజ్ చేశారు రామ్-లక్ష్మణ్. హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రామ్-లక్ష్మణ్ చెప్పిన విశేషాలు.

• 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' సినిమాల్లోని హీరోల క్యారెక్టరైజేషన్స్, బాడీ లాంగ్వేజ్, కథ బ్యాక్‌డ్రాప్ పూర్తిగా విభిన్నం. అందువల్ల ఫైట్స్ కంపోజింగ్ విషయంలో మాకు పెద్దగా ఇబ్బందులు కలగలేదు.

• 'వాల్తేరు వీరయ్య'లో లుంగీ కట్టుకుని శ్రీకాకుళం యాస మాట్లాడుతూ అందరితో కలిసిపోయి ఉండే ఓ సాధారణ వ్యక్తి వీరయ్య ఇంట్రవెల్ సమయానికి రెండు గన్స్ తీసుకుని వస్తాడు.. ఇది బాగుంటుంది. ఇటు 'వీరసింహారెడ్డి'లో బాలకృష్ణగారు చైర్‌లో కూర్చొని చేసే ఓ యాక్షన్ సీక్వెన్స్ ఉంటుంది. డిఫరెంట్‌గా చేయగలిగాం. 'వాల్తేరు వీరయ్య' లోని ఇంట్రవెల్ సీన్ ఫైట్‌ను దాదాపు 15 రోజులు చిత్రీకరించాం. చిరంజీవి, రవితేజగార్ల మధ్య ఉండే ఓ ఎమోషనల్ డ్రామా కంటతడి పెట్టిస్తుంది. అలాగే 'వీరసింహారెడ్డి' ఇంట్రవెల్ యాక్షన్ సీన్‌ను టర్కీలో షూట్ చేశాం. ఇక్కడ ఉండే ఓ ఎమోషనల్ సీన్ చూసి మాకు కన్నీళ్లు వచ్చాయి. ఆడియన్స్ కూడా ఇదే ఫీలవుతారని నమ్ముతున్నాం.

• యాక్షన్‌తో మిళితమై ఉన్న సాంగ్స్ కొన్ని వస్తున్నాయి. ఈ ట్రెండ్ మాకు ఉపయోగమే అనుకుంటున్నాం. రొటీన్ ఫైట్స్ కాకుండా ఇలా చేస్తున్నప్పుడు మాకు కొత్తగా ఉంటుంది.



మేం కంపోజ్ చేసిన ఫైట్స్ నచ్చలేదని మమ్మల్ని తీసేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఏ భగవంతుడూ అందరికీ నచ్చడం లేదు. కొందరు రాముడిని ఆరాధిస్తే, మరికొందరు కృష్ణుణ్ణి ఆరాధిస్తుంటారు. ఇలా విభిన్న రకాల మనస్తత్వాలు ఉంటాయి. మనం మనుషులం. సో.. మనం అందరికీ నచ్చాలని ఏం లేదు. చెప్పాలంటే అందరికీ నచ్చితేనే సమస్య. నచ్చితే ఎక్కువ ఎమోషన్‌ను ఫీల్ అవ్వాల్సి ఉంటుంది. అప్పుడు కొన్ని ఇబ్బందులు తప్పవు. మీకు మీరు నచ్చాలి. నాకు నేను నచ్చాలి. అదే అందరికీ సేఫ్. మనం మనకు నచ్చడం ముఖ్యం.

అల్లు అర్జున్ 'అల.. వైకుంఠపురములో..' సినిమా క్లైమాక్స్‌లో ఇలాంటి పాటే ఉంటుంది.

• ఫైట్ కంపోజింగ్ విషయంలో కొన్నిసార్లు డైరెక్టర్, ప్రొడ్యూసర్స్, హీరో సలహాలు తీసుకోవాల్సి వస్తుంది. కథలో ఫైట్‌కు ముందు ఉన్న లీడ్ సీన్స్ కూడా తెలుసుకోవాలి. 'భరత్ అనే నేను' లో మహేశ్‌బాబుగారు యువ ముఖ్యమంత్రిగా చేశారు. యంగ్ సీఎం అంటే జగన్ మోహన్‌రెడ్డిగారిని ఊహించుకుని స్టైలిష్‌గా ఓ ఫైట్‌ను కంపోజ్ చేశాం. కథ, హీరో క్యారెక్టరైజేషన్, బాడీ లాంగ్వేజ్‌ని దృష్టిలో పెట్టుకుని కూడా ఫైట్ కంపోజ్ చేస్తాం.



ప్రిక్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్

జాతీయ సీనియర్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ శుభారంభం చేశాడు. హిసార్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఆదివారం జరిగిన 57 కేజీల విభాగం తొలి రౌండ్ బౌట్‌లో హుసాముద్దీన్ 5-0తో బులెన్ బురాగోహైన్ (అస్సాం)పై గెలుపొందాడు. మంగళవారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో లాలామావ్మా (మిజోరం)తో హుసాముద్దీన్ తలపడతాడు. ఈ టోర్నీలో 13 వెయిట్ కేటగిరీలలో కలిపి మొత్తం 386 మంది బాక్సర్లు బరిలో ఉన్నారు.

సంయుక్తంగా అగ్రస్థానంలో కార్తీక్

జాతీయ సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ 11వ రౌండ్ తర్వాత 8.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ టోర్నీలో 11వ రౌండ్ గేమ్‌లో కార్తీక్ 41 ఎత్తుల్లో అభిజిత్ గుప్తా (పీఎస్‌పీబీ)పై నెగ్గాడు. ఈ టోర్నీలో మరో రెండు రౌండ్‌లు మిగిలి ఉన్నాయి. అరోణ్యక్ ఘోష్ (రైల్వేస్), కౌస్తవ్ చటర్జీ (బెంగాల్) కూడా 8.5 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నారు.



సర్వ సన్నద్ధం కోసం...

- మళ్లీ యో-యో టెస్టు
- ఆటగాళ్ల ఫిట్‌నెస్‌కు అమిత ప్రాధాన్యం
- బీసీసీఐ ఉన్నతస్థాయి సమావేశం

ముంబై: ఈ ఏడాది స్వదేశంలో జరగనున్న వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా క్రికెటర్ల ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యమివ్వాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయించింది. ఆదివారం బోర్డు ఉన్నతస్థాయి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆటగాళ్లకు కఠిన పరీక్ష పెట్టే యో-యో ఫిట్‌నెస్ టెస్టును తిరిగి ప్రవేశ పెట్టనున్నారు. ప్రత్యేకించి ఈ ఏడాది వరల్డ్‌కప్‌తో పాటు, ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ కూడా ఉండటంతో భారత ప్రపంచకప్ సైన్యంపై అదనపు ఒత్తిడి, క్రికెట్ భారం లేకుండా పక్కా ప్రణాళికతో సిరీస్‌లకు ఎంపిక చేయాలని ఈ భేటీలో నిర్ణయించారు.

- బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో బోర్డు కార్యదర్శి జై షా, భారత కెప్టెన్ రోహిత్ శర్మ, హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్, చీఫ్ సెలక్టర్ చేతన్ శర్మ పాల్గొన్నారు. బిన్నీ మాత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు.
- కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, శిఖర్ ధావన్ ఇలా గత కొంతకాలంగా భారత కెప్టెన్లను మార్చినప్పటికీ పూర్తిస్థాయి సారథిగా రోహిత్ శర్మనే కొనసాగించాలని తీర్మానించారు. తద్వారా సారథ్య మార్పు ఉండదని స్పష్టం చేశారు.
- మెగా టోర్నీ, మేటి జట్లతో సిరీస్‌ల నేపథ్యంలో జట్టు సెలక్షన్ కోసం యో-యో టెస్టు, డెక్సా (ఎముకల పరిపుష్టి పరీక్ష) టెస్టుల్ని నిర్వహిస్తారు. ఎంపికవ్వాలంటే ఈ టెస్టులు పాసవ్వాలి.
- ఎమర్జింగ్ ప్లేయర్లు ఐపీఎల్‌తో పాటు ప్రాధాన్యత గల దేశవాళీ టోర్నీల్లో ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకున్న వారిని జాతీయ జట్టుకు ఎంపిక చేస్తారు.
- ప్రపంచకప్‌కు ఎంపికయ్యే క్రికెటర్లంతా పూర్తి ఫిట్‌నెస్‌తో మెగా ఈవెంట్‌కు అందుబాటులో ఉండేలా చూడటమే ప్రాధాన్య అంశంగా భేటీ జరిగింది. ఆటగాళ్లపై బిజీ షెడ్యూల్ భారం, ఒత్తిడి, మెంటల్ కండిషనింగ్, ఫిట్‌నెస్ అంశాల్ని ఇందులో చర్చించారు.
- మంచి ఆల్‌రౌండర్ అవుతాడనుకున్న దీపక్ చహర్, భారత ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తరచూ గాయాల పాలవడంపై చర్చించిన మీదట ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయించారు.
- అవసరమైతే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీలతో కూడా బోర్డు పెద్దలు మాట్లాడతారు. ఈ ఏడాది భారత క్రికెట్‌కు అత్యంత కీలకం కాబట్టి ఆయా ఫ్రాంచైజీలు ఐపీఎల్ టోర్నీ సమయంలో తమ స్టార్ ఆటగాళ్లపై పెనుభారం మోపకుండా చూస్తారు.
- గతంలో కోహ్లి కెప్టెన్సీ హయాంలో యో-యో టెస్టు వార్తల్లో నిలిచింది. అయితే ఇది స్టార్, ఎలైట్ ఆటగాళ్లను కష్టపెట్టడంతో తాత్కాలికంగా యో-యో టెస్టును పక్కన పెట్టారు.
- ఆస్ట్రేలియాలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో టీమిండియా సెమీఫైనల్ వైఫల్యం దరిమిలా తొలగించిన సెలక్షన్ కమిటీ చైర్మన్ చేతన్ శర్మ ఈ కీలక మీటింగ్‌లో పాల్గొనడం గమనార్హం.

20 మందితో ప్రపంచకప్ సైన్యం...

సొంతగడ్డపై ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లలో జరిగే ప్రపంచకప్ కోసం 20 మందితో కూడిన జాబితాను సిద్ధం చేశారు. మెగా టోర్నీ జరిగేదాకా వీరందరూ కూడా ఒకే టోర్నీలో బరిలోకి దిగరు. రొటేషన్ పద్ధతిలో ఆడతారు. కొందరికి విశ్రాంతి... ఇంకొందరు బరిలోకి అన్నట్లుగా ఈ పద్ధతి సాగుతుంది. గాయాల పాలవకుండా, మితిమీరిన క్రికెట్ భారం పడకుండా ఉండేందుకు బోర్డు ఉన్నతస్థాయి సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.



ఏమిటీ 'యో-యో'

రెండు కోన్‌ల (ప్లాస్టిక్ స్తంభాలు) మధ్య బీప్ సౌండ్‌తో పరిగెత్తించే పరీక్షే యో-యో టెస్టు. రెండు కోన్‌ల మధ్య 20 మీటర్ల దూరం ఉంటుంది. మూడు బీప్ సౌండ్‌లు మోగేలోపు ఈ దూరాన్ని పూర్తి చేయాలి. అంటే మొదటి బీప్‌నకు ఇక్కడి కోన్ నుంచి పరుగు ప్రారంభించి... రెండో బీప్ సౌండ్‌లోపు అవతలి కోన్‌కు చేరాలి. మూడో బీప్ మోగే సరికి ఇవతలి కోన్ చేరాలి. దీనికి స్కోరు ఉంటుంది. అంటే నిర్ణీత సమయంలోపు పూర్తి చేస్తే మెరుగైన స్కోరు, ఆ తర్వాత సగటు స్కోరు ఇస్తారు. అసాధారణ ఫిట్‌నెస్‌తో ఉండే కోహ్లి యో-యో టెస్టు పాసైనప్పటికీ టాప్-5 స్కోరర్స్‌లో లేడు. అతను 19 స్కోరు చేసి 8వ స్థానంలో ఉన్నాడు. గతంలో షమీ, సంజూ సామ్సన్, రాయుడు, రైనా, పృథ్వీ షా, వాషింగ్టన్ సుందర్ యో-యో టెస్టులో ఫెయిలయ్యారు.

టాప్-5 యో-యో స్కోర్లు

1. షాన్ మసూద్ (పాక్) 22.1
2. బెయిర్‌స్టో (ఇంగ్లండ్) 21.8
3. మయాంక్ డాగర్ (భారత్) 19.3
4. బెత్ లాంగ్‌స్టన్ (ఇంగ్లండ్) 19.2
5. రిజ్వాన్ (పాక్) 19.2

పంత్‌ను పరామర్శించిన ఉత్తరాఖండ్ సీఎం

డెహ్రాడూన్: కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భారత క్రికెటర్ రిషభ్ పంత్‌ను ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఆదివారం పరామర్శించారు. ప్రస్తుతం పంత్ డెహ్రాడూన్‌లోని మాక్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఆసుపత్రిలో పంత్ వెంట తల్లి సరోజ్, సోదరి సాక్షి ఉన్నారు. ఈ సందర్భంగా పంత్‌కు లభిస్తున్న చికిత్స గురించి సీఎం వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పంత్‌కు అత్యున్నత వైద్య చికిత్స అందిస్తామని, అతని చికిత్సకయ్యే ఖర్చులన్నీ తమ ప్రభుత్వం భరిస్తుందని ఈ సందర్భంగా పుష్కర్ సింగ్ తెలిపారు.

ఆ ఇద్దరికి సత్కారం...

శుక్రవారం ఉదయం ఢిల్లీ నుంచి ఉత్తరాఖండ్‌లోని తన స్వస్థలం రూర్కీకి వెళుతుండగా పంత్ కారు ప్రమాదానికి గురైంది. రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే యత్నంలో పంత్ నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. క్షణాల్లో అతని కారులో మంటలు చెలరేగాయి. అదే దారిలో వెళుతున్న హరియాణా రోడ్‌వేస్‌కు చెందిన బస్సు డ్రైవర్ సుశీల్ కుమార్, కండక్టర్ పరమ్‌జీత్ వెంటనే అటువైపు వెళ్లి కారులో చిక్కుకున్న పంత్‌ను బయటకు తీసుకొచ్చారు. ఇప్పటికే హరియాణా ప్రభుత్వం సుశీల్, పరమ్‌జీత్‌లను సన్మానించగా... ఈనెల 26న గణతంత్ర దినోత్సవం రోజున తమ ప్రభుత్వం కూడా సుశీల్, పరమ్‌జీత్‌లను సత్కరిస్తుందని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ప్రకటించారు. గుంతను తప్పించబోయి ప్రమాదానికి గురైనట్లు పంత్ తమతో చెప్పాడని ఢిల్లీ క్రికెట్ సంఘం అధికారులు వివరించడంతో ఢిల్లీ-డెహ్రాడూన్ హైవే రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు నిర్ణయం తీసుకోవడం గమనార్హం.



రిషభ్ పంత్ తల్లి సరోజ్, సోదరి సాక్షిలతో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి

మెయిన్ 'డ్రా'కు రామ్‌కుమార్

నేటి నుంచి టాటా ఓపెన్ ఏటీపీ టోర్నీ

పుణే: భారత్‌లో జరిగే ఏకైక అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)-250 టోర్నీ టాటా ఓపెన్‌లో భారత మూడో ర్యాంకర్ రామ్‌కుమార్ రామనాథన్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 432వ ర్యాంకర్ రామ్‌కుమార్ 6-3, 7-5తో ప్రపంచ 153వ ర్యాంకర్ మతియా బెలూచి (ఇటలీ)పై సంచలన విజయం సాధించాడు. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్‌కుమార్ ఏకంగా 14 ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను ఏడుసార్లు కాపాడుకున్న రామ్‌కుమార్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 62వ ర్యాంకర్ పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్)తో రామ్‌కుమార్ తలపడతాడు. భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీ మాత్రం మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాడు. క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో యూకీ 1-6, 4-6తో ఇలియాస్ ఈమర్ (స్వీడన్) చేతిలో ఓడిపోయాడు. నేటి నుంచి మెయిన్ 'డ్రా' మ్యాచ్‌లు మొదలవుతాయి. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 'వైల్డ్ కార్డు' పొందిన భారత టీనేజర్, 15 ఏళ్ల మానస్‌తో మైకేల్ మో (అమెరికా); సుమిత్ నగాల్ (భారత్)తో క్రయినోవిచ్ (సెర్బియా) తలపడతారు. 6,42,735 డాలర్ల (రూ. 53 కోట్లు) ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో సింగిల్స్ విజేతకు 97,760 డాలర్లు (రూ. 80 లక్షల 87 వేలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి.



సెలెక్షన్ ట్రయల్స్‌కు సైనా దూరం

నేడు ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ కోసం భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: వచ్చే నెలలో దుబాయ్‌లో జరిగే ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ఎంపిక చేసేందుకు ఈరోజు సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నారు. ర్యాంకింగ్ ఆధారంగా మహిళల సింగిల్స్‌లో పీవీ సింధును నేరుగా జట్టులో ఎంపిక చేయగా... రెండో బెర్త్ కోసం సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోద్‌లను భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) సెలక్షన్ ట్రయల్స్‌కు ఆహ్వానించింది. అయితే తాము సెలక్షన్ ట్రయల్స్‌కు హాజరు కాలేమని సైనా, మాళవిక 'బాయ్'కు సమాచారం ఇచ్చారు. సైనా, మాళవిక వైదొలిగిన నేపథ్యంలో ఈ ట్రయల్స్‌కు అష్మిత చాలియాను 'బాయ్' ఎంపిక చేసింది. అష్మిత, ఆకర్షి మధ్య జరిగే ట్రయల్స్ మ్యాచ్‌లో గెలిచిన వారికి జట్టులో రెండో సింగిల్స్ ప్లేయర్‌గా స్థానం లభిస్తుంది. 32 ఏళ్ల సైనా గత ఏడాది 14 అంతర్జాతీయ టోర్నీలలో పాల్గొని ఒక్క దాంట్లోనూ క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయింది. ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి 14 మంది బరిలోకి దిగనున్నారు. ర్యాంకింగ్ ఆధారంగా పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్... పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిలను నేరుగా జట్టులోకి ఎంపిక చేశారు. మిగతా బెర్త్‌ల కోసం నేడు ట్రయల్స్‌ను ఏర్పాటు చేశారు.



విద్య, ఉద్యోగ సమాచారం

సీఆర్‌పీఎఫ్‌లో 1458 ఎస్సై, హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్).. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టెనోగ్రాఫర్), హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్).. పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1458
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(స్టెనోగ్రాఫర్)-143, హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్)-1315.
» **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/విశ్వవిద్యాలయం నుంచి ఇంటర్మీడియట్(10+2) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. పురుషులు 165సెం.మీ., మహిళలు 155 సెం.మీ. ఎత్తు కలిగి ఉండాలి.
» **వయసు:** 25.01.2023 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఏఎస్సై పోస్టులకు రూ.29,200 నుంచి రూ.92,300, హెచ్‌సీ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, డిటైల్డ్ మెడికల్ టెస్ట్, రివ్యూ మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. హిందీ/ఇంగ్లిష్ భాష,జనరల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అంశాల్లో ప్రశ్నలుంటాయి. 90 నిమిషాల వ్యవధి ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.01.2023
» **సీబీటీ అడ్మిట్ కార్డ్ విడుదల:** 15.02.2023.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీలు:** 22.02.2023 నుంచి 28.02.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.crpf.gov.in

టీఎస్‌పీఎస్సీలో 148 వ్యవసాయ అధికారి పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం, సహకార శాఖలో వ్యవసాయ అధికారుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 148(మల్టీ జోన్1-100, మల్టీ జోన్2-48).
» **అర్హత:** బీఎస్సీ అగ్రికల్చర్/బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.51,320 నుంచి రూ.1,27,310 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.01.2023
» **పరీక్ష తేది:** ఏప్రిల్-2023.
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

టీఎస్‌పీఎస్సీలో 128 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. తెలంగాణ రాష్ట్ర కళాశాల, సాంకేతిక విద్య కమిషనరేట్ల పరిధిలో ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 128

పోస్టుల వివరాలు

» సాంకేతిక విద్యలో ఫిజికల్ డైరెక్టర్-37(మల్టీ జోన్1-18, మల్టీ జోన్2-19)
» ఇంటర్మీడియట్ విద్యలో ఫిజికల్ డైరెక్టర్-91(మల్టీ జోన్1-55, మల్టీ జోన్2-36).
» **అర్హత:** పోస్టును అనుసరించి మంచి అకడమిక్ రికార్డుతో ఎంపీఈడీ(ఫిజికల్ ఎడ్యుకేషన్/ఫిజికల్ ఎడ్యుకేషన్ సైన్స్), నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు పీడీ(టెక్నికల్ ఎడ్యుకేషన్)-లెవల్ 9ఎ-రూ.56,100, లెవల్ 10-రూ.57,700, పీడీ(ఇంటర్మీడియట్ విద్య)-రూ.54,220 నుంచి రూ.1,33,630 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్), సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 06.01.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 27.01.2023
» **పరీక్ష తేది:** ఏప్రిల్-2023
» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాలో పీడియాట్రీషియన్ పోస్టులు

నెల్లూరు జిల్లా డీఎంహెచ్‌వో ఆత్మకూరులోని మెడిసిన్ హబ్, డీఈఐసీలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **పోస్టుల వివరాలు:** పీడియాట్రీషియన్-02, జనరల్ ఫిజిషియన్-01.
» **అర్హత:** ఎంబీబీఎస్, ఎండీ(పీడియాట్రిక్స్/జనరల్ మెడిసిన్), డిప్లొమా(చైల్డ్ హెల్త్) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,00,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును నెల్లూరు జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 02.01.2023.
» **వెబ్‌సైట్:** spsnellore.ap.gov.in

ఇంటర్‌తోనే.. డిగ్రీ+కొలువు

» నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ(1)-2023
» 395 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన యూపీఎస్సీ
» ఎంపికైతే త్రివిధ దళాల్లో కొలువుతోపాటు డిగ్రీ ఖాయం
» శిక్షణ సమయంలోనే నెలకు రూ.56వేల స్టయిఫండ్

ఉద్యోగంతోపాటు బీఏ, బీటెక్ డిగ్రీ పట్టా కూడా అందుకునేందుకు మార్గం.. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించే.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్!! ఇంటర్మీడియెట్ అర్హతతో ఈ పరీక్షలో విజయం సాధించి.. త్రివిధ దళాల్లో శిక్షణకు ఎంపికైతే..నెలకు రూ.56వేల స్టయిఫండ్ అందుకోవచ్చు. శిక్షణ పూర్తయ్యాక పర్మనెంట్ కమిషన్ ర్యాంకు హోదాతో కొలువుతోపాటు బ్యాచిలర్ డిగ్రీ సర్టిఫికెట్ కూడా సొంతమవుతుంది. తాజాగా ఎన్‌డీఏ, ఎన్‌ఏ(1)-2023కి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌డీఏ, ఎన్‌ఏ(1)-2023 వివరాలు, భర్తీ చేసే పోస్టులు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలతో సమగ్ర కథనం...

ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షలో విజయం సాధించి.. ఆ తర్వాత మిలిటరీ అకాడమీ, నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీలు వేర్వేరుగా నిర్వహించే ఎస్‌ఎస్‌బీ ప్రక్రియలోనూ నెగ్గి తుది విజేతలుగా నిలిస్తే.. అభ్యర్థులు ఎంచుకున్న విభాగంలో పర్మనెంట్ కమిషన్ హోదాతో కొలువు ఖాయమైనట్లే! యూపీఎస్సీ ప్రతి ఏటా రెండుసార్లు ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షను నిర్వహిస్తుంది.

మొత్తం పోస్టుల సంఖ్య 395

- ఎన్‌డీఏ,ఎన్‌ఏ(1)-2023 ఎంపిక ప్రక్రియ ద్వారా.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో మొత్తం 395 ఖాళీలను భర్తీ చేయనున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో భాగంగానే ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు వేర్వేరుగా ఖాళీలను ప్రకటించారు. ఆర్మీ విభాగం-208 ఖాళీలు, నేవీ-42, ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ విభాగం-92, ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్)-18, ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్)లో-10 ఖాళీలు ఉన్నాయి.
- నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్)లో-25(పురుష అభ్యర్థులకు మాత్రమే) ఖాళీలు ప్రకటించారు.

వేతనం

- శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టయిఫండ్ లభిస్తుంది. శిక్షణ పూర్తి చేసుకొని సర్వీసులో చేరిన వారికి పే లెవల్ 10తో రూ.56,100-1,77,500 వేతన శ్రేణి అందుతుంది.

అర్హతలు

- **ఆర్మీ వింగ్:** ఏ గ్రూప్‌లోనైనా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీ:** మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులవ్వాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 24 డిసెంబర్ 2023 నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.



ఎన్‌డీఏ,ఎన్‌ఏ(1)-2023

- **వయసు:** జూలై 2, 2004-జూలై 1, 2007 మధ్య జన్మించి ఉండాలి.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

ఎన్‌డీఏ, ఎన్‌ఏకు రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అవి..రాత పరీక్ష, ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ. తొలి దశలో యూపీఎస్సీ ఎన్‌డీఏ, ఎన్‌ఏ రాత పరీక్షను నిర్వహిస్తుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా.. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుని.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు దక్కిన వారికి తదుపరి దశలో సదరు విభాగాల్లో(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఎస్‌ఎస్‌బీల ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు ఉంటాయి. వీటిలోనూ ఉత్తీర్ణత సాధిస్తే త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో శిక్షణ ఖరారవుతుంది.

శిక్షణ, డిగ్రీ సర్టిఫికెట్

- ఎంపిక ప్రక్రియలోని రెండు దశల్లోనూ విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో శిక్షణ ఉంటుంది.
- ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగాలకు సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ పుణెలో, నేవల్ అకాడమీ అభ్యర్థులకు ఎజిమలలోని నేవల్ అకాడమీలో శిక్షణనిస్తారు.
- అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న విభాగాలను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది.
- శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టాలు కూడా అందజేస్తారు. అంటే.. ఒకే సమయంలో కొలువు, ఉన్నత విద్య రెండింటినీ సొంతం చేసుకునే అవకాశం ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్ష ద్వారా లభిస్తుంది.

మూడేళ్ల శిక్షణ

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ-పుణెలో మూడేళ్లపాటు శిక్షణ ఉంటుంది. మొదటి రెండున్నరేళ్లు అన్ని విభాగాల అభ్యర్థులకు కామన్‌గా శిక్షణ ఇస్తారు. చివరి ఆరు నెలలు మాత్రం అభ్యర్థులు ఎంపికైన విభాగం ఆధారంగా ఫిజికల్ ట్రైనింగ్ ఉంటుంది. ఇలా మొత్తం మూడేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వారు ఎంపిక చేసుకున్న కోర్సు ఆధారంగా జేఎన్‌యూ-ఢిల్లీ నుంచి బీఏ, బీఎస్సీ, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) డిగ్రీలను అందిస్తారు.
- ఎయిర్‌ఫోర్స్, నేవల్ విభాగాలను ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న వారికి బీటెక్ చదివేందుకు అవకాశం ఉంటుంది. వీరు ఈ విషయాన్ని ముందుగానే తెలియజేయాలి.

నేవల్ అకాడమీ.. ప్రత్యేక శిక్షణ

ఎన్‌ఏ, 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు ఎంపికైన వారికి నేవల్ అకాడమీ(ఎజిమల)లో నాలుగేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. ఆ తర్వాత వీరికి అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్ అందిస్తారు.

తొలి దశ.. రాత పరీక్ష

- ఎన్‌డీఏ,ఎన్‌ఏ ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను రెండు పేపర్లలో మొత్తం 900 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్ 1 మ్యాథమెటిక్స్ 300 మార్కులకు,పేపర్ 2 జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు ఉంటాయి. ప్రతి పేపర్ పరీక్ష సమయం రెండున్నర గంటలు. పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది.
- పేపర్-2గా నిర్వహించే జనరల్ ఎబిలిటీ టెస్ట్‌లో.. పార్ట్-ఎ పేరుతో 200 మార్కులకు ప్రత్యేకంగా ఇంగ్లిష్ విభాగం ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగం పేరుతో పార్ట్-బిని నిర్వహిస్తారు. పార్ట్-బికి 400 మార్కులుంటాయి.

పార్ట్-బి.. ఆరు విభాగాలు

- పేపర్-2 పార్ట్ బీని 400 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో మొత్తం ఆరు విభాగాలు(ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరెంట్ ఈవెంట్స్) నుంచి ప్రశ్నలడుగుతారు. ప్రతి విభాగానికి సంబంధించి నిర్దిష్టంగా వెయిటేజీని పేర్కొన్నారు. ఫిజిక్స్‌కు 25 శాతం, కెమిస్ట్రీకి 15 శాతం, జనరల్ సైన్స్‌కు 10 శాతం, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమానికి 20 శాతం, జాగ్రఫీకి 20 శాతం, కరెంట్ ఈవెంట్స్‌కు పది శాతం వెయిటేజీ కల్పించారు. ఈ వెయిటేజీ ప్రకారమే ఆయా విభాగాల్లో ప్రశ్నల సంఖ్య, మార్కులు ఉంటాయి.
- పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే పేపర్-1, పేపర్-2లలో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారిని విజేతలుగా ప్రకటిస్తారు.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ ఇలా

- ఎన్‌డీఏ, ఎన్‌ఏ రాత పరీక్షలో విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు మలి దశలో మరో 900 మార్కులకు ఎస్‌ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న సమయంలో పేర్కొన్న ప్రాథామ్యతలు, రాత పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా.. నిర్దేశిత విభాగం ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌బీ (సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్) నిర్వహించే ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్‌లోనూ నెగ్గాల్సి ఉంటుంది.
- ఎయిర్‌ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు.. ఎస్‌ఎస్‌బీ తర్వాత నిర్వహించే కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్‌లో కూడా విజయం సాధించాల్సి ఉంటుంది.
- ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల మానసిక, శారీరక ధృఢత్వాన్ని పరిశీలిస్తారు. ఇంటెలిజెన్స్ టెస్ట్, వెర్బల్ టెస్ట్, నాన్ వెర్బల్ టెస్ట్, సామాజిక అంశాలపై ఉన్న అవగాహన, తార్కిక విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షిస్తారు. అదే విధంగా పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇలా మొత్తం అయిదు రోజుల పాటు ఈ ప్రక్రియ సాగుతుంది. ఇందులోనూ తుది జాబితాలో నిలిచిన వారికి ప్రాథమికంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ-పుణె, నేవల్ అకాడమీ(ఎజిమల)లో శిక్షణ ఉంటుంది.

విజయం సాధించాలంటే

- పేపర్-1లో మంచి మార్కులు సాధించేందుకు అల్జీబ్రా, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, అనలిటికల్ జామెట్రీ, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ట్రిగ్నోమెట్రీ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ప్రాక్టీస్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా మేలు చేస్తుంది. బేసిక్ ప్రిన్సిపుల్స్, వివిధ సిద్ధాంతాలు, సూత్రాలు, ఫార్ములాలపై పట్టు సాధించాలి. ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
- పేపర్-2లో బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి..ఫిజిక్స్,కెమిస్ట్రీ, జనరల్ సైన్స్,చరిత్ర-భారత స్వాతంత్ర్యోద్యమం,జాగ్రఫీ, కరంట్ అఫైర్స్‌లను క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి. పాత ప్రశ్న పత్రాలు, ఆయా విభాగాలకు ఇచ్చిన వెయిటేజీ ఆధారంగా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 10, 2023
- **ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్ష తేదీ:** ఏప్రిల్ 16, 2023
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
2-1-2023

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
293	86
60,841	18,105

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	10,466	▽	12
డోజోన్స్	33,147	▽	74
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,452	▽	61
డాక్స్	13,924	▽	148
షాంఘై	3,089	△	16
నికాయ్	26,094	△	1

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.01	83.68
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.80	89.89
€	యూరో	ఒకటి	98.24	101.53
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	61.47	63.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.02	57.42
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.65	62.60
SAR	సౌదీ రియాల్	ఖాయమతుక	20.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయమతుక	21.62	23.42
¥	చైనా యువాన్	ఖాయమతుక	10.86	12.86

ఉన్నట్టుండి ఉద్యోగం పోతే..?

- ముందుగానే సన్నద్ధమై ఉండాలి
- ఆరు నెలలు, ఏడాది అవసరాలకు సరిపడా నిధి
- పొదుపు లేకుంటే తాత్కాలికంగా రుణ మార్గం
- జాబ్ లాస్ ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు
- సొంతంగా హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఉండాలి
- ఈఎంఐలు, బీమా ప్రీమియం చెల్లింపులు ఆగకూడదు



ఆర్థిక మాంద్యం భయాలు మరో విడత కంపెనీలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రపంచంలోనే దిగ్గజ సంస్థలుగా పిలుచుకునే గూగుల్, ఫేస్ బుక్, అమెజాన్ అనే కాదు.. చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు ఐటీ, ఇతర రంగాల్లోని కంపెనీలు ఉద్యోగులను తగ్గించుకునే పనిలో పడ్డాయి. భారత్‌లో అమెజాన్, ట్విట్టర్ ఇప్పటికే కొంత మంది ఉద్యోగులను ఇంటికి పంపించేశాయి. ప్రైవేటు రంగంలో ఉద్యోగానికి భద్రత తక్కువే. పని చేయించుకునే సంస్థలు, ప్రతికూల పరిస్థితుల్లో నిర్దాక్షిణ్యంగా సాగనంపుతాయి. కనుక ఎవరికి వారు తమవంతుగా భద్రత కల్పించుకోవాల్సిందే. ఉద్యోగం కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురైతే ఎలా నెగ్గుకురావాలో ప్రణాళిక ఉండాలి. అందుకు ముందు నుంచే సన్నద్ధమై, దానికంటూ ఓ బడ్జెట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా నిశ్చింతగా ఉండగలరు. ఉపాధి కోల్పోయినప్పుడు మన ముందున్న మార్గాలేంటి? ముందస్తు సన్నాహాలేంటన్నది తెలియజేసే కథనమే ఇది.

వ్యయాలపై నియంత్రణ

కనీసం మీ వద్ద 3–4 నెలల అవసరాలు, రుణ ఈఎంఐల చెల్లింపులకు సరిపడా ఉంటే ఏమాత్రం ఆందోళన అక్కర్లేదు. అప్పుడు ఉన్న వనరులను జాగ్రత్తగా వినియోగించుకునే ప్రణాళిక ఉంటే సరిపోతుంది. అంత మేర లేకపోతే అప్పుడు ప్రత్యామ్నాయాలను చూడాలి. మన ఆర్జన ఆగినా, రుణానికి చెల్లింపులు చేస్తూనే ఉండాలి. నెలవారీ ఇంటి అద్దె, మొబైల్, డిష్ బిల్లుల విషయంలో రాజీపడలేరు. కనుక ఇతర వ్యయాలపై నియంత్రణ ఒక్కటే మార్గం. అందుబాటులో ఉన్న వనరులు ఎన్ని, దాంతో ఎన్ని నెలలు నెట్టుకురావచ్చన్న అంచనాకు రావాలి. బయట రెస్టారెంట్లలో తినడాలు, పర్యటనలు, సెలవుల్లో ఊర్లకు వెళ్లడాన్ని వాయిదా వేసుకోవాలి. వ్యక్తిగత వాహనాన్ని ఇంట్లోనే పెట్టేసి ప్రజా రవాణాను వినియోగించుకోవచ్చు. వారాంతపు పార్టీలకు విరామం పలకాలి. సినిమాల కోసం థియేటర్లకు వెళ్లడం మానేయాలి. మరీ కష్టంగా ఉంటే పెట్టుబడులను సైతం నిలిపివేసుకోక తప్పదు.

వీటిని మిస్ కాకూడదు

కష్టకాలంలో రుణ ఈఎంఐలను చెల్లించకపోతే, అది వ్యక్తిగత రుణ చరిత్రలో పెద్ద మచ్చగా మిగిలిపోతుంది. భవిష్యత్తులో రుణం లభించడం కష్టంగా మారుతుంది. ఒకవేళ వచ్చినా, అధిక రుణ రేటును చెల్లించాల్సి రావచ్చు. అందుకని ఈఎంఐ చెల్లింపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపివేయకూడదు. అలాగే, బీమా పాలసీల ప్రీమియం చెల్లింపుల్లోనూ విఫలం కావద్దు. ఒకవేళ పెట్టుబడులకు సంబంధించి ఆటోడెబిట్ ఇన్‌స్ట్రక్షన్ ఇచ్చి ఉంటే వాటిని వెంటనే నిలిపివేయడం సరైనది.

పెట్టుబడుల ఉపసంహరణ – రుణ మార్గం

ఉద్యోగం పోయిందని చెప్పి కంగారుగా పెట్టుబడులు అన్నింటినీ వెనక్కి తీసుకోవద్దు. సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్న వారు ముందుగా రెండు నెలల అవసరాలకు సరిపడా వెనక్కి తీసుకోవాలి. బ్యాంకులో ఎఫ్‌డీ ఉంటే దాన్ని రద్దు చేసుకోవడం తప్పేమీ కాదు. ఆర్జన ఉండి, నెలవారీ చెల్లింపులు చేయగలిగినప్పుడే రుణాలు తీసుకోవడం సరైనది అవుతుంది. ఆర్జన నిలిచిపోయిన సమయాల్లో కొత్తగా రుణం తీసుకోకుండా ఉండడమే మెరుగైన మార్గం అవుతుంది. కానీ, పొదుపు లేనప్పుడు, మరో మార్గం లేకపోతే చివరిగా రుణాన్ని తీసుకోవడాన్ని పరిశీలించొచ్చు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో బంగారంపై తక్కువ వడ్డీకే రుణం లభిస్తుంది. దీనిపై నెలవారీగా వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. వీటి గడువు ఏడాది, రెండేళ్లు ఉంటుంది. గడువు ముగిసిన రోజున అసలు చెల్లించడం లేదంటే తిరిగి అంతే కాలానికి రెన్యువల్ చేసుకోవచ్చు. జీవిత బీమా పాలసీపైనా రుణ సదుపాయం పొందొచ్చు. దీనిపైనా వడ్డీ రేటు తక్కువే. ఒక నెలపాటు ఉపాధి లేని వారు ఈపీఎఫ్ నిధి నుంచి 75 శాతాన్ని ఉపసంహరించుకోవచ్చు. తిరిగి ఉద్యోగం లభించిన తర్వాత పాత ఖాతాను కొత్త సంస్థకు బదిలీ చేసుకోవాల్సి ఉంటుంది. పాత నిబంధనల ప్రకారం అయితే రెండు నెలల పాటు ఉపాధి లేకుండా ఉంటే ఈపీఎఫ్ నిధి నుంచి మొత్తాన్ని ఉపసంహరించుకునేందుకు అవకాశం కల్పించే వారు. అందుబాటులోని మార్గాల్లో తమకు ఏది అనుకూలమైనదో నిర్ణయించుకుని ముందుకు వెళ్లాలి.

ఇదీ ఒక అవకాశమే

ఉపాధి లేనప్పుడు చేతిలో బోలెడంత సమయం ఉంటుంది. దీన్ని ఒక అవకాశంగా తీసుకుని, తమ నైపుణ్యాలను మరింత పెంచుకునే మార్గాలను చూడొచ్చు. దీనివల్ల భవిష్యత్తులో మరింత వేతనంతో కూడిన అవకాశాలను సొంతం చేసుకోవడమే కాకుండా, ఇతరులతో పోలిస్తే మెరుగైన వృద్ధిని చూడగలరు. ఆర్జన ఆగిందని చెప్పి, ఆందోళనతో ఉండిపోకూడదు. అవకాశాలను వెతుక్కోవాలి. అప్పటి వరకు తాము పనిచేస్తున్న రంగంలోని పని పరిస్థితులు నచ్చని వారికి.. ఉద్యోగం కోల్పోయినప్పుడు ఇతర నైపుణ్యాలతో వేరే రంగంలోని ఉపాధి అవకాశాలను సొంతం చేసుకోవచ్చు.

అత్యవసర నిధి

ప్రైవేటు రంగంలో పనిచేసే వారికి ఉద్యోగ భద్రత ఉండదు. ఊహించని విధంగా ఎప్పుడైనా ఉద్యోగం కోల్పోయినా.. లేదా నచ్చక మానేసినా అత్యవసర నిధి ఆదుకుంటుంది. కనీసం ఆరు నెలల నుంచి ఏడాది అవసరాలకు సరిపడా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలని ఆర్థిక సలహాదారులు తరచూ సూచించేంది ముందు చూపుతోనే. దీన్ని ఆచరణలో పెట్టిన వారు నిశ్చింతంగా ఉండొచ్చు. ప్రతికూల పరిస్థితులను సులభంగా అధిగమించొచ్చు. అత్యవసర నిధిని లిక్విడ్ ఫండ్స్ లేదంటే బ్యాంకు ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అత్యవసర నిధి ఆరు నెలలు లేదా ఏడాది అవసరాలకు సరిపడా ఉండాలన్నది కేవలం ఒక సాధారణ సూత్రమే. ఆర్థిక బాధ్యతలు అందరికీ ఒకే విధంగా ఉండవు. ఎంత కాలం అవసరాలకు సరిపడా సమకూర్చుకోవాలన్నది వ్యక్తిగత ఆర్థిక పరిస్థితులను బట్టే ఆధారపడి ఉంటుంది. ఉద్యోగం కోల్పోయిన సమయంలో అత్యవసర నిధిని వివేకంగా ఖర్చు చేయడం కూడా అవసరం. ఎందుకంటే తిరిగి మళ్లీ ఉద్యోగం సంపాదించి, కుదురుకోవడానికి ఎంత కాలం పడుతుందో చెప్పలేం. ఇలా ఖర్చు చేసిన మేర, తిరిగి ఉద్యోగం పొందిన తర్వాత సమకూర్చుకోవడం అంతే ముఖ్యం.

ఆదాయ మార్గాలు

ఉద్యోగం కోల్పోయినప్పుడు సహజంగా తిరిగి ఉపాధి కోసం అన్వేషణ మొదల పెడుతుంటారు. మరో ఉపాధి లభించేంత వరకు రోజులు వృథా కాకుండా, తాత్కాలిక పనిలో అయినా కుదరడం మంచి నిర్ణయం అవుతుంది. దీనివల్ల కుటుంబ వ్యయాలకు ఎంతో కొంత సమకూర్చుకోవచ్చు. ఈ కామర్స్, రిటైల్ రంగంలో తాత్కాలిక ఉపాధి అవకాశాలను పొందొచ్చు. నైపుణ్యాలు ఉండి, తక్కువ వేతనానికి పనిచేస్తానంటే ఆర్థిక సంక్షోభ సమయాల్లో కొన్ని కంపెనీలు ఉపాధి కల్పిస్తుంటాయి. అలాంటివి మార్గాలను అన్వేషించొచ్చు. తక్కువ వేతనానికి ఎందుకు చేరాలి? మంచి ఉద్యోగమే చూసుకుందాం! అని కాకుండా, మంచి ఉద్యోగ ఆఫర్‌ను గుర్తించేంత వరకు ఇలాంటి సంస్థల్లో చేరిపోవచ్చు. తమ నైపుణ్యాలకు అనుగుణంగా ఏదో ఒక తాత్కాలిక ఉపాధి పొందడం నేడు అంత కష్టమైన పనికాదు.

హెల్త్ ఇన్సూరెన్స్

ముందే అనుకున్నట్టు ప్రైవేటు రంగంలో ఎప్పుడైనా ఉద్యోగం పోవచ్చు. మెరుగైన వేతనం, పని పరిస్థితుల కోసం సంస్థను మార్చొచ్చు. ఇలా తరచూ కంపెనీలను మార్చే వారికి ఆయా సంస్థలు అందించే గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌పైనే ఆధారపడడం అంత సురక్షితం అనిపించుకోదు. సంస్థను బట్టి హెల్త్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలు, కవరేజీ భిన్నంగా ఉంటాయి. కొన్ని సంస్థలు అసలు హెల్త్ ఇన్సూరెన్స్‌నే ఆఫర్ చేయడం లేదు. ఒక ఉద్యోగి వ్యక్తిగత ఆరోగ్య అవసరాల గురించి కంపెనీలకు అవగాహన ఉండదు. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా దీర్ఘకాల వ్యాధులు, జీవనశైలి వ్యాధులు ఉండొచ్చు. లేదంటే తమ కుటుంబంలో ఈ విధమైన వ్యాధుల చరిత్ర ఉండొచ్చు. అలాంటి వారి హెల్త్ ఇన్సూరెన్స్ అవసరాలు ఇతరులతో పోలిస్తే భిన్నంగా ఉంటాయి. కనుక కంపెనీలు అందించే గ్రూప్ హెల్త్ ప్లాన్‌తో సంబంధం లేకుండా.. ప్రతి ఉద్యోగి అవివాహితులు అయితే ఇండివిడ్యువల్, పెళ్లయిన వారు ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకోవాలి. ఇలా తీసుకునే ప్లాన్ తమ అవసరాలు అన్నింటినీ తీర్చే విధంగా జాగ్రత్తపడాలి.

బీమా రక్షణ అవసరం

జాబ్ లాస్ ఇన్సూరెన్స్ అంటూ ఒకటి ఉందని మెజారిటీ ఉద్యోగులకు తెలియని విషయం. కేవలం కొన్ని కంపెనీలే వీటిని ఆఫర్ చేస్తున్నాయి. ఇందులో చాలా పరిమితులు ఉంటాయి. రుణ చెల్లింపుల బాధ్యతలు ఎక్కువగా ఉన్న వారికి ఇవి అనుకూలం. ఉద్యోగం నుంచి తొలగింపునకు గురైన సందర్భాల్లో మూడు నెలల ఈఎంఐలకు సరిపడా చెల్లింపులు చేస్తాయి. ఇలా చెల్లించే మొత్తం అప్పటి వరకు పొందిన నెలవారీ వేతనంలో 50 శాతం మించకుండా ఉంటుంది. ఈ పాలసీ వార్షిక ప్రీమియం తాము పొందే వేతనంలో 5 శాతంలోపు ఉంటేనే తీసుకోవాలి. అంతకు మించి ప్రీమియం ఉంటే అది లాభదాయకం కాదు. ఇతర పాలసీలకు అనుబంధంగాం వీటిని బీమా కంపెనీలు ఆఫర్ చేస్తున్నాయి. ప్రమాదం కారణంగా శాశ్వత, పాక్షిక అంగవైకల్యానికి గురై ఉద్యోగం చేయలేని పరిస్థితి ఏర్పడిన సందర్భాల్లోనూ ఇవి చెల్లింపులు చేస్తాయి.

ఈ విషయంలో జాగ్రత్త

జాబ్ లాస్ ఇన్సూరెన్స్‌లో ఉన్న ప్రధాన ప్రతిబంధకం.. కంపెనీ తొలగించిన సందర్భాల్లోనే వీటి కింద పరిహారం లభిస్తుంది. ఈ ప్లాన్లు ఆదరణకు నోచుకోకపోవడానికి ఇదే ముఖ్య కారణమని చెప్పుకోవాలి. కానీ, స్వచ్ఛందంగా ఉద్యోగం మానేసే వారు ముందుగానే సన్నద్ధమై ఆ పనిచేయవచ్చు. ఉన్నట్టుండి కంపెనీ తొలగించినప్పుడే కదా బీమా అవసరం ఏర్పడేది. మురో ముఖ్యమైన అంశం.. పనితీరు బాగాలేదని చెప్పి తొలగించినట్టయితే పరిహారానికి అర్హత లభించదు. కంపెనీల మధ్య విలీనం, కొనుగోలు కారణంగా తప్పించినప్పుడు కూడా బీమా కంపెనీలు పరిహారాన్ని తిరస్కరిస్తున్నాయి. పాలసీ తీసుకునే ముందు షరతులు, నియమ, నిబంధనలు, మినహాయింపులు అన్నీ చదివి తెలుసుకోవాలి. కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించిందనే దానికి ఆధారంగా ఎలాంటి డాక్యుమెంట్ లేకపోయినా,



పరిహారం లభిస్తుందా? అన్నది కనుక్కోవాలి. కాంట్రాక్టు ఉద్యోగులు, స్వయం ఉపాధిలో ఉన్న వారికి ఈ పాలసీలు ఇవ్వరు. ఆయా అంశాల్లో నిపుణుల సూచనలు అవసరం.

ఈఎస్ఐసీ బీమా..

సంఘటిత రంగంలో పనిచేస్తూ, ఈఎస్ఐసీ కిందకు వచ్చే వారికి రాజీవ్ గాంధీ శ్రామిక్ కల్యాణ్ యోజన (ఆర్‌జీఎస్‌కేవై) పథకం ఒకటి ఉంది. దీని కింద ఉపాధిని కోల్పోయిన వారికి రెండేళ్ల పాటు పరిహారం లభిస్తుంది. అప్పటి వరకు పొందిన వేతనంలో 50 శాతం ఏడాది పాటు, 13వ నెల నుంచి 24వ నెల వరకు 25 శాతం చొప్పున చెల్లిస్తారు. అదే కాలంలో ఈఎస్ఐ హాస్పిటల్స్, డిస్పెన్సరీల్లో ఉచిత వైద్య సదుపాయాలు కూడా లభిస్తాయి. తన తప్పిదం లేకుండా ఉద్యోగం నుంచి తొలగింపునకు గురైన వారు 30 రోజుల్లోపు దీనికి దరఖాస్తు చేసుకోవాలి. రూ.21వేల వేతనంలోపు వారికే ఈఎస్ఐ సదుపాయం పరిమితం. ఇంతకుమించి వేతనం ఉన్న వారు ప్రత్యామ్నాయాలు చూసుకోవాల్సిందే.

ఫీనిక్స్ మిల్స్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 1,412 టార్గెట్: రూ. 1,638

ఎందుకంటే: 2022 నవంబర్‌లో మాల్స్ లైక్ టు లైక్(ఎల్‌టీఎల్) వినియోగం రూ. 630 కోట్లుగా నమోదైంది. 2019 నవంబర్‌తో పోల్చి చూస్తే ఇది 119 శాతం అధికం. అయితే 2022 అక్టోబర్‌లో నమోదైన 18 శాతం ఎల్‌టీఎల్ వృద్ధితో పోలిస్తే తక్కువే. ఇక 2022–23లో ఇప్పటివరకూ అంటే ఏప్రిల్ నుంచి నవంబర్‌వరకూ ఎల్‌టీఎల్ వినియోగం 115 శాతం ఎగసింది. 2019 ఏడాది తొలి 8 నెలల్లో పోలిస్తే ఇంత వృద్ధి నమోదైంది. ఈ ఏడాది తొలి 8 నెలల్లో అద్దె ఆదాయం రూ. 1,370 కోట్లను తాకింది. కాగా.. ఇండోర్(మధ్యప్రదేశ్)లోని ఫీనిక్స్ సిటాడెల్ మాల్ డిసెంబర్ 1న ప్రారంభమైంది. ఈ మాల్‌లో 88 శాతాన్ని లీజుకిచ్చింది. 2023 జనవరిలో ప్రారంభంకానున్న అహ్మదాబాద్ మాల్ అయితే దాదాపు పూర్తిస్థాయిలో లీజు బుక్ అయ్యింది. ఈ బాటలో 2024కల్లా పుణే(వాకడ్), బెంగళూరు(హెబ్బల్) మాల్స్ వినియోగంలోకి రానున్నాయి. వెరసి 2020–25 మధ్య కాలంలో అద్దె ఆదాయం వార్షిక ప్రాతిపదికన 17 శాతం పురోగమించనున్నట్లు అంచనా. ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) తొలి ఆరు నెలల్లో(ఏప్రిల్–సెప్టెంబర్) అన్ని విభాగాల వినియోగం ఊపందుకోవడంతో సీఏఎం మినహా రిటైల్ అద్దె ఆదాయం రూ. 640 కోట్లకు చేరింది. 2025–26కల్లా ఫీనిక్స్ మిల్స్ 13 మిలియన్ చదరపు అడుగుల మాల్ స్పేస్‌ను అందుకోనుంది. ప్రస్తుతం ఇది 6.9 ఎంఎస్ఎఫ్‌టీని కలిగి ఉంది. 2024–25కల్లా రూ. 2,240 కోట్ల అద్దె ఆదాయం సాధించే వీలుంది.



మాస్టెక్ | ఆనంద్ రాఠీ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,718 టార్గెట్: రూ. 2,280

ఎందుకంటే: ఐటీ కంపెనీ మాస్టెక్.. యూకే హెల్త్‌కేర్, యూఎస్ రిటైల్, తయారీ, టెక్నాలజీ విభాగాలలో ఎదురైన సవాళ్లతో ఈ ఏడాది ద్వితీయ త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో బలహీన పనితీరు ప్రదర్శించింది. వీటికి క్రాస్‌కరెన్సీ సమస్యలు జత కలిశాయి. అయితే ప్రస్తుతం కంపెనీ కార్యకలాపాలు నిలకడను సాధిస్తున్నాయి. హెల్త్‌కేర్ సవాళ్లను అధిగమిస్తోంది. మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్) నుంచి కంపెనీతో మెటాసాఫ్టెక్ కార్యకలాపాలు జత కలవనున్నాయి. తద్వారా ఆదాయంలో యూఎస్ వాటా 27 శాతానికి చేరే అవకాశముంది. ఇందుకు మారిన క్రాస్‌కరెన్సీ పరిస్థితులు మద్దతివ్వనున్నాయి. క్యూ3లో సాధించిన నిలకడతో ఈ ఏడాది(2022–23) నాలుగో త్రైమాసికం(జనవరి–మార్చి) నుంచి వృద్ధి బాట పట్టవచ్చని అంచనా. వార్షిక వేతన పెంపు, ఉద్యోగ వలస తదుపరి ఇకపై నిర్వహణ మార్జిన్లు క్రమంగా మెరుగుపడనున్నాయి. క్యూ2లో మార్జిన్లు 1.34% నీరసించి 17.8 శాతానికి పరిమితమయ్యాయి. వార్షికంగా ఇవి ఫారెక్స్ నష్టాల సర్దుబాటుతో 3.34% క్షీణించగా.. వేతన పెంపు, సిబ్బంది వినియోగం 67.8 శాతానికి తగ్గడం ప్రభావం చూపాయి. త్రైమాసికవారీగా 0.9 శాతం, వార్షికంగా 5.1 శాతం వెనకడుగు వేశాయి. ఇక ఆఫ్‌షోరింగ్ యుటిలైజేషన్ 2.1% (వార్షికంగా 1.9 శాతం) తక్కువగా 73.7 శాతానికి చేరింది. సిబ్బంది నియామకాలు తగ్గడం, యుటిలైజేషన్ మెరుగుపడటం కారణంగా పటిష్ట పనితీరు చూపనుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

జీఎస్‌టీ వసూళ్లు @ రూ.1.50 లక్షల కోట్లు

డిసెంబర్‌లో 15 శాతం అప్



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు డిసెంబర్‌లో 15% పెరుగుదలతో రూ.1,49,507 కోట్లకు చేరాయి. 2021 ఇదే నెలతో (రూ.1.30 లక్షల కోట్లు) పోల్చితే ఈ పెరుగుదల 15 శాతంగా నమోదయ్యింది. తయారీ, వినియోగ రంగాల నుంచి డిమాండ్ పటిష్టంగా ఉందని గణాంకాలు వెల్లడించాయి. వస్తు సేవల పన్ను వసూళ్లు రూ.1.4 లక్షల కోట్లను అధిగమించడం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇది వరుసగా 9వ నెల.

ప్యాసింజర్ వాహన విక్రయాల్లో 23% వృద్ధి

2022లో 37.93 లక్షల యూనిట్ల అమ్మకాలు



ముంబై: దేశీయంగా 2022లో మొత్తం 37.93 లక్షల ప్యాసింజర్ వాహన విక్రయాలు జరిగాయి. 2021తో పోల్చితే 23% వృద్ధి నమోదైంది. మారుతి సుజుకి, హ్యుందాయ్, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్, స్కోడా ఇండియా కార్లు రికార్డు సేల్స్ నమోదు చేసుకున్నాయి. కరోనా ప్రేరేపిత సవాళ్లు, సెమీ కండక్టర్ల కొరత తగ్గడంతో కార్లకు, ముఖ్యంగా స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ)లకు గిరాకీ పెరిగింది.

కంపెనీ	డిసెంబర్ 2022	డిసెంబర్ 2021	క్షీణత/ వృద్ధి(%)
మారుతీ సుజుకీ	1,39,347	1,53,149	(–)9
హ్యుందాయ్	57,852	48,933	(+)18
టాటా మోటార్స్	72,997	66,307	(+)21
హోండా కార్స్	95,022	89,152	(+)7
ద్విచక్ర వాహనాలు			
రాయల్ ఎన్‌ఫీల్డ్	68,400	73,739	(–)7
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,671	5,192	(+)28

ఐఓబీ ఎండీ, సీఈఓగా అజయ్ కుమార్ శ్రీవాస్తవ



చెన్నై: ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (ఎండీ, సీఈఓ) అజయ్ కుమార్ శ్రీవాస్తవను కేంద్రం నియమించింది. 2023 జనవరి 1వ తేదీ నుంచి ఈ నియామకం అమల్లోకి వచ్చింది. చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న ఐఓబీ చీఫ్ డైరెక్టర్‌గా శ్రీవాస్తవ ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బ్యాంకింగ్ రంగంలో ఆయనకు దాదాపు 32 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉంది.

రిస్క్‌లేని రాబడులకు మార్గం

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్



మనీ మార్కెట్ ఫండ్ అంటే ఏమిటి? ఎవరు ఈ ఫండ్‌లో ఎప్పుడు ఇన్వెస్ట్ చేయవచ్చు?

– నాగరాజన్ రామనాథన్

మనీ మార్కెట్ ఫండ్ అన్నది డెట్ మ్యూచువల్ ఫండ్ పథకం. ఏడాది కాలంలో గడువు ముగిసే స్వల్పకాల డెట్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఇతర సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇవి రిస్క్‌లేని ఊహించతగిన రాబడులను ఇవ్వగలవు. ఎందుకంటే అధిక నాణ్యత కలిగిన సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. అందుకే మనీ మార్కెట్ మ్యూచువల్ ఫండ్ పథకాలు దాదాపు రిస్క్‌లేని, ఎంతో రక్షణతో కూడినవి. స్వల్పకాలానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులను ఇస్తాయి. ఎందుకంటే అవి వైవిధ్యమైన సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఏడాది కాలానికి ఇన్వెస్ట్ చేసుకునే వారు వీటిని పరిశీలించొచ్చు. బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో డిపాజిట్లపై రాబడి కంటే అధిక రాబడిని ఇవ్వగలవు. కనుక బ్యాంక్ ఖాతాల్లో ఎక్కువ బ్యాలన్స్ ఉంచుకునే వారు కూడా ఆ నిధిని ఈ సాధనాల్లోకి మళ్లించుకోవచ్చు. మొత్తం 16 రకాల డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఉండగా, లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అన్నవి రిటైల్ ఇన్వెస్టర్లకు అనుకూలంగా ఉంటాయి. మీ పెట్టుబడుల కాల వ్యవధి ఏడాది అయితే లిక్విడ్ ఫండ్స్ మంచివి. ఇవి తక్కువ రిస్క్ పథకాలు. అత్యవసర నిధికి వీటిని ఉపయోగించుకోవచ్చు. ఉపసంహరణలపై చాలా స్వల్ప చార్జీలను విధిస్తుంటాయి. ఏడాదికి మించిన దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే షార్ట్ డ్యురేషన్ ఫండ్‌ను ఎంపిక చేసుకోండి. ఏడాది నుంచి మూడేళ్ల కాల సాధనాల్లో ఇవి ఇన్వెస్ట్ చేస్తాయి. డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడంలో ఉన్న ప్రాథమిక లక్ష్యం పెట్టుబడి పరిరక్షణతోపాటు, కొంత రాబడి కోరుకోవడం. ఈ దృష్ట్యా లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ సరిపోతాయి.

ఎవరైనా ఒక మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకోసం ఫ్లెక్సీక్యాప్ లేదా మిడ్‌క్యాప్ లేదా స్మాల్‌క్యాప్‌లో దేనిని ఎంపిక చేసుకోవాలి?

– జితేంద్ర

మీరు వీటిల్లో ఒకే పథకంలో ఇన్వెస్ట్ చేయాలనుకునేట్టు అయితే అందుకు ఫ్లెక్సీక్యాఫ్ ఫండ్ అనుకూలం. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ పథకాలతో పోలిస్తే ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. లార్జ్, మిడ్ అండ్ స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులు పెట్టే స్వేచ్ఛ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మేనేజర్‌కు ఉంటుంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్ మేనేజర్ల మాదిరిగా కాకుండా.. ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మేనేజర్ లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ లో ఎక్కడైనా, ఎంత మేర అయినా పెట్టుబడులు పెట్టుకోవచ్చు. అవకాశాలకు అనుగుణంగా ఈ పెట్టుబడులను వివిధ మార్కెట్ విభాగాల మధ్య మార్పులు చేసుకోవచ్చు. పెట్టుబడులకు పరిమితులు ఉండవు. పైగా వీటిల్లో రిస్క్ తక్కువ. ఎందుకంటే పెట్టుబడులు వివిధ మార్కెట్ విలువల మధ్య విభజించి ఉంటాయి. మిడ్‌కాయ్‌ప్, స్మాల్‌క్యాప్ పథకాల్లో పెట్టుబడులనేవి ఒకే మార్కెట్ క్యాప్ పరిధిలో ఎక్కువగా కేంద్రీకృతమై ఉంటాయి. ఇది చాలా రిస్క్. ఫ్లెక్సీక్యాప్ పథకాలు కేవలం వివిధ మార్కెట్ క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడమే కాకుండా, వివిధ రంగాల నుంచి ఆయా కంపెనీలను ఎంపిక చేసుకుంటుంటాయి. దీంతో అధిక రాబడులకు అవకాశం ఉంటుంది. సాధారణంగా చూస్తే ఫ్లెక్సీక్యాప్ పథకాలు 70 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లో, 19–20 శాతం మేర మిడ్‌క్యాప్ కంపెనీల్లో, మిగిలిన 10 శాతాన్ని స్మాల్‌క్యాప్ కంపెనీల్లో పెడుతుంటాయి. ఈ ఒక్క పథకంతో అన్ని విభాగాల్లోనూ ఎక్స్‌పోజర్ తీసుకునే అవకాశం ఉన్నందున ఇది ఆల్ ఇన్ వన్ పథకం అవుతుంది.

క్లుప్తంగా...

క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఐఐఎంవీ కొత్త రికార్డు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 187 మందికి ఉద్యోగ అవకాశాలు



అత్యధిక ప్యాకేజీ పొందిన విద్యార్థులతో ఐఐఎంవీ అధ్యాపక సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఐఎంవీ) క్యాంపస్ చరిత్రలో కొత్త రికార్డు నమోదు చేసింది. మరో సెమిస్టర్ ఉండగానే 187 మంది విద్యార్థులు 100 శాతం క్యాంపస్ ప్లేస్‌మెంట్‌ని సొంతం చేసుకున్నారు. రికార్డు ఆఫర్లతో 7వ గ్రాడ్యుయేషన్ ఎంబీఏ విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. ఇప్పటి వరకూ ఐఐఎంవీ చరిత్రలో క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో రూ.17.21 లక్షలు అత్యధిక ప్యాకేజీగా విద్యార్థులు పొందగా.. ఈ ఏడాది ఆ రికార్డుని బద్దలుకొట్టారు. నలుగురు విద్యార్థులు ఏకంగా రూ.32 లక్షల ప్యాకేజీ పొందగా, 10 శాతం మంది రూ.22.72లక్షలు, 25 శాతం మంది 20.02 లక్షలు, 50 శాతం మంది రూ.17.94 లక్షల ప్యాకేజీని అందుకోనున్నారని ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులను సీడీఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ దీపికాగుప్తా, ప్రొఫెసర్ ఎం.సోమశేఖరన్ తదితరులు అభినందించారు.

నేటి నుంచి 'ఈ-ఆఫీస్'

- భౌతిక ఫైళ్లు, ఉత్తర ప్రత్యుత్తరాలకు చెల్లుచీటీ
- ఫేషియల్ రికగ్నిషన్ హాజరు కూడా నేటి నుంచే..

సాక్షి, అమరావతి: రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం నుంచి పాలనా వ్యవహారాలన్నీ ఈ-ఆఫీస్ ద్వారానే జరగనున్నాయి. ఫైళ్లు, ఉత్తర ప్రత్యుత్తరాలతో పాటు తపాల్స్ కూడా ఈ-ఆఫీస్, అధికారిక ఈ-మెయిల్స్ ద్వారానే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి భౌతిక ఫైళ్లు, ఉత్తర ప్రత్యుత్తరాలకు స్వస్తి పలకనున్నారు. ఈ-ఆఫీస్, ఈ-డిస్పాచ్, ఈ-తపాల్స్, అధికారిక ఈ-మెయిల్స్ ద్వారా పాలనా వ్యవహారాలను నిర్వహించనున్నారు. అలాగే రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సోమవారం నుంచి ఫేషియల్ రికగ్నిషన్ హాజరును అమలు చేస్తున్నారు. ఉద్యోగుల సెలవుల నిర్వహణను కూడా ఈ వ్యవస్థ'లోనే భాగం చేశారు. మిగతా కార్యాలయాల్లో జనవరి 16 నుంచి అమలు చేస్తారు.

పోలీసుల్లా వచ్చి రూ.80 లక్షలు దోపిడీ

బెంగళూరులో కేహెచ్ రోడ్డు జంక్షన్ వద్ద ఘటన

బనశంకరి: పోలీసుల్లా వచ్చి రూ.80 లక్షలు దోపిడీ చేసిన ఘటన బెంగళూరు విల్సన్ గార్డెన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... తుమకూరు జిల్లా తెవడహళ్లిలో వక్కల మండీ యజమాని మోహన్ తన డ్రైవరు చందన్, ఉద్యోగి కుమారస్వామికి శుక్రవారం రూ.80 లక్షల నగదు ఇచ్చి కారులో సేలంకు తీసుకెళ్లి ఫోన్ చేయాలని సూచించాడు. వారు కారులో నగదుతో తుమకూరు నుంచి బయల్దేరారు. బెంగళూరులో కేహెచ్ రోడ్డు జంక్షన్ వద్దకు రాగానే ఎస్ఐ, కానిస్టేబుల్ యూనిఫాం ధరించిన నలుగురు వ్యక్తులు కారును ఆపారు. ఆ వెంటనే కారులోని వారిపై దాడి చేసి కారుతో సహా ఉడాయించారు. ఈ ఘటన నుంచి బాధితులు తేరుకుని యజమానికి ఫోన్ చేసి చెప్పారు. ఆయన సూచన మేరకు విల్సన్‌గార్డెన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలుగు భాష మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దుండగుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. మోహన్ ఆర్థిక వ్యవహారాల గురించి తెలిసినవారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

'ఆర్టీసీ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలి'



ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: ఆర్టీసీని ఆర్థికంగా స్వయంసమృద్ధి సంస్థగా రూపొందించేందుకు సమష్టిగా కృషి చేయాలని సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం బస్ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఎండీ మాట్లాడుతూ టికెట్ల రెవెన్యూ, కార్గో రెవెన్యూ పరంగా గతేడాది లక్ష్యాలను సాధించామన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉద్యోగులకు సూచించారు. ఆర్టీసీ ఈడీలు బ్రహ్మానందరెడ్డి, కోటేశ్వరరావు, ఓఎస్డీ రవి వర్మ, అసిస్టెంట్ డైరెక్టర్ శోభా మంజరి తదితరులు పాల్గొన్నారు.



గ'ఘన'యానం!

మళ్లీ విమానయానానికి ప్రయాణికుల మొగ్గు

- కోవిడ్ ముందు నాటి పరిస్థితులు కనిపిస్తున్న తీరు
- గతేడాదితో పోలిస్తే 70 శాతంపైగా పెరిగిన దేశీయ ప్రయాణం
- కలిసి వస్తున్న పర్యాటకం, వాణిజ్య అవసరాలు
- కొత్త నగరాలకు కూడా విమానాల జోరు

కోవిడ్‌కు ముందు, తర్వాత విమాన ప్రయాణికుల సంఖ్య ఇదీ..

నగరం	2019లో	2021లో	2022లో
తెలుగు రాష్ట్రాల నుంచి..			
హైదరాబాద్	1,20,27,096	63,46,119	1,12,17,337
విశాఖపట్నం	17,13,317	9,51,263	14,84,743
విజయవాడ	7,92,581	3,40,637	6,11,492
తిరుపతి	5,72,581	3,37,611	5,96,160
రాజమండ్రి	2,63,844	1,79,822	2,82,925
జాతీయ స్థాయిలో..			
ఢిల్లీ	3,33,70,600	1,91,64,276	3,17,25,247
ముంబై	2,27,22,740	1,02,50,332	2,02,41,843
బెంగళూరు	1,88,58,025	87,55,900	1,72,19,584
చెన్నై	1,11,42,250	44,42,830	86,82,378

(ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య గణాంకాలు)

సాక్షి, హైదరాబాద్: గాలి మోటారు ప్రయాణం మళ్లీ గాడిలో పడింది. పనిమీదైనా, పర్యాటకానికైనా విమాన యానమే ఉత్తమమనే భావన ఏర్పడింది. కరోనా విశ్వరూపంతో కుదేలైన విమానరంగం పూర్వ వైభవం దిశగా టేకాఫ్ తీసుకుంది. దేశీయ ప్రయాణం మునుపటి వృద్ధి సాధించగా.. అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. అత్యుత్తమ సేవలతో దూసుకెళ్తున్న హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రయాణికుల సంఖ్యలో దేశంలో ఐదోస్థానానికి చేరింది. తాజాగా సమయ పాలనకుగాను స్కైట్రాక్స్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. అయితే విమానయాన రంగానికి మరోసారి కోవిడ్ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నా.. కొత్త వేరియంట్లతో మనకొచ్చే ముప్పులేదంటున్న వైద్యనిపుణుల భరోసా భయాన్ని దూరం చేస్తోంది.

సమయం.. సానుకూలం..

విమానయానంలో ప్రధానమైనది తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకోగలగడం. దీనితో ప్రయాణికులు మునుపెన్నడు లేనివిధంగా మెట్రో నగరాలతోపాటు చిన్న నగరాలకు కూడా విమాన ప్రయాణమే మంచి మార్గంగా పరిగణిస్తున్నారు. గత నెలరోజులుగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రధాన నగరాల నుంచి కేరళ వెళ్లేందుకు అయ్యప్ప భక్తులు వేల సంఖ్యలో ఫ్లైట్ ప్రయాణానికే మొగ్గుచూపుతున్నారు. దీంతో కొచిన్, త్రివేండ్రం వెళ్లే విమానాలు అయ్యప్పభక్తుల రద్దీతో కనిపిస్తున్నాయి. ఇక తిరుపతి, షిర్డీ వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారు విమానాలను ఆశ్రయిస్తున్నారు. దీనితో గతేడాదితో పోలిస్తే సదరు విమానాశ్రయాలకు ప్రయాణికుల సంఖ్యలో 70 శాతానికిపైగా వృద్ధి నమోదైంది.

కొత్త నగరాలకూ రాకపోకలు..

ఏపీలో కొత్తగా ప్రారంభమైన కడప, కర్నూలు విమానాశ్రయాల నుంచి ప్రయాణికుల రాకపోకల సంఖ్య పెరుగుతోంది. నిరుటితో పోలిస్తే యాభైశాతానికి పైగా ప్రయాణికుల సంఖ్య పెరిగినట్లు భారత విమానయాన ప్రాధికార సంస్థ(ఏఏఐ) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఎయిర్‌పోర్టులకు సమీపంలోని జిల్లాల ప్రజలు గతంలో హైదరాబాద్, బెంగళూరు విమానాశ్రయాలను ఆశ్రయించేవారు. ఇప్పుడు కడప, కర్నూలు విమానాశ్రయాలు అందుబాటులోకి రావడంతో ఇక్కడి వారికి దేశీయ ప్రయాణం చేరువైంది.

పరిశ్రమలు.. పర్యాటకంతోనూ..

పరిశ్రమల వృద్ధితో పాటు పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో దేశీయ ప్రయాణికుల రాకపోకలు గతేడాదితో పోలిస్తే 76.8 శాతం అత్యధికంగా నమోదయ్యాయి. దక్షిణ భారతదేశంలో ముఖ్య నగరంగా ఉన్న హైదరాబాద్‌కు అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. నవంబరు నెలలో 2,90,611 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.

గోవాకు మరో రెండు విమానాలు

కోవిడ్‌కు ముందు హైదరాబాద్ నుంచి దేశీయంగా మొత్తం యాభై గమ్యస్థానాలకు మాత్రమే విమానాలు రాకపోకలు సాగించేవి. ఏడాదిన్నరగా దేశీయ గమ్యస్థానాల సంఖ్య 70 చేరింది. ఆయా రాష్ట్రాల్లోని చిన్న నగరాలకు కూడా భాగ్యనగరం నుంచి రాకపోకలు సాగుతున్నాయి. త్వరలో గోవాలోని మోపా విమానాశ్రయానికి హైదరాబాద్ నుంచి ఇండిగో, గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ సంస్థలు రెండు కొత్త విమాన సర్వీసులను ప్రారంభించనున్నాయి.

అంతర్జాతీయ ప్రయాణాలు పెరిగాయి

దేశీయ ప్రయాణికులే కాకుండా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలు కూడా గణనీయంగా పెరిగాయి. దుబాయ్, మలేసియా, సింగపూర్, థాయ్‌లాండ్, యూరోప్ దేశాలకు ప్రయాణికుల రద్దీ ఎక్కువైంది. రోజూ 8వేల మందికిపైగా అంతర్జాతీయ ప్రయాణికులు ఉంటున్నారు. కొత్తగా బాగ్దాద్, ఢాకా నగరాలకు సైతం విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. వైద్యసేవల కోసం నగరానికి వచ్చే మెడికల్ టూరిస్టుల సంఖ్య క్రమంగా మెరుగుపడుతోంది.

సౌకర్యవంతంగా ఉంటుందని..



మేం 9 మంది అయ్యప్ప భక్తులం. నలభై ఐదు రోజులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకుని కొచిన్ వెళ్లి అక్కడి నుంచి శబరిమలకు చేరుకున్నాం. దర్శనం పూర్తి చేసుకుని త్వరగా గమ్యస్థానాలకు చేరుకున్నాం. సమయం, సౌకర్యవంతం రెండూ ఉన్నాయి. ఇప్పుడు అయ్యప్ప భక్తులు వేల సంఖ్యలో విమానాల్లోనే శబరిమలకు వెళ్లి వస్తున్నారు.

– డాక్టర్ శంకర్‌కుమార్, ప్రభుత్వ సిటీ కళాశాల అధ్యాపకుడు

డిమాండ్ బాగా పెరిగింది



కొద్దినెలలుగా విమానాలకు డిమాండ్ బాగా పెరిగింది. అంతర్జాతీయ ప్రయాణాలు కూడా ఊపందుకున్నాయి. ముఖ్యంగా కోవిడ్ కాలంలో రెండేళ్ల పాటు ఎక్కడికీ వెళ్లకుండా నగరానికే పరిమితమైనవారు గత ఏడాది కాలంగా ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో యూరోప్, ఆసియా దేశాలకు సకాలంలో వీసాలు కూడా లభించడం లేదు. అమెరికా ఇటీవలి వరకు పర్యాటక వీసాలపై నిషేధం విధించింది. ఇటీవలే తిరిగి స్లాట్లు ఓపెన్ చేశారు. అవీ కేవలం కొద్ది నిమిషాల వ్యవధిలోనే అయిపోవడం విశేషం. స్లాట్ల సంఖ్య పెంచితే యూఎస్‌కు విపరీతమైన డిమాండ్ పెరుగుతుందని చెప్పేందుకు ఇది నిదర్శనం.

– హతను హల్దార్, బుకింగ్ మేనేజర్, గోగాగా హాలిడేస్ ప్రైవేట్ లిమిటెడ్

'జల్లికట్టు' జోష్

అసలే కోడెగిత్తలు. సై అంటే సైసై అంటూ రంకెలేస్తాయి. అటువంటి కోడె గిత్తలను అందంగా ముస్తాబు చేసి పరుష పందేలు(జల్లికట్టు) బరిలో ఆదివారం దించారు తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలంలోని కొత్తశానంబట్ల గ్రామస్తులు. పోటెత్తిన జనసందోహం మధ్య దూసుకొస్తున్న కోడె గిత్తలను నిలువరించేందుకు యువకులు జోష్‌తో పోటీ పడ్డారు. కోడె గిత్తల విన్యాసాలు చూసి మురిసిపోయారు. కొత్త సంవత్సరం మొదటి రోజు పరుష పందేలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. – చంద్రగిరి



రంకెలేస్తూ పరుగులు పెడుతున్న కోడెగిత్తలు

3 నెలల్లో పరిపాలన రాజధానిగా విశాఖ

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్న విశాఖ పరిపాలన రాజధాని మరో మూడు నెలల్లో ఏర్పాటు కానుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా ఆయన ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి విజయనగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిపాలన రాజధాని ఏర్పాట్లు, భోగాపురం ఎయిర్‌పోర్టు, కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన పనులను రెండు, మూడునెలల్లో చేపడతామని చెప్పారు. అభివృద్ధికి కీలకమైన, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతపరమైన విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో చేపడుతున్న వినూత్న పద్ధతులను అమలు చేయడానికి నూతన సంవత్సరంలో మరింతశక్తిని ఇవ్వాలని పైడితల్లి అమ్మవారిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట సతీమణి, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, కుమారుడు డాక్టర్ సందీప్ తదితరులున్నారు.

ఆరు జిల్లాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుల మార్పు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని శ్రీకాకుళం, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కృష్ణాజిల్లా, నరసరావుపేట, ప్రకాశం జిల్లాల్లో జిల్లా అధ్యక్షులుగా కొత్త వారిని నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు జిల్లాలకు అధ్యక్షులుగా పనిచేసిన వారిని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు పేర్కొన్నారు.

అనకాపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు

▶ మొదటి పేజీ తరువాయి

మరోసారి అందించనున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ ప్రకటించారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) కింద వ్యాపార విస్తరణకు విరివిగా రుణాలను ఇప్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. దీంతో గత సర్కారు దిగిపోయే నాటికి రాష్ట్రంలో 1,05,620 ఎంఎస్ఎంఈలు ఉండగా ఇప్పుడు రెట్టింపు సంఖ్యలో 2,13,826కి పెరిగాయి. మూడున్నరేళ్లలో కొత్తగా 1,08,206 ఎంఎస్ఎంఈలు ఏర్పాటు కావడం ద్వారా రూ.20,537.28 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు 10,04,555 మందికి ఉపాధి లభించినట్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యమ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

26 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) వసూళ్లు గణనీయమైన వృద్ధిని సాధించాయని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. 2021 డిసెంబర్ నెలకు గాను ఏపీలో జీఎస్టీ వసూళ్లు రూ.2,532 కోట్లుగా ఉండగా.. 2022 డిసెంబర్‌లో 26 శాతం వృద్ధితో రూ.3,182 కోట్లకు చేరిందని తెలిపింది. తెలంగాణలో 2021 డిసెంబర్‌లో రూ.3,760 కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు.. 2022 డిసెంబర్‌లో 11 శాతం వృద్ధితో రూ.4,178 కోట్లకు చేరాయని కేంద్రం పేర్కొంది.

ఏకాభిప్రాయంపై చివరి ప్రయత్నం

▶ మొదటి పేజీ తరువాయి

కృష్ణా జలాలు వృథాగా కడలిపాలయ్యాయి. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణ సర్కారు హరిస్తుండటంపై సుప్రీంకోర్టును ఆంధ్రప్రదేశ్ ఆశ్రయించడంతో కేంద్రంలో కదలిక వచ్చింది. ఈ నేపథ్యంలో కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

తెలంగాణ సహాయ నిరాకరణ..

గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచి షెడ్యూల్-2లో పేర్కొన్న ప్రాజెక్టులను ఆర్నెల్లలోగా కృష్ణా, గోదావరి బోర్డులకు రెండు రాష్ట్రాలు అప్పగించాలి. అనుమతి లేని ప్రాజెక్టులకు నోటిఫికేషన్ జారీ రోజు నుంచి ఆర్నెల్లలోగా అనుమతి పొందాలి. లేదంటే ఆ ప్రాజెక్టుల నుంచి నీటి వినియోగానికి అనుమతించరు. బోర్డుల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసిన రోజు నుంచి 60 రోజుల్లోగా ఒక్కో రాష్ట్రం రూ.200 కోట్ల చొప్పున సీడ్ మనీగా బోర్డుల ఖాతాల్లో జమ చేయాలి. అయితే ఒకేసారి కాకుండా ఎప్పటికప్పుడు నిధులను సమకూర్చుతామని రెండు రాష్ట్రాలు బోర్డులకు స్పష్టం చేశాయి. కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లను బోర్డుకు అప్పగించేందుకు రెండు రాష్ట్రాలు తొలుత అంగీకరించాయి. ఈ క్రమంలో తన భూభాగంలో శ్రీశైలం, సాగర్ విభాగాలను కృష్ణా బోర్డుకు అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా తెలంగాణ సర్కార్ మాత్రం తన భూభాగంలోని విభాగాలను అప్పగించబోమని స్పష్టం చేసింది.

ఏకాభిప్రాయం సాధ్యమేనా..?

బోర్డుల నోటిఫికేషన్ అమలుకు తొలుత కేంద్రం నిర్దేశించిన గడువు గతేడాది జనవరి 15తో పూర్తయింది. రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో గడువును మరో ఆర్నెల్లు పొడిగిస్తూ జల్ శక్తి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో విభజన చట్టం 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న హంద్రీ-నీవా, వెలిగొండ, తెలుగుగంగ, గాలేరు-నగరి, కల్వకుర్తి(పాతది), నెట్టెంపాడు(పాతది) ప్రాజెక్టులకు అనుమతి ఉన్నట్లు పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా ప్రాజెక్టులకు అనుమతి తెచ్చుకోవాలని ఆదేశించింది. కేంద్రం పొడిగించిన గడువు కూడా గత జూలై 15తోనే పూర్తయింది. తెలంగాణ సర్కార్ కృష్ణా బేసిన్‌లో అనుమతి లేకుండా చేపట్టిన తుమ్మిళ్ల ఎత్తిపోతల, పాలమూరు-రంగారెడ్డి, భక్తరామదాస, మిషన్ భగీరథ తదితర ప్రాజెక్టులకు అనుమతి తెచ్చుకోలేదు. గోదావరి బేసిన్‌లో అనుమతి లేకుండా చేపట్టిన ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని రెండు రాష్ట్రాలు కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) డీపీఆర్‌లు సమర్పించాయి. శ్రీశైలం, సాగర్ నిర్వహణకు సంబంధించి ఆర్ఎంసీ(రిజర్వాయర్ల మేనేజ్‌మెంట్ కమిటీ) రూపొందించిన విధి విధానాలను ఆంధ్రప్రదేశ్ ఆమోదించగా తెలంగాణ సర్కార్ వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు చివరి ప్రయత్నంగా సర్వ సభ్య సమావేశాలను నిర్వహించేందుకు బోర్డులు సిద్ధమయ్యాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.